



డిశంబర్ '79
వెల 3/



JYOTI DECEMBER 1979


తప్పక చూడండి!
గిరిబాబు సమర్పించు
మాధవి చిత్ర
ముద్దు-ముచ్చట
కలర్
నిర్మాత:
యర్రా శ్రీదేవి
దర్శకత్వం
వాసు
సంగీతం:
చక్రవర్తి
తారకరామ
Bachi
THARAKARAMA


TRIVENI
BETEL NUT POWDER
PRIDE OF INDIA
CHOICE OF MILLIONS
TRADE MARK
REGD. NO. 189608
త్రివేణి
ತ್ರಿವೇಣಿ
ത്രിവേണി
திருவேணி
تروینی
त्रिवेणि
BEST PICKED
FRESH PACKED
TRIVENI
PARIMALA
NUT POWDER
TRIVENI
TRIVENI NUT POWDER MFG. CO.,
Proprietor DESU VENKATA SUBBA RAO
PORT ROAD. MACHILIPATNAM-521 001. A.P.
PHONES 458 • 270

సంస్థాపకులు
కీ॥ శే॥ వి. వి. రాఘవయ్యా

మేనేజింగ్ ఎడిటర్
శ్రీమతి వి. లీలావతి రాఘవయ్యా

డిసెంబరు 1979

సంపుటి 17 — సంచిక 11

విషయసూచిక

ఈ నెల నవలానుబంధం

కాత్యాయని

బెహరా సాహితి రచన

ముఖచిత్రం: 'దశతిరిగింది'లో దీప

జ్యోతి, 17-B రాజారాం కాలనీ, మద్రాసు-600 024. ఫోన్: 423123
సంవత్సర చందా (ప్రత్యేక సంచికతో) 43 రూపాయలు



ఫొటో: శివన్నారాయణ

శ్రీశ్రీ డెబ్భయ్యో జన్మదిన సందర్భంగా జ్యోతి సేకరిస్తున్న శ్రీశ్రీ నిధి!

మహాకవి శ్రీశ్రీ డెబ్భయ్యో జన్మదినం సాహిత్య మహోత్సవంగా 1980 మార్చిలో కాకినాడలో జరగబోతోంది. తగిన యేర్పాట్లు చేయడానికి కాకినాడలోని సాహితీపరులతో సాహిత్యాభిమానులతో ఒక సన్నాహక సంఘం యేర్పడి చురుకుగా పని చేస్తోంది. సన్మానం పేర ఒక శాలువా కప్పి నమస్కరించే పద్ధతిలో కాక, దాదాపు తన యావజ్జీవితాన్నీ తెలుగు సాహిత్యాన్ని సంపన్నం చేయడానికే ధారపోసి, తాను అతి సామాన్య ఆర్థిక స్థితిలో వుండిపోయిన శ్రీశ్రీకి ఈ సాయంసంధ్యా సమయంలో ఉపయోగకారిగా ఉండేట్టు ఒక నిధిని కూడా బహూకరిస్తే తెలుగువాళ్ళు తమ మహాకవి రుణం కొంతైనా తీర్చుకున్నవాళ్ళవుతారని "జ్యోతి" భావించింది. కాకినాడ సన్నాహక సంఘం "జ్యోతి" ప్రతిపాదనని ఆమోదించింది. తెలుగుదేశం నలువైపులా అసంఖ్యాకంగా వున్న శ్రీశ్రీ అభిమానులు తలా ఒక చెయ్యి వేస్తే ఈ శుభకార్యం తేలికగానే జరుగుతుంది. వందలూ, వేలూ అక్కర్లేదు. పది రూపాయలు చాలు, అదే పదివేలు! పదిరూపాయలకి తక్కువ కాకుండా యెంతయినా పంపవచ్చు, మీ స్తోమతనుబట్టి. డ్రాఫ్టులూ, మనియార్డర్లూ **"జ్యోతి శ్రీశ్రీ నిధి"** c/o జ్యోతి, **17-B**, రాజారాంకాలనీ, మద్రాసు-**600 024** అనే చిరునామాకి పంపండి. దయచేసి చెక్కులు పంపకండి.

మీకో సముచిత బహుమానం కూడా

పదిరూపాయలు, అంతకిపైనా పంపినవారికి శ్రీశ్రీ అప్పటికప్పుడు సంతకం చేసిన కార్డు సైజు శ్రీశ్రీ ఫోటో కానుకగా "జ్యోతి" నుంచి లభిస్తుంది. శ్రీశ్రీ ఫోటోలేని ఆల్బమ్, అబ్బ! యెంత వెలితిగా వుంటుందో!

శ్రీశ్రీ సన్మాన వేదికమీద మీ పేరు

చెక్కడంలేదు, కంగారుపడకండి. ఈవిధంగా మీవంటి శ్రీశ్రీ అభిమానులనుంచి వసూలైన నిధిని కాకినాడ సన్మానవేదికమీద నిండుసభలో మహాకవి శ్రీశ్రీకి "జ్యోతి" సమర్పిస్తుంది. "జ్యోతి శ్రీశ్రీ నిధి" సేకరణకి ఉడతాభక్తిగా తోడ్పడిన శ్రీశ్రీ అభిమానుల పేర్లన్నీ సభలో ప్రకటిస్తాము. రండి. మహాకవుల్ని గౌరవించి కాపాడుకునే పొరుగు భాషల ప్రజల దారిలో మనం కూడా నడుద్దాం! గుర్తుంచుకోండి—ఇది జ్యోతి శ్రీశ్రీ నిధి. విరాళాలివ్వడం మీ విధి.

జ్యోతి శ్రీశ్రీ నిధికి విరాళమిచ్చే శ్రీశ్రీ అభిమానుల నినాదం

"నేను సైతం రెండుశ్రీలకు టెన్నరొక్కటి సమర్పిస్తాను"

శ్రీశ్రీకి కానుకగా పదివేలు!

తెలుగు సాహిత్యానికి యెనలేని సేవ చేసినందుకుగాను మహాకవి శ్రీశ్రీకి పదివేల రూపాయల బహుమతి లభించింది. మద్రాసుకి చెందిన సాహితీ బాంధవులు శ్రీ రమణయ్య రాజా, తెలుగు సాహిత్యంలో, సాంస్కృతిక రంగంలో విశేషంగా కృషి చేసినవారిని గుర్తించి గౌరవించే మహదాశయంతో నెలకొల్పిన 'రాజా - లక్ష్మి' ఫౌండేషన్‌వారు తొలి గ్రహీతగా మహాకవి శ్రీశ్రీని యెన్నుకోవడం సంతోషించవలసిన విషయం. 'రాజా-లక్ష్మి' ఫౌండేషన్ వారినీ, శ్రీశ్రీనీ "జ్యోతి" తన పాఠకుల తరఫున హృదయపూర్వకంగా అభినందిస్తోంది.



ఫోటో: శివన్నారాయణ

నేను సైతం
ప్రపంచాబ్జపు
తెల్లరేకై పల్లవిస్తాను.

ఉత్తరాలు

ఆలస్యంగా అందిన ఉత్తరం

ఎన్నాళ్ళ కెన్నాళ్ళకు! ఎప్పుడో సుమారు పదిహేను సంవత్సరాల క్రితం కాబోలు ఇదే జ్యోతిలో బీనాదేవి తొలి రచన "రాధమ్మ పెళ్ళి ఆగిపోయింది'' చదివాను. మళ్ళీ ఇన్నాళ్ళకు తొలి రచనే అయినా వెలలేని రచన "చదరంగంలో చచ్చేది" (అక్టోబర్ సంచిక) చదివాను. మళ్ళీ క్రొత్త రచయిత(త్రు)లను, అందునా మంచి రచయిత(త్రు)లను పరిచయం చేసిన ఘనత, గౌరవం జ్యోతికే దక్కాయి. అప్పుడప్పుడు పత్రికలలో కూడా మంచి రచనలు వస్తాయి అనటానికి ఇలాటి కథలే నిదర్శనం! అయితే పువ్వులో ముల్లులా గుండు సూదిలా గుచ్చుకున్న అంశం! అనూగీతగారూ! మంచి కథలు వ్రాయగల చేవ వున్న మీరు "చదివిస్తాయి" అన్న కారణంతోనయినా సరే ప్లీజ్ కొన్ని పుస్తకాలు చదవకండి. మన అభిరుచే, మన వ్యక్తిత్వానికి అద్దంపట్టేది— మన స్నేహితులు మన నడవడికకులాగ—

—హేమలతా కృష్ణమూర్తి,
హైదరాబాదు.

నవంబర్ జ్యోతిలో తోట చంద్రశేఖరరెడ్డి గారి వుత్తరం చూశాను. "కవిరాజ విరాజిత" వుత్తరం గురించి వినకపోవడమేమిటి? పుట్టింది సాహితీవేత్తల యింట్లో. చదివింది తెలుగు ఎమ్మే. ఇంకా చెప్పాలంటే శ్రీశ్రీ గారు నాకు చిన్నాన్న అవుతారు. అయితే నా పొరపాటుని వప్పుకోక తప్పదు. ఇన్నాళ్ళూ "కవిరాజు విరాజితం" అనే భ్రమలో వున్నాను. నా భ్రమని జవాబులు కూడా మరింత నమ్మింపజేశాయి. నా తప్పుని సవరించి అనుమానం తీర్చిన శ్రీ రెడ్డిగారికి ఎంతో కృతజ్ఞతలు.


ఇక రెడ్డిగారు చెప్పినట్లు "పదబంధ ప్రహేళిక"లో అస్తమానం అచ్చు తప్పులు దొర్లుతూనే వున్నాయి. "ప్రూఫ్ రీడింగ్"లో మరింత శ్రద్ధ వహించమని జ్యోతి సంపాదకులకి సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

—లక్ష్మి, బొంబాయి-58.

నవంబర్ నెల జ్యోతిలో శ్రీ రాజ్‌కుమార్ మెహ్రాగారి ఉత్తరం చదివిన తర్వాత ఏడవాలో, నవ్వాలో అర్థంకాలేదు. తెలుగు కథలో ఆంగ్ల పదాలు చాలా తరుచుగా వాడవచ్చునని ఆయన ఉద్దేశమనుకొంటాను. ఆయన చెప్పినట్లు కొన్ని పదాలు తెలుగులో అన్వయించటం కష్టమయినా, ఆంగ్ల పదాలు తరుచుగా గుప్పించటమనడం తెలుగు పాఠకులనవలసిన మాట కాదు. వారి లేఖనుబట్టి తెలిసేదేమిటంటే— ప్రతి తెలుగు కథలో తమిళ, కన్నడ, హిందీ, ఉర్దూ, కొంకణీ భాషలు గుప్పించటం తప్పు కాదన్నమాట. వారి ఘనమైన అభిప్రాయానికి మా హృదయపూర్వకాభివందనాలు.

—లక్ష్మీజీ, అనిల్, రాజశేఖర్.
కోమళ్ళపూడి, మచిలీపట్నం.

చదరంగంలో చచ్చేది కథ చదివాను. చదువుతున్నంతసేపు, పూర్తయ్యేవరకు చదవాలనిపించింది. ప్రేమ కథలు చదివి, చదివి, విసిగిపోయిన పాఠకులకు ఈ కథ మంచి మార్పు. పాఠకులు ఎప్పుడూ మార్పునే కోరుతుంటారు. ముఖ్యంగా ప్రారంభపు వర్ణన, నూతన విధానంగా వుంది. ప్రతిమలాంటివారు ప్రతి కార్యాలయంలోను వుంటున్నారు. అటు






నోటి దుర్వాసనను ఆపండి...
కోల్గేట్ డెంటల్ క్రీమ్‌తో
దంతక్షయాన్ని ఎదుర్కోండి

ప్రతిసారి భోజనం చేసిన తర్వాత, కోల్గేట్‌తో మీ పళ్ళను తోముకోండి కోల్గేట్, ప్రపంచమంతటా దంత వైద్యులు సిఫారసు చేసే తీరులో మీకు రక్షణ సమకూరుస్తుంది.

మీ పళ్ళలో మిగిలిపోయే ఆహారపు అణువులలో బాక్టీరియా పెరుగుతుంది. అవి ముందు నోటి దుర్వాసన, ఆపైన బాధాకరమైన దంతక్షయాన్ని కలిగిస్తాయి.

అందుకే మరి ఎప్పుడూ భోజనంకాగానే కోల్గేట్‌తో తోముకోవడం సరైన మార్గం. అది మీ శ్వాసను తాజాగా రూపొందించేందుకు. పళ్ళను తెల్లగా మెరిసేలా చేసేందుకు, దంతక్షయాన్ని ఎదిరించేందుకు అమోఘమైనదని రుజువయింది.

కోల్గేట్ యొక్క నమ్మకమైన సూక్ష్మీకరణ ఎలా పనిచేస్తుందంటే :




మీ పళ్ళలో ఇరుక్కుపోయిన ఆహారపు అణువులలో దుర్వాసన, దంతక్షయాన్ని కలిగించే బాక్టీరియా పెరుగుతుంది.

కోల్గేట్ యొక్క సాటిలేని చర్యగల నురుగు బాగా లోతుకుచేరి హానికరమైన ఆహారపు అణువులను బాక్టీరియాను తొలగిస్తుంది.

ఫలితం: ఆకర్షణీయమైన తెల్లని పళ్ళు, శ్వాస తాజాగా ఉందన్న నమ్మకం, దంతక్షయంనుండి రక్షణ.

షాయినిగొల్పే, తాజా శ్వాసకోసం, పళ్ళను తెల్లగా రూపొందించేందుకు ప్రపంచంలో ఎక్కువ మంది, మరే ఇతర టూత్‌పేస్ట్ కన్న ఎక్కువగా కోల్గేట్‌నే కొంటూ ఉంటారు !



సంపూర్ణ దంత రక్షణకోసం కోల్గేట్ ట్రిగార్డ్ టూత్‌బ్రష్‌లను వాడండి. అవి పళ్ళ ఎనామిల్‌ను కాపాడి పళ్ళపైపట్టే ప్లేక్ బారినుండి రక్షించడంతోపాటు చిగుళ్ళకు రక్షణ సమకూరుస్తాయి. మీ కుటుంబంలోని ప్రతివారికి అనువుగా 8 రకాలలో దొరుకుతాయి.

ఒక్క దంతవైద్యులు మాత్రమే దీనికన్న మేలైన దంతరక్షణ సమకూర్చగలరు.

వంటివారిని అధికారులు యేమీ చెయ్యలేని పరిస్థితిలో పడుతున్నారు. యిక, చతుర్వేది చదరంగపు ఎత్తు చాలా బావుంది. ఇటువంటివారు ఎందరినో అధిగమించి ముందుకుపోతున్నారు. యికముందుకూడా యిటువంటి రచనలకే జ్యోతి ప్రాధాన్యత యిస్తుందని ఆశిస్తున్నాను.

—యమ్. సూర్యనారాయణమూర్తి,
హైద్రాబాదు.

నవంబర్ నెల జ్యోతిలో శ్రీరాజ్‌కుమార్ మెహ్రోగారి ఉత్తరం చదివాను. వారి ఉద్దేశంలో ఆంగ్లపదాలు వాడకపోతే తెలుగు కథే లేదు అన్నట్లుంది. అంటే మన తెలుగులో కథ రాయాలంటే తప్పనిసరిగా ఇంకో భాషమీద ఆధారపడాలన్నమాట. "దేశ భాషలందు తెలుగు లెస్స" అనే మాట శ్రీ మెహ్రోగారు ఎప్పుడూ వినివుండకపోవచ్చు—మరెవరయినా కావచ్చు. తెలుగు కథలో తెలుగు లోపించితే తెలుగు అభిమాని అయిన యే పాఠకుడూ సహించలేడు. ఒక అభిమాని (ఆ కథ యెంతయినా బాగుండవచ్చు) తెలుగింగ్లీష్ మిక్చర్ కథని విమర్శించినంత మాత్రాన మెహ్రోగారు అంత బాధపడనవసరంలేదు. ఏది యేమయినా తెలుగు కథలలో తెలుగు లోపించకుండా వుంటే చాలు. ఉత్తరాల శీర్షిక ప్రయోజనం యేమిటో శ్రీ మెహ్రోగారే చెప్పాలి.

—కుమారి సుధ, హైదరాబాదు.

నవంబర్ నెల జ్యోతిలో శ్రీ రాజ్‌కుమార్ మెహ్రో ఉత్తరం చదివాను. మెహ్రోగారు నేను వ్రాసిన ఉత్తరాన్ని చదివారా అని అనుమానం వస్తుంది. లేక తన అభిమాన రచయితని విమర్శించగానే కోపంతో వ్రాశారో అర్థంకావటం లేదు. తెలుగులో అనువదించటానికి వీలులేని పదాలు కొన్ని వున్నాయి. ఒప్పుకుంటాను. కానీ తెలుగులో అనువదించగలిగి యున్న మాటలను కూడ ఆంగ్లంలో వ్రాస్తే యేమనుకోవాలి? ఉదాహరణకు "Powder"కు తెలుగులో సరియయిన అర్థం లేదు. దానిని అలాగే వ్రాస్తే అందంగా యుంటుంది. కానీ **Mentality** ని మనస్తత్వంగా వ్రాయవచ్చు అనుకుంటా. శ్రీ మెహ్రోలాంటి విశాల హృదయులకి ఇది తప్పు అనిపిస్తే యెవరూ యేమి చేయలేరు. "కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్లు" ఆఖరు పేజీలో "Jyothi" అని ఆంగ్లంలో వ్రాస్తారెందుకు అని? వ్రాయటం యెలా యుందంటె ఒకే విధమయిన దుస్తులు (Uniform) పెట్టారు కదా అని అందరూ టెరికాట్ దుస్తులు వేసుక రమ్మన్నట్లుంది. పాఠకులకి కథలో తెలుగుతనం, అందరికీ అర్థం అయేలా యుండాలి. అంతేకానీ జ్యోతిలోని వ్యాపార ప్రకటనలో ఆంగ్లం యెందుకు వ్రాశారు అని కాదు కావలసింది. "ఇచ్చట ఉత్తరాల శీర్షిక ప్రయోజనం" అని వ్రాయటం యెంతవరకు సబబో మెహ్రోగారికే తెలియాలి. ఉత్తరాల శీర్షిక అనేది 'లోకోభిన్న రుచిః' అన్నదానికి నిదర్శనమయితే కానీ ఏదో ప్రయోజనం గురించి కాదు అని శ్రీ మెహ్రోగారు తెలుసుకుంటే మంచిది. అందమైన తెలుగు కథ గురించి అభిప్రాయం, అభినందన తెలియచేసింది లేనిది మరోసారి "శ్రీ రాజ్‌కుమార్ మెహ్రో"గారు అక్టోబర్ నెలలో నా ఉత్తరం చదివితే తెలుస్తుందనుకుంటా.

—జి. విజయమోహన్ రెడ్డి,
ప్రకాశ రెడ్డిపేట.

మాధవి ముఖచిత్రంతో వెలువడిన అక్టోబర్ జ్యోతి చదివి చాల చాల ఆనందించాను. ఎడారిలోని ఒయ్యాసిస్సులాగ యిక్కడ మన తెలుగు పత్రిక దొరికింది. మాతృభాషపై అభిమానం అనండీ లేక, తెలుగు తీపి అనండి; జ్యోతిలోని ప్రతి కథ ఒక్కొక్క పువ్వుగా పరిమళించింది.

"గజం మిథ్య-పలాయనం మిథ్య"—నవలానుబంధం—వంశీగారి రచన, నచ్చింది. ఎంతో ఆనందాన్ని పొందాను.

—కోలంటి సురేష్‌బాబు,
క్రాయ్డాన్, ఇంగ్లండ్.

జ్యోతి మాసపత్రికని చాలా కాలంగా,



కళాసాగర్ వేదికమీద నాట్యతార మల్లికా సారాభాయ్‌ని
సత్కరిస్తున్న చలనచిత్రతార చంద్రకళ.

చదువుతున్న వేలాది అభిమాన పాఠకులలో 'ప్రేమ సింహాసనం' సీరియల్ చదువుతున్న నేనూ వున్నాను. ఈమధ్య మీరు ప్రచురిస్తున్న తర్వాత యీ లెటర్ రాయాలనిపించింది.

మీరు సులోచనారాణిగారి సీరియల్ ప్రచురించే విధానం చూస్తుంటే, ప్రతినెలా మూడు నాలుగు పేజీలకంటే ఎక్కువ ప్రచురించరు. చాలా తక్కువగా వేస్తున్నారు. అది నాలాంటి వారికి,—నెలరోజుల తర్వాత యెంతో ఆత్రుతతో చదివేవారికి—చాలా నిరాశ కలిగిస్తోంది. ఇకముందైనా, యీ సీరియల్ కూడా ఎక్కువ పేజీలు వేస్తారని ఆశిస్తున్నాను.

డా. లక్ష్మి, తిరుమల.

మీరు ప్రచురించిన 'న వ ం బ ర్' నెల జ్యోతిలో నాకు నచ్చిన కథలు 'మనిషి' 'డప్పు'. ఈ రెండు కథలూ నా హృదయానికి హత్తుకున్నాయి. మనిషి కథలో చూపినట్లు మనిషి ఎప్పుడూ ఒకేదానిపై ఆధారపడితే వాడి బ్రతుకు శూన్యం. డప్పు కథలో వ్రాసినట్లు ఈ రోజుల్లో కష్టించి నిజాయితీగా పని చేసేవారికి ఆఖరుకి మిగిలేది రాజీనామా పత్రం.

అనుబంధ నవల్లో రచయిత చివరకు ఏం చూపించాలన్న తాపత్రయంతో ఇలా వ్రాశారో బోధపడలేదు. ఓ చిన్ని ప్లాటుని సాలెగూడు అల్లినట్లు అల్లి, చివరకు ఎవరికీ బోధపడని విధంగా వదిలేశారు.

సీరియల్స్ జోరుగా సాగుతున్నా కొద్దిగా మాత్రమే "జరుగు"తున్నాయి.

—గుండాళ్ళ లక్ష్మణరావు డి.ఎం.ఇ.
రాయగడ.

నవంబర్ జ్యోతిలో కథలన్నీ బాగున్నాయి. 'మాయాబజార్' వాస్తవానికి దగ్గరగా వుంది. చక్కని కార్టూన్స్ వేసి మమ్మల్ని కడుపుబ్బ నవ్వించారు. సీరియల్స్ అన్నీ ఆసక్తికరంగా సాగుతున్నాయి. "గుడ్‌గర్ల్" కళాశాలలో ప్రథమ బహుమతి పొందిన కథ నన్నెంతో ఆకట్టుకుంది. శైలి బాగుంది. రాగతి రమ రాసిన ఈ కథకి ప్రథమ బహుమతి ఇవ్వటం సమంజసమే.

—వై. హేమసుందర్‌రావు,
హేమబిందు, డోర్నకల్.

నవంబర్‌నెల "జ్యోతి"ని చూసి ఆనందించాము. రెండు సీరియల్స్ చాలా ఇంట్రెస్టింగ్‌గా సాగుతున్నాయి. ఎప్పుడు జ్యోతి మా ముందు వాలుతుందా అని ఎదురు చూస్తున్నాము. శ్రీమతి యద్దనపూడి సులోచనారాణి గారి అమృతహస్తం నుండి వెలువడ్డ "ప్రేమ సింహాసనం" సీరియల్ మరీ తక్కువ పేజీలు వేస్తున్నారు. మరి రెండు మూడు పేజీలు పెంచితే బాగుంటుంది. కథ లన్నింటిలోను జీడిగుంట రామచంద్రమూర్తిగారి హనీమూన్ కథ బాగుంది.

—కుమారి సీరపు నాగలక్ష్మి, రాజమండ్రి.

అక్టోబర్ "జ్యోతి"లో "ప్రేమసింహాసనం" "మీరా" సీరియల్స్ రెండు యెంతో ఆసక్తికరంగా వున్నాయి. కథలు కార్టూన్‌లు కూడా యెంతో బాగున్నాయి.

—హెచ్. జగదీశ్వరి, హైదరాబాదు.

తెలుగు దాహం

"మనసు చెప్పిన కథ"మీద ఒక పాఠకుని ఘాటు విమర్శ చదివి ఇది రాస్తున్నాము. గౌ॥ పాఠకుడు ఇంతకు మునుపు ఆంగ్ల+తెలుగు కథలు మరెక్కడా చదవనట్లు అమాయకంగా వ్రాసిన ఉత్తరం, ఆతని ఆవేశం నవ్వు కలిగించాయి. పైగా జ్యోతిమీద వల్లమాలిన అభిమానంతో "ఇలాంటి కథలు వెయ్యకండి" అని ఇచ్చిన ఉచిత సలహా ఆయనగారి సంకుచిత మనస్తత్వాన్ని చాటి చెబుతుంది. చాలాకాలం క్రితమే "హాంగ్ మి క్విక్", "థ్యాంక్స ఫర్ పి. ఎమ్" వంటి పేర్లతో నవలలు కథలు అవతరించాయి. అవతరిస్తున్నాయి కూడ. బహుశా పాఠకుడు పరవస్తు చిన్నయసూరి, నన్నయ, పెద్దనాది మహాకవుల సాహిత్య ప్రభావాలకు పరవశుడై ఇప్పటి వచన రచనా రీతులను అభినందించలేని ఛాందసు డనుకోవాలి!

'యాంటీ సెంటిమెంటు' మీద వచ్చిన బహు కొద్ది మంచి కథల్లో 'మనసు చెప్పిన కథ' ఒకటి. జీవితాన్ని జీవితంగా చూపిన రచయిత

కాటూరి రవీంద్ర త్రివిక్రమ్ అభినంద నీయుడు.

ఇక కథా సంవిధానంలో పాఠకుడు ఎత్తి చూపిన వాక్యం పరిశీలిద్దాం! "ఐ వాంట్ మెంటల్ రిలీఫ్" అనుకుంటున్నది పాత్ర!

రచయిత రాసినది పాత్ర మనోభావాలు మాత్రమే! ఇది పూర్తిగా పాత్రోచితమైన వ్యక్తీకరణ అని కథా పరిశీలన జ్ఞానం వున్నవాళ్లెవరైనా అంగీకరిస్తారు. ఇందులో పాఠకుడు చూస్తున్న తప్పు ఆయన అవగాహనా లోపమే తప్ప రచయిత పొరపాటు కాదు!

వారి 'తెలుగు దాహం' తీరాలంటే కేవలం సాహిత్యపరంగా ప్రచురితమయ్యే పత్రికలు లేక సనాతన సంప్రదాయ సాహిత్య గ్రంథాలు తిరగవెయ్యటం మంచిది. ఒక సూటి ప్రశ్న! ఇద్దరు తెలుగువాళ్ళు కలిస్తే తెలుగే మాట్లాడుతున్నారా?

— సూర్యప్రభ, రాజేంద్ర, క్రిష్ణప్రభు.
హైదరాబాదు.

బ్యాంకువారి పత్రికలు

జ్యోతి కథ ప్రస్తావన

ఆంధ్రా బ్యాంక్ వారి హౌస్ జర్నల్ "మేజికార్డ్" తాజా సంచికలో పామర్రు బ్రాంచి నుంచి శ్రీ వరప్రసాద్ అడిగిన ఒక ప్రశ్న: "కుష్ఠురోగి మనా బాంక్ ఖాతాదారుడుగా కావచ్చా?"

జవాబు: చట్ట ప్రకారం కుష్ఠురోగులు బ్యాంకుల్లో ఖాతా తెరవకూడదనే నిషేధమేమీ లేదు. బ్యాంకులోకి అందరూ ప్రవేశించవచ్చు.

'జ్యోతి' తెలుగు మాసపత్రిక అక్టోబర్ సంచికలో ప్రచురించబడిన—కథల పోటీలో మూడవ బహుమతి పొందిన కథ—"చదరంగంలో చచ్చేది" చూడవలసిందిగా పాఠకుణ్ణి కోరుతున్నాం.

సాంస్కృతిక విశేషాలు

పోస్ట్స్ అండ్ టెలిగ్రాఫ్స్ డిపార్టుమెంట్ విజయవాడ వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో 25-9-79 నుండి 28-9-79



విశాలాంధ్ర ప్రచురణాలయం వారి నవలల పోటీలో ప్రథమ బహుమతి గెలుకున్న రచయిత శ్రీ వి. రాజారామమోహనరావు బహుమతి ప్రదానోత్సవ సభలో మాట్లాడుతున్న చిత్రం

వరకూ నిర్వహించిన నాటిక పోటీలలో శ్రీ ఇ.ఆర్.డి. రాములు రచించిన "ప్రభంజనం" నాటికకు, ఉత్తమ ప్రదర్శన ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ నటుడు బహుమతులు లభించాయి.

శ్రీరాములు ఉత్తమ దుష్టపాత్రధారి బహుమతి కూడా అందుకున్నారు.

న్యూ డైరెక్షన్స్

ఆంధ్రభాషలో వస్తోన్న కవిత్వానికి అంతర్జాతీయ వేదిక నొకదానిని నిర్మించే మహదాశయంతో "న్యూ డైరెక్షన్స్" సంస్థ పుట్టింది. పలువురు ప్రముఖ కవులు, వర్ధమాన కవులూ కలసి ప్రారంభించిన న్యూడైరెక్షన్స్‌కి వేగుంట మోహనప్రసాద్ సారధి. తొలి ప్రయత్నంగా "తెలుగు కవిత" పేరుతో సుమారు నలభై మంది కవుల కవితల్ని ఇంగ్లీషులో అనువదించి నూటయాభై పేజీల పుస్తకంగా వెలువరించాలని "న్యూ డైరెక్షన్స్" నిర్ణయించింది. ఈ సంకలనానికి వేగుంట ఎడిటర్‌గా నిర్వహిస్తున్నారు. తెలుగు కవిత్వానికి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడానికి చేస్తున్న ఈ సత్కార్యం సానుకూలపడడానికి వీలుగా సాహిత్యాభిమానులు వంద రూపాయలకి తక్కువ కాకుండా విరాళాలిచ్చి ప్రోత్సహించవలసిందిగా "న్యూ డైరెక్షన్స్" మనవి చేస్తోంది. విడిప్రతి వెల ఇరవై రూపాయిలు. ఇతర వివరాల:

—వి. మోహనప్రసాద్,
హెడ్. డిపార్ట్‌మెంటాఫ్ ఇంగ్లీష్,
సిద్ధార్థ కాలేజి,
విజయవాడ.

మల్లికాసారాభాయ్ నృత్యాలు

నవంబర్‌లో సప్తమ వార్షికోత్సవాన్ని మద్రాసులో దాదాపు అరవై వేలరూపాయల వ్యయంతో ఘనంగా జరుపుకోబోతున్న ప్రముఖ సాంస్కృతిక సంస్థ 'కళాసాగర్' అక్టోబర్ 8వ తేదీన మ్యూజిక్ అకాడమీ హాలులో మరో భారీ యెత్తు కార్యక్రమం యేర్పాటు చేసింది. ఇంతకు ముందెన్నడూ మద్రాసులో ప్రదర్శన లివ్వని నాట్యతార మల్లికాసారాభాయ్ నృత్యాన్ని ప్రపంచప్రఖ్యాతి గాంచిన నర్తకి శ్రీమతి మృణాళిని సారాభాయ్ వ్యాఖ్యానంతో ఈ కార్యక్రమం జరిగింది.

వందలాదిమంది విదేశీ యాత్రికులతో హాలు కిటకిటలాడింది.

మల్లికాసారాభాయ్ ప్రదర్శించిన "మయూర కుంత్" నృత్యం రంగుపూసి నేలమిద పరిచిన పదిహేను చదరపు అడుగుల గుడ్డపై జరిగింది. నృత్యం పూర్తయ్యేసరికి పింఛం విప్పుకొని వున్న నెమలిబొమ్మ ఆ తెల్లగుడ్డపై చిత్రించబడి వుండడం ఆ నృత్యవిశేషం.

మద్రాసు నగరంలోని ప్రముఖ నాట్య బృందాలన్నీ ప్రేక్షకులుగా వచ్చి శ్లాఘించిన ఈ రసవత్తర కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన 'కళాసాగర్'ని యెంతైనా అభినందించాలి.

శ్రీమతి మృణాళిని సారాభాయ్, మల్లికాసరాభాయ్‌లను నటి కుమారి చంద్రకళ "దర్పణ" నాట్యాచార్య ద్వయం శ్రీ చిలకమర్తి రామాచార్యులు, శ్రీ రామస్వామిలను ప్రముఖ వాణిజ్యవేత్త శ్రీ బి. వి. యస్. యస్. మణి కళాసాగర్ తరఫున బెనారస్ పట్టుశాలువలతో సత్కరించారు. సంగీతదర్శకులు శ్రీ తాతినేని చలపతిరావు అధ్యక్షత వహించారు.

గతి!

అప్పుడే మరిచిపోయారు
జయప్రకాశ్ మృతి,
అదండీ
మందేశం గతి!

—సమత

విశ్వవిఖ్యాత నటసార్వభౌమ, నటరత్న,
డా॥ యన్.టి. రామారావు నటించు
సత్యతాయ్ ప్రొడక్షన్స్

శృంగార రాముడు

కలర్

దర్శకత్వం: కె. శంకర్



ం:కె.వి.మహదేవన్

విడుదల: ఆంధ్ర: తారకరామ

సీడెడ్: నవభారత్

మైసూర్: అజంతామూవీస్

తొలిమాట

ఆమె మూర్తీభవించిన మానవత. ఆమె దీనులకోసం ద్రవించి ప్రవహించిన మమత. ఆమె పాద స్పర్శతో భరత భూమి పులకించి తరించింది. జాతి జీవనాన్ని చిందరవందర చేస్తున్న వర్తమాన రాజకీయ సంక్షోభానికి దూరంగా, దరిద్ర నారాయణుల బతుకుల్లో యింత మనశ్శాంతినీ, వారి ఆకలి మంటల మీద యిన్ని చన్నీళ్ళనీ చిలకరించడానికి వచ్చిన శాంతిదేవత ఆమె. ఆమె తల్లి థెరసా. మదర్ థెరసా. ఈ యేటి నోబెల్ శాంతిబహుమతి థెరసా మాతకి లభించడం విశ్వమానవతావాదానికి లభించిన గౌరవం. మదర్‌ని 'జ్యోతి' మనసారా అభినందిస్తోంది.

*　　*　　*

తెలుగు నవలారంగంలో ఒక కొత్త ప్రయోగంగా చెప్పుకోదగిన వినూత్న నవలని వచ్చే సంచిక నుంచి సీరియల్‌గా ప్రచురించబోతున్నాం. వివరాలు లోపలి పేజీలలో యిస్తున్నాము. దీనితో 'జ్యోతి'లో సీరియల్ నవలల సంఖ్య మూడుకి పెరుగుతుంది.

*　　*　　*

కళాశాల విద్యార్థుల కోసం 'జ్యోతి' ప్రకటించిన చిన్న చిన్న కథల పోటీకి వస్తున్న కథల సంఖ్య గణించదగిందిగానే వుంది, కానీ సారమే సంతృప్తికరంగా లేదు. కథావస్తువు విషయంలో మరింత శ్రద్ధ తీసుకోవలసిందిగా విద్యార్థి రచయితలను కోరుతున్నాము.

కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో ప్రథమ బహుమతి పొందిన కథ

ఎదలో యలలో

అలా చూడకూడదని తెలుసు కాంతారావుకి.

అలా చూడ్డం తప్పనీ తెలుసు!

తదేకంగా అలా చూస్తే తరవాత జరిగే ప్రమాదం కూడా తెలుసు.

అయినా చూడకుండా వుండలేకపోతున్నాడు.

పద్దెనిమిదేళ్ళ యవ్వనం!

సౌందర్యపు పూలరాసి పోసినట్టు—

కళ్ళ ముందు కనిపిస్తూ — ఎదలోని కోరికను కదలిస్తోంది.

"ఛ! తప్పు!" అనుకొని గోడవేపు తిరిగి పడుకున్నాడు.

ఊహు!....కళ్ళు మూసినా తెరిచినా అదే రూపం కళ్ళముందు కదుల్తోంది.

వెల్లికిలా తిరిగి ఎదురుగా నున్న కిటికీ లోంచి బయటకు చూశాడు. బయట గంట క్రితం నుండీ పడుతున్న వర్షం చిన్న తుంపరగా మారింది. కిటికీలోంచి చలి గాలి శరీరాన్ని తాకి గిలిగింతలు పెడుతూ ఎదలోని కోరికకు వేడి పుట్టిస్తోంది.

మంచానికి దిగువున చాపపై హాయిగా నిద్రపోతోంది కాంతారావు మరదలు సుజాత. సీలింగ్ ఫ్యాన్ గాలికి ఆమె ముంగురులు అందమైన ఆమె ముఖంపై నాట్యమాడుతున్నాయి. నిద్రలో పైట జారింది.

ఓసారి భార్య మంచం వైపు చూశాడు. కొంచెం దూరంలో మంచంపై నిద్ర మాత్రల మత్తులో హాయిగా నిద్రపోతోంది లక్ష్మి.

మొదటి కాన్పు కష్టం కావడంతో ఆపరేషన్ చెయ్యవలసి వచ్చింది ఆమెకు. అతి కష్టంమీద బిడ్డ దక్కకపోయినా తల్లిప్రాణాలు కాపాడగలిగారు డాక్టర్లు.

తనో మాతృమూర్తిగా....పాపతో ఎలా ఆడుకోవాలో....రోజులు ఎంత ఆనందంగా దొర్లించేయాలో వూహించుకొని.... భవిష్యత్‌ని ఓ సుందర స్వప్నంగా మలచుకున్న ఆమెకు ఇదో పెద్ద 'షాక్' అయింది. ఆ కారణంగా నిద్రకు దూరమైన ఆమెను నిద్ర మాత్రలు వాడమన్నారు డాక్టర్లు.

అక్క ఆరోగ్యం కొంత కుదుటపడేవరకూ ఇంటి పనులు చేయడానికి వచ్చింది సుజాత.

రోజంతా పనులతో అలసిపోయిన శరీరంతో రెండు మంచాలకూ మధ్యన 'చాప' వేసుకొని మత్తుగా నిద్రపోతోంది సుజాత.

బయట కురుస్తున్న వర్షం—ఎదలో కదులుతున్న కోరికా—నరాలను వేడెక్కిస్తుంటే—

నెమ్మదిగా మంచం దిగాడు కాంతారావు.

చప్పుడు చెయ్యకుండా సుజాత ప్రక్కనే కూర్చున్నాడు. మెల్లగా....మెల్లగా ఆమెపై చెయ్యి వేశాడు.

"ప్లీ....జ్....డి....య....ర్....!" సుజాత కదిలింది అస్పష్టంగా గొణుగుతూ.

భయపడిపోయాడు కాంతారావు. చెయ్యి తీసేశాడు. ఆమె గొణిగిన అక్షరాలు కూడ బలుక్కుని మరోసారి మననం చేసుకున్నాడు. "ప్లీజ్ డియర్" కొంపదీసి నిద్ర నటిస్తోందా? మళ్ళీ చెయ్యి........

"ప్లీజ్ రాజా! నీకెన్నిసార్లు చెప్పాలి? పెళ్ళి కాకముందు ఇలాంటి పనులు నాకు నచ్చవని....ఇలా అయితే రేపటినుండీ నేనింక రాను" నిద్రలో కలవరిస్తోంది సుజాత.

త్రుళ్ళిపడ్డాడు కాంతారావు.

'మై గాడ్! తన తొందరపాటు....ఎంత ఘోర పరిస్థితిని తెచ్చిపెట్టి వుండేది?.... ఇద్దరు ప్రేమికుల జీవితాలు శాశ్వతంగా నాశనమై వుండేవి... ఛ! తను ఇవాళ ఎందుకిలా ప్రవర్తించాడు?' నొచ్చుకుంటున్నాడు కాంతారావు.

ఇంట్లో చాపపై అలాగే హాయిగా నిద్రపోతోంది సుజాత....ఏదో సుందర స్వప్నంలో విహరిస్తూ. □

—జ్యోత్స్న (ఇంటర్)

రాయగడ కాలేజీ, ఒరిస్సా.

క్రొత్తగా!

వేడివేడి వడ్డనలకు ఇగ్లూ హాట్‌ప్యాక్, వండి నాలుగు గంటలైనాసరే ఎంతో కమ్మదనము



మళ్ళీ వేడిచేయడం అంటూ వుండదు :

ఇప్పుడు వంట త్వరగా చేసుకోండి. కూరలైనా, పులుసైనా, అన్నమయినా సరే, క్రొత్తగావచ్చే ఇగ్లూ హాట్‌ప్యాక్‌లో పెట్టి మూతపెట్టండి. ఎంతసేపైనాసరే, 4 గంటలదాకా అప్పటికప్పుడు వండినట్లు తాజాగా వేడిగా పొగలొస్తూ రుచిగా కమ్మగా వుంటాయి.

కాలము–ఇంధనము ఆదా :

ఇగ్లూ హాట్‌ప్యాక్ వాడితే తిరిగి వేడిచేసి వడ్డించే అవసరంలేదు. ఆ రోజులు పోయినాయి. ఎంతో తీరిక వుంటుంది. ఖర్చు తక్కువగా వంట అవుతుంది. సాధారణంగా తిరిగి వేడిచేస్తే ఆహారంలో సత్తువపోతుంది.

ఇగ్లూ హాట్‌ప్యాక్ సుప్రసిద్ధమైన జనరల్ స్టోర్సులలో కావలసిన సైజులో లభిస్తుంది. ఇవ్వాళే ఇగ్లూ హాట్‌ప్యాక్ ఇంటికి తీసుకు వెళ్ళండి. మీకన్నీ లాభాలే. ఇంకా ఎంతో తీరిక కూడా!

ఇదే నిదర్శనము!

ఈ ప్యాక్‌ను రెండు నెలలపాటు వుపయోగించి పరిశోధించి, మద్రాసులో పాకశాస్త్రమునకు సంబంధించిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ క్యాటరింగ్ టెక్నాలజీవారు చెప్పినది గమనించండి:

"ఇందులో వేడి నిల్వశక్తి చాలా బాగా వుంటుంది తాజాతనము ఎంతమాత్రము చెడదు... ౮ గంటల తరువాత కూడా. రుచి ఏమీ తగ్గదు. ఇవి చాలా సమర్ధవంతమైనవి."

OBM 4897 TG

IGLOO hotpack

మెటోప్లాస్ట్‌వారి తయారీ

మెట్టూర్ బియర్డ్‌సెల్ లిమిటెడ్


డిస్ట్రిబ్యూటర్లు : (2)

కోస్తా ఆంధ్రప్రదేశ్

తెలంగాణా

రసజీవన మధురాధర హసనం!

ప్రేమసింహాసనం



యద్దనపూడి సులోచనారాణి

సీరియల్ **15**

తర్వాత పదిహేను రోజులవరకూ స్వప్న సుధీర్ కంటికి కనిపించలేదు! ఆ సాయంత్రము టైపిస్ట్ యింటికి రాగానే, గుడిలో జరిగినదంతా చెబుతుంటే, అతను నిర్ఘాంతపోయాడు. ఆ సమయంలో చాలా ముఖ్యమైన కేసుగురించి, పార్టీతో చర్చిస్తోన్న వాడల్లా ఆ సంగతే మర్చిపోయినట్టుగా, చరచరా ఫోన్ దగ్గరకు వెళ్ళి విమలకి డయల్ చేసాడు. అవతలనుంచి విమలకి బదులు తండ్రి తీసాడు. ఆయన కంఠం ఎలాటి తొట్రుపాటు లేకుండా పైనుంచి సుధీర్‌నుంచి ఫోన్‌కోసం యెదురుచూస్తూ వున్నట్టేవుంది.

"మామయ్యా! విమల ఏం చేసిందో తెలుసా?" ఆవేశంగా అడిగాడు సుధీర్.

"తెలుసురా! నీ కారుని గుడిదగ్గరనుంచి యింటికి తీసుకొచ్చేసింది! అంతేగా! అందులో దాని తప్పేమీలేదు."

"మామయ్యా!"

"ఎందుకురా అలా అరుస్తావు! విమలకి నీమీద అధికారం వుందని, అవతల వాళ్ళకి అర్థం అయ్యేలా చెప్పింది. అంతేగా!"

"అంతేగా! అందులో మంచీ మర్యాదాలేదా?"

"మంచి, మర్యాద! ఏమిటా మంచి!"

"నేను స్వప్నకి కారుయిచ్చి పంపాను! విమల అవమానం చేసింది స్వప్నని కాదు. నన్ను!"

ఆయన అతని ఆవేశాన్ని, బాధని జాగ్రత్తగా ఆకళింపు చేసుకుంటున్నవాడిలా మౌనంగా వుండిపోయాడు.

"నా కిష్టం వచ్చిన వాళ్ళకి నేను కారు యిస్తాను. నా కారుమీద ఆ మాత్రం నాకు హక్కులేదా?"


"హక్కా! హక్కులమాట ఎత్తితే నానుండి నువ్వు చాలా వినాల్సి వస్తుంది. విమల తెలిసో తెలియకో చేసిందిలే. ఆ అమ్మాయికి ఆ మాత్రం అర్థంగాదా ఏమిటి? నువ్వు పొరపాటు జరిగిందని చెప్పెయ్యి."

"ఎంత తేలికగా చెప్పేస్తున్నావు కదూ!"

"జీవితంలో చాలా విషయాలు తేలికగా తీసిపారెయ్యాలి. ఉడుకు రక్తంతో

జరిగిన కథ :

తనని బలవంతం చేసిన పొరుగింటి మోహన్‌ను ఆత్మరక్షణార్థం చేతికందిన వస్తువుతో కొట్టింది స్వప్న. మోహన్ మరణించాడు. స్వప్నపై హత్యానేరం మోపబడింది. ఆ షాక్‌తో స్వప్న తల్లి చనిపోయింది. స్వప్న మేనమామ లక్ష్మీరంజనం స్వప్నను కాపాడమని తన శిష్యుడు సుధీర్‌ను కోరాడు. సుధీర్ తన ప్రతిభతో స్వప్నకు శిక్షపడకుండా చేశాడు. స్వప్నకు సీరియస్‌గా వుందన్న కబురు తెలిసి పార్టీనుంచి ఆందోళనగా వెళ్ళాడు సుధీర్. స్వప్నను హాస్పిటల్‌లో చేర్పించాడు. సుధీర్ సహాయం వద్దనుకొనికూడా పొందవలసే వచ్చింది. స్వప్న మేనమామ వెంట వాళ్ళింటికి వెళ్ళింది. మేనమామ భార్య రుసరుసలాడింది స్వప్నని చూసి. మేనమామ భార్య తనకు బలవంతంగా పెళ్ళి ఏర్పాటు చేస్తే తప్పించుకు పారిపోయింది స్వప్న. ఒక డాక్టరు మిత్రుడు ఫోన్‌చేస్తే వెళ్ళిన సుధీర్ పెళ్ళిదుస్తుల్లో వున్న స్వప్నను అక్కడ చూసి ఆశ్చర్యపోయాడు. స్వప్నను నర్సు మరియమ్మ ఇంట్లో ఉండే ఏర్పాటు చేశాడు డాక్టరు. స్వప్న కారణంగా తనకిచ్చిన మాట పోగొట్టుకున్నందుకు సుధీర్‌పై కోపగించుకొంది విమల. స్వప్నని ఓదార్చి, పెళ్ళి చేసుకొంటానని చెప్పి, తన కౌగిలిలోకి తీసుకొని ముద్దాడినట్లు కలగన్నాడు సుధీర్. మెలకువ వచ్చినా స్వప్నని తాకిన అనుభూతిని మాత్రం మరువలేకపోయాడు. తల్లి బలవంతాన, విమలకు సారీ చెప్పేందుకు బయలుదేరాడు సుధీర్. ఆపదలో వున్న స్వప్నను తా నాదుకోవలసిన పరిస్థితులను మామయ్యకు వివరించి, తర్వాత విమలతో ముచ్చట్లాడి ఆమె కోపాన్ని పోగొట్ట గలిగాడు సుధీర్. సుధీర్ ప్రోత్సాహంతో బి. ఎ. పరీక్షకు కట్టింది స్వప్న. తనకు తెలియకుండానే సుధీర్‌ని అభిమానించ సాగింది. పరీక్ష లయ్యాయి. సుధీర్ మేనమామ కూతురు విమల స్వప్నని అవమానించింది.



వున్న నీకిది యిప్పుడు చెప్పినా అర్థంకాదు. నీకు అంతబాధ కలిగినట్టయితే విమలని నీకు సారీ చెప్పమంటానులే।"

"నాకెవ్వరి క్షమార్పణలూ అవసరంలేదు। ఈరోజు విమలచేసిన యీ అవమానం నా జన్మలో మర్చిపోనన్నాని చెప్పు"

"అదికాదురా."

సుధీర్ ఆ మాట వినిపించుకోనట్టే ఫోన్ పెట్టేశాడు.


అతను ఒక్కక్షణం పెదవి కొరుకుతూ అలాగే నిలబడి పోయాడు. స్వప్న వెళ్ళిపోతూ టైపిస్టుతో, "మీ లాయరుగార్కి మెనీ మెనీ థాంక్స్ చెప్పానని చెప్పు" అందిట. ఆ మాటలు అతన్ని వేయికత్తుల్లా చీలుస్తున్నాయి. స్వప్న స్వాభిమానం అతను ఎరగనిదేం కాదు। విమల యీ రోజు ఎంత అఘాయిత్యం చేసిందో, అది వాళ్ళకి అర్థంకాదు. అవతల అర్జంట్ కేసు గురించి మాట్లాడుతూ లేచి వచ్చాడు. ఇప్పుడు మధ్యలో వాళ్ళని వదిలించుకుని వెళ్ళటంకూడా సాధ్యంకాదు. అతని మనసు నరకం అయిపోయింది। విమల స్వభావం చిన్నప్పటినుంచీ అంతే। ఎదుటివారు యేమనుకుంటారోననే సంకోచం లేదు। ఇది అనకూడనిమాట అనే వెరపులేదు। విమలని అని లాభంలేదు. ఆ తలితండ్రుల పెంపకం అలాటిది।

క్లయింట్స్ వెళ్ళేసరికి రాత్రి 10 గంటలు దాటింది. వాళ్ళు వెళ్ళగానే అతను అప్పుడు వెళ్దామని కారు తాళాలు తీసుకున్నాడు. గడియారం ఠంగ్ ఠంగ్‌న పది

గంటలుకొట్టి టైమ్ చాలా అయింది సుమా అన్నట్టు హెచ్చరించింది. అతను బయలదేరిన వాడల్లా ఆగి మళ్ళీవచ్చి కుర్చీలో కూర్చుండిపోయాడు. ఇంత రాత్రి వెళితే బాగుంటుందా? మరియం నిద్రపోయిందేమో! ఆవిడని నిద్రలేపాలి! ఆవిడ ముందు తను స్వప్నతో ఏమని మాట్లాడాలి? రేపు వుదయం పది గంటలకి ఆవిడ హాస్పిటల్‌కి వెళ్ళిపోతుంది. అప్పుడయితే స్వప్న ఒంటరిగా వుంటుంది. తనేదయినా నచ్చ చెప్పగలిగే అవకాశం కలుగుతుంది. అతనికి అంతరాళాల్లో స్వప్నకి నచ్చచెప్పటం అనేది అంత తేలిక అయిన విషయం కాదని తెలుస్తూనేవుంది! అయినా ఏదో నమ్మకం!

మర్నాడు పదిగంటలు అవటానికి పదియుగాలు పట్టినట్టుగా అయింది! కారు తీసుకుని సరాసరి మరియం యింటికి వెళ్ళాడు. మరియం హాస్పిటల్‌కి వెళ్ళిన మాట నిజమే. కానీ స్వప్న యింట్లోలేదు. ఇంటికి తాళం వేసివుంది. అతను ఒకగంట తర్వాత వచ్చాడు. తాళం వేసేవుంది. కోమలి యింటికి వెళ్ళాడు. కోమలి స్వప్న ఉదయం నుంచీ, తనకి కనుపించలేదని చెప్పింది. అతను సరాసరి మరియం వున్న క్లినిక్‌కి వెళ్ళాడు. మరియం స్వప్న తను వచ్చేవరకూ యింట్లోనే వుందని, యెక్కడికి వెళ్ళిందో తనకి తెలియదని చెప్పింది.

సుధీర్ ఆరోజు కోర్టుకి వెళ్ల లేదు. సాయంత్రం కోమలికి ఫోన్‌చేశాడు.



కోమలి మరియం ఇంటికివెళ్ళి తిరిగివచ్చింది. స్వప్న యింట్లోలేదు. మరియం క్లినిక్‌నుంచి యింటికి తిరిగి వచ్చిందట.

సుధీర్ సాయంత్రం వెళ్లాడు. మరియం ముందు అతను మొహమాట పడదల్చుకోలేదు. అతన్ని చూడగానే మరియం ఎప్పటిలానే, ఆదరంగా ఆహ్వానించింది. 'రండి, రండి' అంది.

"స్వప్న ఎక్కడ?" అతను లోపలికి వస్తూనే అడిగాడు.

"అదే మీకు ఫోన్‌చేసి చెప్పాలని అనుకుంటున్నాను. స్వప్న చూశారా! ఎంతపని చేసిందో. నాకు చెప్పకుండా వెళ్ళిపోయింది! ఉండండి, ఒక్క నిమిషంలో వస్తాను" అంటూ లోపలికి వెళ్ళి చీటీ ఒకటితెచ్చి అతని చేతికి యిచ్చింది. అది చూడగానే అతడు నీళ్ళుగారి పోయాడు. అందులో యిలావుంది. "మరియంగార్కి. మాకు తెలిసిన బంధువొకాయన వచ్చారు. నేను అతనితో వూరు వెళ్తున్నాను. తాళం చెవులు పక్కింట్లో ఇస్తున్నాను. ఇన్నాళ్ళూ మీరు చూపిన ఆదరణకి నా కృతజ్ఞతలు." అతను అది చూడగానే 'మైగాడ్!' అంటూ కుర్చీలో కూలబడినట్టుగా కూర్చుండిపోయాడు. 'స్వప్న అసలు యిలాంటి పని ఎందుకు చేసిందో నాకేం అర్ధంగావటం లేదు. కనీసం కోమలికికూడా వెళుతున్నానని చెప్పలేదుట! ఎంత బంధువు వస్తే మాత్రం, కాస్త మనకి మాటమాత్రం చెప్పకూడదా? మీరెంత సాయం చేశారు. ఆ అమ్మాయి మీకుకూడా చెప్పకుండా వెళ్ళిందంటే, కించిత్‌కూడా కృతజ్ఞతలేదన్న మాట. ఏమిటో లాయరుగారూ! ఈ రోజుల్లో పిల్లలే అలావున్నారనుకుంటా! వారికి

వచ్చేసంచిక నుంచే ప్రారంభం!

తెలుగులో సైంటిఫిక్, సస్పెన్స్, రొమాంటిక్
సీరియస్, సీరియల్ నవలాయుగం!

యుగాంతం!

ధారా వాహిక నవల



"పగళ్ళన్నీ పగిలిపోయి నిశీథాలూ విశీర్ణిల్లి
మహాప్రళయం జగంనిండా ప్రగల్భిస్తుంది!"

రచన యండమూరి వీరేంద్రనాధ్

తోచింది చేసేస్తారు. ఎదుటివారి గురించి ఆలోచనే వుండదు. మనల్ని అభిమానించే వారిని బాధపెడ్తున్నామే అనే విచక్షణే వుండదు సుమండీ!' మరియం ఏదో చెబుతూనే వుంది. కానీ ఆ మాటలేవీ అతని చెవులకి ఎక్కనే ఎక్కటంలేదు. స్వప్న ఊరు వెళ్ళిపోయిందా! ఎక్కడికి వెళ్లింది. ఇంత హఠాత్తుగా ఏ బంధువు యే ఆకాశంనుండి వూడిపడ్డాడు. అతని తల తిరిగిపోతున్నట్టుగా వుంది. స్వప్న అభిమానం గాయపడి వుంటుందని తెలుసు. కానీ, ఇంత విపరీతమైన పరిణామం తెచ్చే విధంగా వుంటుందని అనుకోలేదు. తనతో మాట్లాడకపోవటం, మౌనంగా వుండిపోవటం, అలాంటిది చేస్తుందనుకున్నాడు. స్వప్న యిలా స్నేహానుబంధాలు ఒక్కసారిగా తెంపేసినట్టుగా చేస్తుందని అనుకోలేదు. నిర్దాక్షిణ్యంగా యిద్దరిమధ్యా పెనవేసుకుంటున్న బంధాన్ని కత్తిరించి వేసింది. స్వప్నలో ఎంత గుండె ధైర్యం! ఎంత మొండితనం. తను ఏమయిపోతానా అని రవంతకూడా స్వవిషయం గురించి లక్ష్యపెట్టలేదు. భయపడలేదు.

సుధీర్ ఇంటికి తిరిగి వచ్చేశాడు. అతని మనసంతా అల్లకల్లోలంగా వుంది. స్వప్న తన మనసుని ఎంత పెనవేసుకుందో, యిప్పుడుగాని అర్థంగాలేదు! అతనికి రోజూ పడుకునేటప్పుడు స్వప్న ఏం చేస్తోందో అని, ఉదయం లేచినప్పుడు ఈరోజు ఏ పుస్తకాలు ఆమెకి పంపాలా అని ఆలోచనగా వుండేది. అతను ఎంత పనుల వత్తిడిలోవున్నా, స్వప్నని గురించిన ఆలోచన గుండెల్లో మారుమూల గుబాళిస్తూనే వుండేది. వాటి సౌరభం అతనికి ఒక హాయిని చేకూర్చేది. స్వప్న తనది. ఈ ఆలోచన అతనిలో ఎప్పుడు ప్రవేశించిందో అతనికే తెలియదు. అతని మనసులో యిన్ని ఆలోచన్లు రేకెత్తించినట్లుగా స్వప్నకి తెలియదు. తెలిస్తే బహుశా అంత నిర్దాక్షిణ్యంగా వెళ్ళిపోగలిగేది కాదేమో!

15 రోజులు గడిచాయి.

స్వప్న ఏమయిపోయిందో అతనికి అంతుబట్టలేదు. ఆచూకీ దొరకలేదు. పేపర్లో ప్రకటించాడు. పోలీసు రిపోర్ట్ యిచ్చాడు. పేపర్లో ప్రకటన చూడగానే మేనమామ మండిపడ్డాడు :

'వ్యవహారం చాలా ముదిరిందే!' అన్నాడు.


'నీకెందుకింత ఆరాటం ఆ అమ్మాయి గురించీ' అంటూ నిలదీశాడు.

"నీ ప్రశ్నకు జవాబు యిప్పుడు చెప్పలేను మామయ్యా. స్వప్న కనిపించిన తర్వాత చెప్పగలనేమో!" అన్నాడు.

"అంటే నీ వుద్దేశ్యం ఏమిటి? స్పష్టంగా చెప్పరాదూ?"

"నాకే స్పష్టంగా తెలియటంలేదు. నేనెలా చెప్పగలను?"

"విన్నావా అమ్మా వాడి మాటలు?" ఆయన చెల్లెలివైపు తిరిగాడు.




ఇది తప్పక

డెట్

డిటర్జెంట్

బిళ్ల వుతుకే



Shilpi DM 35A/78 Tel

"సుధీ! ఏమిట్రా యీ గొడవ! ఎందుకిలా చేస్తున్నావు?" అంది తల్లి.

"నీకు తెలియదమ్మా! నీకు చెప్పినా అర్థంగాదు" అస్పష్టంగా అన్నాడు.

ఇంట్లో ఇదొక పెద్ద తుఫాను అయిపోయింది. కానీ సుధీర్ దాన్ని యీషణ్మాత్రంకూడా లక్ష్య పెట్టటంలేదు.

'ఆ అమ్మాయి సంగతి యిక వదిలేయ్' అన్న తల్లిమాట కూడా అతను పట్టించుకోవడం లేదు.

15 రోజుల అనంతరం.

పోలీసుల సహాయంతో అతనికి స్వప్న ఎక్కడ వున్నదో ఆచూకీ దొరికింది.

స్వప్న బంధువుల యింటికి వెళ్ళలేదు! ఈ వూరిలోనే సికిందరాబాద్‌లో, మరియం చెల్లెలు యింట్లో వుంది!

సుధీర్ టైపిస్ట్‌కి డిక్టేట్ చేస్తుండగా, పోలీస్ ఆఫీసర్ దగ్గరనుంచి ఫోన్ వచ్చింది!


ఫోన్‌లో ఆ వివరాలు వినగానే అతను, టైపిస్ట్‌తో 'అక్కడకి ఆపు చెయ్యి. వచ్చి డిక్టేట్‌లో చేస్తాను' అంటూనే కారు తాళాలు తీసుకుని వెళ్ళిపోయాడు.

సుధీర్ కారు గేటులో నుంచి రంయ్‌న బాణంలా దూసుకు వెళ్ళిపోవటం, సాంతం గమనించిన తర్వాత, టైపిస్ట్ వెంటనే లోపలకి పరుగెత్తి అహల్యమ్మగారికి చెప్పాడు. ఈ మాట వినగానే ఆవిడ ముఖం వెలవెలాపోయింది! వెంటనే అన్నగార్కి చేసింది. ఆయన యింట్లో లేడట! రాగానే అర్జంటుగా రమ్మనమని చెప్పింది. ఫోన్ ఫోన్ పెట్టయ్యగానే అనుకుంది. లాభంలేదు! విషయం యింకా ముదరకముందే జాగ్రత్త పడాలి! స్వప్న అంటే వీడికెందుకింత యిష్టం. అదే ఆవిడకి అర్థంగావటం లేదు! సుధీర్ ఆడపిల్లల్ని చూస్తే కరిగిపోయే మామూలు మగపిల్లల కోవకి చెందడు. అందచందాల విషయం వస్తే విమలే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటుంది. మరి ఆకర్షణ ఏమిటి? అదే ఆవిడకి అర్థంగావటంలేదు.

16

సాయం చీకట్లు జగత్తుని ఆవరించుకుంటున్నాయి. శీతాకాలం అవడంవల్ల మంచు పొగలా, ఇళ్ళమీద చెట్లమీద వ్యాపిస్తోంది! సుధీర్ డ్రైవ్‌చేస్తున్న కారు స్వప్న అడ్రస్‌ని వెతుక్కుంటూ వస్తోంది! చివరికి రద్దీలేని ఒక స్ట్రీట్‌లో చివర యింటిగా గుర్తు పట్టింది!

ఇంటి తలుపులు వేసివున్నాయి! తలుపు ప్రక్కన జాన్ మోసెస్, అని వుంది. సుధీర్ కాలింగ్ బెల్ నొక్కాడు.



ఒక్క నిముషం అయింది। గడియ తీసిన శబ్దం వినిపించింది। తలుపులు తెరుచుకున్నాయి।

ఎదురుగా స్వప్న నిలబడి వుంది।

అతన్ని చూడగానే స్వప్న కళ్ళు పెద్దవైనాయి.

సుధీర్ స్వప్ననే చూస్తూ నిలుచున్నాడు. తలంటపోసుకున్నట్టుంది. ఎర్రటి రిబ్బన్‌తో జుట్టు కట్టుకుంది.

ఒక్క నిముషం, గుమ్మం బైట అతను, గుమ్మానికి లోపల స్వప్న యిద్దరూ, స్థబ్దులైనట్టుగా, ఆ గుమ్మమే యిద్దరి మధ్యావున్న అంతులేని అఘాతం అన్నట్టుగా, దాన్ని దాటటం శక్యం కాదన్నట్టుగా నిలబడిపోయారు।

చివరికి, సుధీర్ తనే ఆ అఘాతం దాటి, స్వప్నవైపుకి, లోపలికి వచ్చాడు।

"స్వప్నా! నువ్వేం చేసావా తెలుసా?" అన్నాడు.

స్వప్న మాట్లాడలేదు.

అతనికి స్వప్నని చూడగానే అంతులేని ఆవేశం వచ్చేసింది. ఆగ్రహంతో వుక్కిరిబిక్కిరి అయాడు.

"ఏదయినా పొరపాటు జరిగితే, అవతల వాళ్ళ బాధ్యత ఎంతవరకూ వుందా అని ఆలోచించాలి। కనీసం వాళ్ళు యిచ్చే సంజాయిషీ వినేవరకైనా ఆగాలి। అంతే

గానీ అంత తొందరపడి నీకు నువ్వే యిలాటి నిర్ణయాలు చేసుకోవటం న్యాయం కాదు!"

"ఎవరిదగ్గర నుంచి ఎలాటి సంజాయిషీ వివాలని నాకు ఆసక్తి లేదు. విన్నంత మాత్రాన ప్రయోజనమూ లేదు."

"అంతేనా!"

స్వప్న మాట్లాడలేదు.

అతను నిష్టూరంగా చూస్తూ అన్నాడు. "స్వప్నా! నువ్వు తెలివిగలదానివి! నీకేది తెలిసినా తెలియకపోయినా, నిన్ను అభిమానించేవాళ్ళని దూరం చేసుకోకూడదు అనేది మాత్రం బాగా తెలిసి వుండాలి! నువ్వు యిలా చెప్పకుండా వచ్చేసినందుకు, నేనెంతనరకయాతనకి గురి అయ్యానో బహుశా చెప్పినా నీకు అర్ధం కాదేమో! నా మూలంగా నీకు కలిగిన బాధకి వడ్డీతో సహా తీర్చేసావు! ఎవరో నిన్ను ఏదో అంటే నేనా బాధ్యుడిని! ఇందులో నా తప్పేముంది? నీ పట్ల నాకున్న అభిమానానికి దానికీ ఎందుకు ముడిపెడతావు?" అతను క్షణం ఆగి అన్నాడు. "నీ ముందు నా మనసు దాచుకోదల్చుకోలేదు! నువ్వంటే నాకిష్టం! నిన్ను అభిమానించటం నా కుటుంబ సభ్యులకి యిష్టం లేదు! కానీ, వాళ్ళ కారణంగా, నువ్వు నా నుంచి దూరం వెళ్ళిపోవటం న్యాయం కాదు! అది పిరికితనం అంటాను!"

స్వప్న విసురుగా తల తిప్పి చూసింది. ఆ కళ్ళలో రోషం కన్పిస్తుంది!

అతను అనునయంగా అన్నాడు.

"ఇంటికి వెళదాం రా స్వప్నా!"

"ఇంటికా! ఏ యింటికి?"

"నా యింటికి! మన యింటికి!"

స్వప్న అతన్నే చూస్తోంది!

"నిన్ను మరియం యింట్లో వుంచటం నాదే తప్పు! అప్పుడే యింటికి తీసుకు వెళ్ళాల్సింది! ఆరోజు ఆ పని చేయలేనందుకు చాలా శిక్ష అనుభవించాను."

స్వప్న అతన్నే చూస్తోంది.

"మాట్లాడవేం స్వప్నా!"


"మీకు-మీకు-ఎలా చెప్పాలి! రేపు నేను క్రిష్టియన్‌గా కన్వర్ట్ అవుతున్నాను! అన్ని ఏర్పాట్లు పూర్తి అయినాయి? మతసేవచేసే ప్రచారకురాలిగా అవుతున్నాను!"

సుధీర్ పిడుగుపాటు చెందినవాడిలా నిశ్చేష్టులైనట్టు చూస్తున్నాడు!

స్వప్న క్రిందికి చూస్తూ అంది 'మీరు-మీరు. నాకింతవరకు చేసిన సహాయానికి కృతజ్ఞురాలిని!'

సుధీర్ ఆ మాట విననట్టుగా దిగ్భ్రాంతి చెందాడు.

"ఏమిటి? నువ్వు క్రిష్టియన్‌గా కన్వర్ట్ అవుతున్నావా? ఎవరు చెప్పారు నీకీ



ఆలోచన?"

"ఇది ఒకళ్ళు చెప్పిన ఆలోచన కాదు। నాకు నేనే చేసుకున్న నిర్ణయం।"

సుధర్ ఒక అడుగు ముందుకు వేసి స్వప్న చేయి పట్టుకోబోయాడు. స్వప్న మెరుపులా తటాలున రెండడుగులు వెనక్కి జరిగి దూరంగా నిలబడింది.

"ఇందులో తప్పు ఏమిటో నాకేం కనిపించటంలేదు। నేనేం చేస్తున్నానో నాకు బాగా తెలుసు। ఈ ప్రపంచంలో నేను వంటరివాన్ని. నాకెవ్వరూ లేరు।" స్వప్న కంఠం కంపించింది. "నాకు ఆశ్రయం కావాలి। రక్షణ కావాలి। నాకు చర్చి యివి కల్పిస్తుంది। మన మతంలో యిలాంటి సదుపాయం ఎందుకు లేదో నాకర్థం కావడం లేదు। నాలాటి నిరాశ్రయులకి అనాధలకి ఆసరా కల్పించలేని మతం మీద నాకెందుకు అభిమానం వుండాలి। ఆఫ్టరాల్। దేవుడు ఒక్కడే। పేర్లు మార్పు అంతే।"

సుధీర్ స్వప్ననే తదేకంగా చూస్తున్నాడు।

"స్వప్నా। ఇది జరగని పని।"

"ఎందుకు జరగదు। యిది నా నిర్ణయం।" స్వప్న దృఢంగా జవాబు చెప్పింది.

(సశేషం)

కళాశాల విద్యార్థుల చిన్న చిన్న కథల పోటీలో రెండవ బహుమతి పొందిన కథ

తిరుగుబాటుకు బలి

బండి మెల్ల మెల్లగా కదుల్తుంది.

ఎడ్లు దమ్ము తీసుకుంటూ నడుస్తున్నాయి.

కాలం వేగంగా పురుకుతున్నట్టు, బండి మెల్లగా కదులుతున్నట్లు అనిపించింది రామానాయుడికి.

"అరేయి నర్సిగా—ఎడ్ల గెదుము.... జర జల్దిన పోనీయ్ బండి, ఏమాయెరా నిద్రబోతున్నావురా, గాడిద కొడుక, గెదుమురా.... గెదుము" దొర మాటల్లో తీవ్రత, ఆతృత, ఆవేదన.

లంకెమొద్దు తెంచబడ్డట్లుగా పరుగు లంకించుకున్నాయి ఎడ్లు.

ఆ వూరికి మకుటంలేని మహారాజు రామానాయుడంటె.

అతడి దగ్గర గల పాతికమంది జీతగాళ్ళలో నర్సిగాడు ఒకడు.

డబ్బు లేకున్నా కులం కున్న తాహతు నర్సయ్యను బండెక్కించ గలిగింది.

హఠాత్తుగా రామానాయుడి కొడుక్కి జ్వరం ముంచుకొచ్చింది. ఆ వూళ్ళో దవాఖాన వుంది. పేరుకి డాక్టరూ వున్నాడు. కాని డాక్టరు దర్శనమిచ్చే రోజులకంటె హాస్పిటల్ రిజిష్టర్‌లో అతగాడి హాజరు మూణ్నాళ్లు రెట్లు అన్న సంగతి అందరికి తెలుసు. అయినా ఎవడూ నోరెత్తడానికి వీలులేదు. కారణం దొరకి డాక్టరుకి లాలూచీఉన్నాయని వదంతి.

కొడుకు తలను ముట్టిచూసిన దొరకు శరీరం పేలిపోతున్నట్లుగా అనిపించింది. "అబ్బా....పెయ్యి పెనంలా కాలిపోతుందే" అన్నాడు దొరసానితో.

డాక్టరు వూళ్ళో సమయానికి లేకపోవడం ఎంత పెద్ద దెబ్బో ఇప్పుడర్థమైంది అతడికి. కంపౌండరు తన చేతగానితనాన్ని బయట పెట్టడంతో డాక్టరును వెతుక్కుంటూ పట్నం దారి పట్టక తప్పలేదు. డాక్టరు విషయంలో అతడు చేసిన తప్పేమిటో ఈరోజు అర్థమైంది. అయ్యాల నర్సిగాడి పెళ్ళాం సచ్చిపోయినంక వాడెంత చెప్పుకున్నాడు తనకు.

తెగ విచారిస్తున్న దొరకు బండి వేగం తగ్గినట్టనిపించింది. డాక్టరుపై కోపం, తనపై తనకే ఏర్పడిన అసహ్యమంతా నర్సిగానిపై చూపించి గెదమడం....నర్సిగాడు ఎడ్లను అదిలించడం ఒకేసారి జరిగిపోయినాయి.

బండి పరుగెత్తుతుంది.

బండి ముందర దౌడు తీస్తున్న మస్కురోడు తెగ రొప్పుతున్నాడు.

బండిలోని విషాదం, దొర దొరసానితో చెప్పే మాటలు అన్ని వింటున్న నర్సిగాని ఆలోచనలకు పచ్చజెండా ఊపినట్లయింది.

ఆలోచనల్లో పడ్డ నర్సిగాడు పగ్గాల్ని అదిలించడం మానేసాడు. ఒక్కసారిగా ఎడ్లు, మస్కురోడు ప్రాణం లేని బండి ఊపిరి పీల్చుకున్నాయి.

అదే........

ఆ రోజు....ఆ రోజు........

ఇదే దొర........

దొర గెదమడంతోబాటు అట్లను జారవిడిచాడు.


శరీరానికి మెదడుకు సంబంధం తెగిపోయింది.

* * *

ఆర్నెల్ల క్రితం....

ఎండలు తీవ్రంగా మండుతున్నాయి. ఆ ఏడాదికి కాలం పోయినట్లుగానే భావించారంతా.

రోళ్ళూ, రోకండ్లూ పగలతమేమో కాని భూములు బీటలు పారడం, ఊళ్ళో జ్వరాలు ప్రారంభమయినాయి.



ఆ రోజు తను గుడిసెకు చేరగానే తన పెళ్ళాం "మల్లి" మూల్గులు వినిపించాయి.

దగ్గరకెళ్ళి చూసిన నర్సిగాడికి పెళ్ళాం జ్వరంతో కన్పించింది.

అయ్య మాటలు వినబడగానే గుడిసెకు చేరింది వాడి కూతురు లచ్చిమి.

వారం రోజులుగా దవఖానకు వెళ్ళడం, కంపౌండర్ యిచ్చిన గోళీలు, రంగునీళ్ళు తెచ్చి తాగించడం జరుగుతూనే వుంది.

అయినా జ్వరం జారుకోలేదు!

వాడు సంపాదించే జీతపు గింజలు, వాడి పెళ్ళాంకు వచ్చే కూలిరాళ్ళు తిండికి సరిపోగా మిగిలిందేదయినా వుంటే ఈ వారం రోజుల్లో కరిగిపోయింది.

కంపౌండర్ని గట్టిగా అడిగితే ఇంత కాలం తనకు చేతనయింది చేశాను, పట్నం కెళ్ళి సూది మందులు తెచ్చుకోమనీ, పుణ్యాని కొచ్చిన మందులతోని రోగం తక్కువ కమ్మంటే అయితాదీ అన్నాడు.

"పట్నంకెళ్ళి మందు త్తెచ్చుకోవడమంటే మాటలా?"

పది రూపాయలన్నా గావాలె. పది రూపాయలేమోగాని పది పైసలన్నా పుట్టించ లేదే తను.

ఏం చేయాలి?

ఏం చేయాలి.......?

.......చేయాలి.......చేయాలి.

ఊళ్ళో ఎవడికయినా అప్పు పుట్టించా లంటె ఉన్న ఒక్క ఆశ రామానాయుడు దొరే.

"ఆ దొర దగ్గర బాకీ తీసుకోవట్టే తను ఇట్లా అయ్యిందు, అయినా తప్పదు మరి" అనుకున్నాడు.

* * *

ఇంటి ముందర వరండాలో కూర్చొని పొగ పీలుస్తున్నాడు దొర.

"అయ్యా"....... అన్న నర్సిగాడి పిలుపు.

పొగ....పొగ....పొగ, నర్సిగాడి మొఖం మీదనుండే పోతుంది.

"ఏందిరా? ఏమయ్యింది?"

"దొరా....నీ కాల్మొక్త దొరా.... నా పెళ్ళాం చావు బతుకుల్లో వుంది దొరా....! జెరంతోని గొట్టుక సత్తంది. ఇక నివ్వే దిక్కు. దొరా. పది రూపాయలు అప్పియ్యి దొరా.... బతికుంటే నేనూ అది ఇద్దరం ఏ పనన్న జేసి జేసి తీరుస్తాం దొరా.

"మన కంపౌండరు దొరకు సూపిస్తె పట్నంపోయి మందులు తీసుకరమ్మన్నడు

దొర!"

"ఇగ నీవే దిక్కు దొర."

....

"ఆ:....ఏందిరా....

"నీకు బాకీ ఇయ్యమంటవు.

"ఇంతకు ముందున్న బాకీ తీర్చినావురా? మళ్ళీ ఇయ్యమంటవింకా?"

"దయ దొరా....చచ్చి నీ కడుపున పుడ్త.

"మరి మొన్నటి పైకం ఏం జేసినవురా?

"అ అప్పెప్పుడు తీరుస్తవు — మళ్ళీ ఇయ్యాల కొత్తగా కావాలంటున్నావురా!

"గిదేరా.... గిదే.... ఒక్కసారి యిత్తే ఎప్పటికీ అడుగుతార్రా — అడిగేటోడికి ఇచ్చే టోడు లోకువైతడట."

"జెర్ర కనికరించండ్రి దొరా."

"కులపోనివని కనికరం జూపిస్తెనెగదరా ఆ అప్పు అట్లనే ఏడ్తంది."

"జీవితాంతం మీదగ్గర పడుంటం దొరా...."

నర్సిగాడి మాటల్లో ఆతృత........ ఒకటే ఆతృత.... పెళ్ళాన్ని బతికించుకోవాలన్నదే కోరిక.

ఇంకోసారి "దొరా" అని కాళ్ళపైబడ్డాడు.

బండలాంటి దొర గుండెలో ఎక్కడో ఒక చోట నీటి బిందవు మెరిసింది.

"అరేయ్ నర్సిగా....లే....లేరా.

"పైక మెంత గావల్రా?"

"పట్నంపోయి మందు తేవల్దొరా."

"అదే....అదేరా....ఎంతఇయ్యమంటవు?"

....

"సరే ఇస్తాగాని...........

బాయి దగ్గరకెళ్ళి నీళ్ళు కట్రాపో."

వేగం....ఒకటే వేగం.

"అయ్యా............"

"కట్టొచ్చిన బాంచను."

"ఇగోరా యీ పది రూపాయలు తీస్కో."

పరుగుతో నడక....ఒకటే పరుగు.

* * *

"అయ్యా....అయ్యా" అంటూ ఎగబోస్తూ ఎదురుగా వచ్చిన కూతుర్ని చూడగానే గుండె ఝల్లుమంది నర్సిగాడికి.

కూతురి ... (line cut off at bottom of page)

రాజయ్య—"నీ పెళ్ళాం చచ్చిందిరా నర్సీ...." అన్న మాటలు చెవిన పడ్డంతోనే గుడిసెకు పరిగెత్తాడు.

పట్నం నుంచి తెచ్చిన మందులు మధ్యలోనే జారిపొయ్యాయి.

అప్పటికే చుట్టుపక్కలవారంతా గుడిసె ముందు పోగైనారు. నర్సిగాడ్ని చూడ్డంతోనే శవం చుట్టూ గుమిగూడిన జనం పక్కకు జరిగారు. చచ్చిన పెళ్ళాన్ని చూడగానే గొల్లుమన్నాడు.

నిజంగా అది ఏడుపు కాదు.

గుండెను అరగదీసి కార్చిన కన్నీళ్ళు.... ఎంత ప్రాణంగా చూసుకునేవాడు తన పెళ్ళాన్ని. కట్టుకున్నప్పట్నించి ఒక్కనాడయినా కొట్టాడా తన మల్లిని. ఈనాడు తనను విడిచి ఏకంగా వెళ్ళింది. తన్నే కలువరిస్తూ పోయిందట. ఆఖరికి దేవుడి క్కూడ కండ్లు కుట్టినయో ఏమో—తమ ముచ్చటైన జోడి చూడలేక తీస్కుపోయాడు.

ఏడ్పులు........ఏడ్పులు

ఏడ్పుల మధ్య బాధగా భావాలు వెలికి వస్తున్నాయి. నర్సిగాడి ప్రసక్తి లేకుండానే శవం పాడెపై చేరింది.

* * *

గతం కళ్ళముందు సినిమా రీల్లా గిర్రున తిరుగుతూంటే స్పృహ తప్పుతున్నట్లుగా, కళ్ళముందంతా తెల్లగా శూన్యంగా దర్శనమిస్తోంది. జారుతున్న కన్నీళ్ళని తువ్వాల్లాంటి పై పంచతో అద్దుకున్నాడు.

బాటపై పడుతున్న ఎండంతా వాడి కళ్ళల్లో చిత్తబడ్డట్లు, కంకర రాళ్ళపై కదులుతున్న బండి వాడిలోని ఆవేశాన్నంతా కుదుపుతనట్లయ్యింది.

తన పెండ్లాం మల్లి చావుకి వీడే....వీడే.

మధ్య మధ్య దొర గెదుముడుకు ఒక్కసారి పగ్గాల్ని అదిలించడం—బండి రోడ్డు పక్కగా వున్న బండ ఎక్కి, గుండలోకి దొర్లిపోవడం ఒకేసారి జరిగిపోయినాయి. □

కె. వెంకటేశ్వర్ బి. కాం.
(ద్వితీయ) వరంగల్



రాత్రి పది దాటింది.

టేబులు చుట్టూ కూర్చున్నారు వాళ్ళు నలుగురూ. వాళ్ళ చేతుల్లో గ్లాసులున్నాయి. టేబుల్ మీద సీసాలున్నాయి. కాంబినేషన్‌గా తినుపదార్థాలూ వున్నాయి.

ఛీర్స్!!!

—నాలుగు గొంతులూ ముక్తంగా పలికాయి.

వాళ్ళు యవ్వనంలో వున్నారు. ఆరోగ్యంగా వున్నారు. బలిసి వున్నారు. కొవ్వు పట్టి వున్నారు.

వాళ్ళు వికారంగా ఏమీ లేరు. విలన్లలాగానూ లేరు.

వాళ్ళు నాజూగ్గా వున్నారు, అప్‌టు డేట్‌గా వున్నారు. హీరోల్లా వున్నారు, హీరోల బాబుల్లా వున్నారు.

వాళ్ళు అందంగా వున్నారు, ఆహ్లాదంగా కనిపిస్తున్నారు. సంతృప్తికి ప్రతిరూపాల్లా వున్నారు సంతోషాలకి ప్రతినిధుల్లా కనిపిస్తున్నారు. దిగుళ్ళకు దూరంగా వున్నారు, దరిద్రులకి కలలు తెప్పించేట్లున్నారు.

వాళ్ళ పరిచయాలు ఇలా పరిమళిస్తుంటాయి:

నెంబర్ వన్—చంద్రం—ఎక్స్ ఎమ్మెల్యే మరియూ ప్రస్తుతపు ఎంపీకి కొడుకు. చదువు వంటపట్టనివాడూ, చదువు మధ్యలో వదిలి పెట్టినవాడూ. ఒక షుగర్ ఫ్యాక్టరీకి డైరెక్టరూ, ఒక పెట్రోల్ బంక్‌కి డీలర్‌షిప్ సంపాదించిన వాడూ. ఆ టౌన్లో కాసనోవాగా ప్రసిద్ధికెక్కిన వాడూ, అభినవ రాకుమారుడూ, చేతిలో కారున్న వాడూ, చేతిక్రింద గూండాలున్నవాడూనూ.

నెంబర్ టూ — గోపాల్ — అక్కడి డి ఎస్పీకి కొడుకు. జులాయిగా పెరిగినవాడూ, బలాదూరుగా తిరిగినవాడూ. తండ్రి హోదానీ దర్పాన్నీ తండ్రి స్టాఫ్ ముందు ప్రదర్శించే వాడూ, ఊళ్ళో ఉపయోగించుకుంటున్నవాడూ. ఇతను దుర్యోధనుడైతే తండ్రి ధృతరాష్ట్రుడు. ఇతను సంజయుడైతే తండ్రి ఇందిరడు.

నెంబర్ త్రీ—మౌళి—ఆ టౌన్లోకెల్లా పెద్దదైన టాకీసుకి వోనరు. తల్లి చనిపోయిన వాడూ, తండ్రి తెలియనివాడూ. పుట్టుకతో కర్ణుడూ, పెరుగుతూ రావణుడూ. ఒక ఖూనీ కేసునుంచి తప్పించుకున్నవాడూ, ఇద్దరు పడతుల మానాల్ని మలినించినవాడూ రాక్షసాంశను జీర్ణించుకున్నవాడు!

నెంబర్ ఫోర్ — ప్రకాష్ — ఆ టౌనుకి దాదా అయితే అక్కడి ప్రజలకు దుస్వప్నం. ఒక చేతిలో చాకూ, ఎదురుగా పుస్తకాలతో పరీక్షలు రాసి చదువు ముగించినవాడు. యస్సై కావాలని శతధా ప్రయత్నించి ఒక నిజాయితీ గల పోలీసు అధికారి మూలంగా కాలేకపోయిన వాడు. వెయ్యి రూపాయలకు ప్రత్యర్థి చేయీ, పదివేలకు వాడి తలకాయా నరుక్కువచ్చి చేతి కందించే ప్రబుద్ధుడు!

చాలా సహజంగా కలిసింది వాళ్ళ స్నేహం. క్రమేణానూ అవసరానుగుణంగానూ అది చిక్కబడుతూ వచ్చింది.

ప్రస్తుతం వాళ్ళు నెమరేస్తోన్నారు, సిప్ చేస్తోన్నారు. వదరుతున్నారు, పేట్రేగిపోతున్నారు.

హఠాత్తుగా ఒకడికి జ్ఞప్తికొచ్చింది.

"అవును చంద్రం, నీ మిసెస్ ఊళ్ళో లేదు కదూ?"

"లేదురా, రెండు నెలలక్రితమనగా పుట్టింటికి వెళ్ళింది. ఇంతవరకూ రాలేదు. ఈ ఆస్తి పరుల పిల్లల్ని చేసుకుంటె ఇదే చావు!"

"మరి ఈ రెండు నెలలనుంచీ రాత్రులు కాలమెట్లా గడుపుతున్నావు బ్రదరూ?"

"తడిగుడ్డమీద వేసుకుని బ్రతుకుతున్నాన్రా నాయనా?"

పెళ్ళున నవ్వారు నలుగురూ.

"మొన్నటిదాకా ఎలిజిబెత్ వుండటంతో పెద్ద బాధ అనిపించలేదు గానీ వారం క్రితం అది సెలవుమీద వెళ్ళిపోవటంతో అప్పణ్నించీ మాత్రం బాధంటే బాధగా వుందిరా."

"పాపం, పిచ్చి కన్నయ్య!!"

"లాడ్జింగ్ సరుకును ఎవర్నన్నా పట్రమ్మంటావా గురూ, ఎంజాయ్ చెద్దాం."

"ఛ ఛ, ఈ కంపెనీ సరుకంటే నాకు పరమ ఎలర్జీ. సంసారం చేసుకునేదన్నా కావాలి, లేక ఫ్రెష్‌ఫ్లవర్ అన్నా అయివుండాలి మనకు."

"అవునులే, సింహం గడ్డి పోచకు ఆశిసుందా?"

"లాడ్జింగులకి సంసారపు స్త్రీలుకూడా వస్తోంటారు గురూ. అలాంటి వాళ్ళనే పట్టుకుందాము. ఏమంటావ్?"

"పోరా, అదో ఎట్రాక్షన్ అన్చెప్పి ఆ ముండలంతా అలాగే వాగుతుంటారు...."

"అయితే ఇప్పుదేమి చేద్దామంటావు? పోనీ ఎవర్నన్నా ఎత్తుకొద్దామంటావా?"

"కిడ్నాపింగ్?"

"య్యా!"

"ఎవర్ని?"

"ఎవరో ఒకరు! ఊళ్ళోకి పోతే గూట్లోంచి బయటకొచ్చిన పిట్ట ఎవతో ఒకతి దొరక్కపోతుందా?"

"గుడ్ ఐడియా, నీకు నోబుల్ ప్రైజు ఇవ్వవచ్చోయ్!"

"ఆ పిట్ట ఎలా వుండాలంటే—ఛికెన్‌లా - లేతగా—నవనవలాడుతూ...."

"చికెన్‌లా ఏమిటిరా బాబూ, తింటావా ఏమిటి?"

"తినటమా మరీనా! నంజుకోనూ...."

"సర్లే సర్లే! అవునుగాని మౌళీ, నువ్వు కారు తెచ్చావుకదూ?"

"ఆహా, బయటే వుంది."

"అయితే పదండి!"

"మన నలుగురికీ నాలుగు పిట్టలు దొరుకుతా యంటావా?"

"పోరా, నీకెప్పుడూ సందేహాలే. లేత ఆడది, నవనవలాడుతున్నది ఒక్కటి దొరికితే చాలు. చంద్రానికి ఫస్ట్ ప్రిఫరెన్సిద్దాం, తర్వాత మనమూ...."

"వొద్దు లెండిరా, మీకోసం నేనివ్వాళ త్యాగం చెయ్యదల్చుకున్నాను. దొరకాలేగాని అందరం ఉమ్మడిగా ఎంజాయ్ చేద్దాం."

"హుర్రా, హుర్రా!!"

గ్లాసుల్లో మిగిలిన ద్రవాన్ని కాస్తా ఖాళీచేసి, వాళ్ళు బయటికి కదిలేసరికి రాత్రి ఒంటిగంట అవుతోంది....

2


తెల్లటి బ్లవుజు, తెల్లటి వోణీ, కాఫీరంగు పరికిణీ—

టీనేజ్ కన్య!

అప్పుడే వికసిస్తోన్న పుష్పంలా వుందామె. చామనచాయ. రూపంలో ఎక్కడో ఏదో ఫ్రెష్‌నెస్, ఫ్రాగ్రన్స్. కనుగ్రుడ్లు తెల్లగా, స్వచ్ఛంగా, మల్లెపువ్వుల్ని జ్ఞప్తికి తెస్తున్నాయి. వర్షం కురిసి వెలిసాక పచ్చటి కొండల్ని చూస్తోన్నప్పటి అనుభూతి కలుగుతుంది ఆమెను చూస్తోంటే. సరస్సులో ఆడిఆడి అప్పుడే వడ్డుకొచ్చిన అరబ్బీ గుర్రపు వొంటి నునుపుదనం ఆమెది. ఒక చేయి పైకెత్తినప్పుడు ఆ సందులోంచి కనిపించే ఆమె ఉబుకులు - పొట్టకు కొంచెం పైనుంచి తలెత్తుతూ, వోణీ మడతల్లోకి పరుగెత్తుతూ—వొంట్లో ఎక్కడో నరాలస్విచ్చి నొక్కినట్లు కలిగించే భావన కలుగుతుంది ఇవతలి వాళ్ళకు. ఆరోగ్యంతో మిసమిసలాడుతోందామె. ఆమెలోని యవ్వనం నరాల్ని చీల్చుకుని, శరీరాన్ని చిట్లగొట్టుకుంటూ బయటికి రావటానికి ప్రయత్నిస్తోందా అన్నట్లుంది.

ఆమె పేరు భావన.

భావన నడుస్తోంది. ఆమె చాలా ఉత్సాహంగా వుంది. అంతకు క్రితమే సెకండ్ షో వదిలారు. మరో ఇద్దరు మిత్రురాళ్ళు—రమ, ఉమలతో కలిసి సినిమా చూసిందామె. వాళ్ళిద్దరూ కాస్త కలిగినవాళ్ళు. క్రితంరోజే పరీక్షలు పూర్తికావటము, ముగ్గురూ సంతృప్తికరంగా పరీక్షలు రాయటమూ జరగటంతో ఆ ఉత్సాహంలో రమ ఈరోజు సినిమా ప్రోగ్రాం పెట్టింది. ఫస్ట్‌షోకి వెళ్ళినట్లయితే బాగుండేది కాని రమ వాళ్ళింట్లో భోజనాలు కారణంగా ఆలస్యమయిపోయి సెకండ్‌షోకి రావాల్సి వచ్చింది. వాళ్ళిద్దరు వెళ్ళాల్సింది వేరే రూటు కావటంతో వాళ్ళు కాస్తా రిక్షా చేసుకుని వెళ్ళి



పోయారు. ఇక మిగిలింది భావన. ఆమె ఇల్లు అక్కడికి దగ్గరలోనే వుంది. రెండు వీధులు దాటాలి. రిక్షాలో వెళ్ళమంటూ రమ రెండు రూపాయలిచ్చింది. అసలు వాళ్ళు భావననే ముందు రిక్షా ఎక్కించి వెళ్దామనుకున్నారు కాని భావన అందుకు ఒప్పుకోలేదు. తనే ఓ రిక్షా మాటాడి వాళ్ళను అందులో బలవంతాన పంపే సింది. నడుచుకుంటూ పోయి ఆ రెండు రూపా యల్నీ ఆదా చేయాలన్నది ఆమె ఉద్దేశ్యం. ఇంట్లో మూడ్రోజుల నుంచీ కాఫీపొడి లేదు. తన తండ్రికి కాఫీ లేకపోతే బండి నడవదు. పాపం ఎలాగో ఈ మూన్నాళ్ళనుంచీ నెట్టు కొస్తోన్నాడు. ఈ కాస్త దూరాన్నీ నడిచిపోతే ఆయనకింత సహాయాన్ని చేసినట్లవుతుంది. అయినా ఎంతదూరం గానీ....

"జాగ్రత్తగా వెళ్ళు భావనా!"

పోతూ పోతూ రమచేసిన హెచ్చరిక గుర్తొచ్చి నవ్వుకుందామె. తనేమైనా చిన్నపిల్లా చితకపిల్లానా భయపడటానికి?? (చిన్నపిల్లకాదు కాబట్టే జాగ్రత్తపడాలన్నది ఆమెకు తట్టలేదు. ఆమె వయస్సూ, ఆమె చూసిన సినిమాలూ ఆమెలో అలాంటి వివేకం ఏర్పడకుండా అడ్డుకున్నాయి.)

ఆ వీధి చివరిదాకా వచ్చిందామె. ఆ మూల వీధిలైటు దేదీప్యమానంగా వెలుగుతోంది. ఆ వెల్తురులోంచి నడుస్తోందామె. మరో వీధి దాటితే తన ఇల్లు వచ్చేస్తోంది. ఈ కాస్త దూరానికి రెండు రూపాయలట....

దీపస్తంభం క్రిందికి వచ్చిందామె. ఇప్పుడా వెల్తురులో ఆమె రూపం మరింత స్పష్టంగా కనిపిస్తోంది. పుష్టిగా, ఆరోగ్యంగా, క్రీమీగా...

ఒక చిన్న ఫియట్ కారు నెమ్మదిగా ఆమెను దాటుకుంటూ వెళ్ళింది.

తను వెళ్ళాల్సిన వీధిలోకి మళ్ళింది భావన. అదురూ బెదురూ లేకుండా దర్పంగా నడుస్తుం దామె. అంతకు క్రితం చూసిన సినిమాలో దృశ్యాలే మెదుల్తున్నాయి ఆమె మనస్సులో. అందులో హీరోయిన్ చాలా పేదపిల్ల. కాలేజీలో చదువుతుండగా ఒక యువకుడి ప్రేమలో పడు తుంది. అతనో పెద్ద ధనికుడి కొడుకు. పెద్ద కార్లూ బంగళాలూ వుంటాయతనికి. సగం సినిమా గడిచేసరికి విడిపోవాల్సి వస్తుంది వాళ్ళు. అంతస్తులు తేడా కారణంగా. మధ్యలో కష్టాలు, విరహ గీతాలూ, మొత్తానికి సినిమా ముగిసే సమయానికి పెద్దవాళ్ళు వప్పుకోటంతో మళ్ళీ ఆ ఇద్దరూ కలుసుకుంటారు. కారులో డ్యూయెట్ పాడుకుంటూ పోతుండగా 'శుభం' కనిపిస్తుంది....

సన్నటి నవ్వు భావన పెదాలమీద కదిలింది. తనూ పేదపిల్లే. ఇంటరు పరీక్షలు రాసింది. వచ్చేయేడు బి యస్ సీలో జేరుతుంది. ఆ తర్వాత??....అదేదో మిరకల్ జరగవచ్చునని ఆమె మనస్సు హెచ్చరించి మరీ చెబుతుం దామెకు.

ఒక వంతు వీధిని దాటిందామె. మరో రెండువంతులు నడవాలి. ఆ తర్వాత వంపు తిరిగితే వచ్చే నాల్గో ఇల్లే తమ ఇల్లు.

అక్కణ్ణించీ అయిదారు దీపస్తంభాలదాకా లైట్లు వెలగటంలేదు. అక్కడంతా కటిక చీకటి. అలా లైట్లు వెలగని దీపస్తంభాలు ఆ టౌన్లోని మిగతా మరికొన్ని వీధుల్లో ఇంకా అనేకం వున్నాయి. చానాళ్ళనుంచీ ఆ లైట్లు అలా వెలగటంలేదు. ఈ మధ్యనే ప్రభుత్వ రికార్డుల్లో వాటికి సంబంధించిన బల్బులు బిగించబడ్డట్లుగా ఖర్చు రాయబడింది కాని తత్సంబంధిత సొమ్మంతా మాత్రం అదే టౌన్లో మరో వీధిలో తన మూడో కూతురికి పెళ్ళి చేస్తోన్న డివిజనల్ ఇంజనీరు ఇంటికి దేదీప్యమానంగా వెలిగించటానికి ఉపయోగించ బడింది.

మరి ఇక్కడ ఈ చీకటిలో??

ఆ చీకటి వద్దకు రాగానే భావన ఒక్క క్షణం భయపడింది. వీధి వీధంతా నిర్మానుష్యంగా వుంది. ఆమె భయం మనుష్యుల గురించి కాదు, చిన్నప్పణ్ణించీ తను పెరిగిన ఆస్తిక వాతావరణం తాలూకు పిశాచ సంబంధిత అజ్ఞాత రూపాల గురించి! అదీకాక ఆ ప్రదేశంలో అంతకు నాల్గురోజుల క్రితం యాక్సిడెంటు జరిగి



ఓ మనిషి చనిపోయాడు. ఛిన్నాభిన్నమైన ఆ శవాన్ని ఆమె చాలా దగ్గరనుంచి చూసి వుంది. ఇక్కడెక్కడో ఆ బాపతు ప్రేతం కల దిరగడం లేదుకదా?!

క్షణం తటపటాయించాక గుండెను దిటవు పర్చుకుని అడుగు ముందుకు వేసింది భావన - ఆ చీకటిలోకి.

సగం చీకటిని అధిగమించగానే హటాత్తుగా ఆమెలో కొండంత ధైర్యం ప్రవేశించింది. అందుకు కారణం ఎదురుగా కొంత దూరాన రోడ్డు పక్కనే ఆగివున్న తెల్లటి కారు! ముగ్గురు నలుగురు మనుష్యులు కారువద్ద వొంగుని ఏదో రిపేరుగావును చేసుకుంటున్నారు. అమ్మయ్య. ఇక్కడెవరో మనుష్యులున్నారు, తనింక ఏ దయ్యంగురించీ భయపడాల్సిన పని లేదు!

ఉత్సాహంగా ముందుకు నడిచిందామె. కాని, కాని....

కారువద్దకు రాగానే ఆమె ఊహించని సంఘటన జరిగింది. దెయ్యాలగురించి ఝడుస్తూ ఏ మనుష్యులను చూసి ధైర్యం తెచ్చుకుందో ఆ మనుష్యులే ఆమెమీదకు దయ్యాల్లా విరుచుకు పడ్డారు. ఒకడు ఆమె నోరు మూస్తే ఇద్దరు ఆమెను వొడిసి పట్టుకున్నారు. మరోడు కారు స్టార్టు చేసాడు.

ముగ్గురు కలిసి ఆమెను వెనకసీట్లోకి జేర్చారు.

ఏమి జరిగిందో, ఎందుకు జరుగుతుందో ఆమెకు తెలిసే లోపునే కారు ముందుకు దూసుకుపోసాగింది....

3

రాత్రి రెండయింది.

వీధిలోకీ ఇంటిలోకీ కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు వైకుంఠం మేష్టారు. ఆయన మనసంతా ఆందోళనతో నిండి వుంది.

రమ వాళ్ళతో కలిసి సినిమాకు పోతానని వెళ్ళింది భావన. ఇంకా రాలేదు. ఫస్టుషో అంద లేదా? సెకండ్ షోకి పోయినాగాని ఈసరికి వచ్చి వుండాల్సిందేనే....

'భావనా! నా చిట్టి తల్లీ!!'-మూలిగిందాయన మనస్సు.

పిచ్చి తల్లికి తనంటే ఎంతో ప్రేమ. ఇప్పటికీ ఎప్పుడన్నా అన్నం తింటున్నప్పుడు తన వద్దకు వచ్చి ముద్ద పెట్టించుకుంటుంది. ఆరేళ్ళ క్రితమనగా లక్ష్మి—తన భార్య చనిపోయింది. అప్పట్నుంచీ తను కంటికి రెప్పలా కాపాడు

కొస్తున్నాడు. పిచ్చితల్లి, ఎంత ముద్దుగా మాట్లాడుతుంది!? బాగా చదువుకుని కలెక్టరవుతుందట. కలెక్టరై తన కష్టాలన్నీ తీరుస్తుందట. లేకపోతే డాక్టరై తన అనారోగ్యాన్నంతా తీసివేస్తుందట....

చిన్నగా నవ్వుకున్నాడాయన.

ఇంకా ఎందుకు రాలేదబ్బా!?

వీధిలో ఏదో చప్పుడయితే చటుక్కున గడపలోకి వచ్చాడు.

ఒక చిన్న కారు ఇంటి ముందునుంచి దూసుకుపోయింది.

నిరాశగా నిట్టూర్చాడు వైకుంఠం మేష్టారు.

తొమ్మిదింటి నుంచి ఎదురుచూస్తోన్నాడాయన. భావన జాడే లేదు. ఎటుపోయింది? ఎక్కడుంది? ఏం చేస్తోంది??

ఏ ఆపదా సంభవించలేదు కదా? రోజులసలే బాగాలేవు.

క్షణక్షణానికి ఆయనలో ఆందోళన, ఆదుర్దా పెచ్చరిల్లసాగాయి. గుండెల్లో టెన్షన్ వుక్కిరి బిక్కిరి చేయసాగింది.

చిట్టితల్లి యింకా రాలేదు, యింకా రాలేదు, యింకా రాలేదు....

"భావనా ఏం చేస్తున్నావమ్మా? ఎక్కడున్నావమ్మా??"

ఆక్రోశించిందాయన మనస్సు....

4

ఒంపు తిరిగి ఓ కాంపౌండులోకి ప్రవేశించింది కారు.

ఒకళ్ళు డ్రైవు చేస్తున్నారు. ముగ్గురు వెనకసీట్లో భావనను పట్టుకు కూర్చున్నారు. ఒకచేయి భావన నోటిని మూసి ఉంచితే నాలుగు చేతులు ఆమె కాళ్ళూ చేతుల్ని కదలకుండా పట్టుకుని వుంచాయి. ఒకచేయి మాత్రం ఆమె శరీరం మీద కదుల్తోంది మోహంతోనూ, మొరటుగానూ.

కారు ఆగే సమయానికి దాదాపు ఆమెలొంట్లో శక్తి అంతా హరించుకుపోయింది. నిస్సహాయంగా వాళ్ళచేతుల్లో వేళ్ళాడి పోయిందామె.

వాళ్ళు తనను భవనం లోపలికి తీసుకుపోతుంటే కూడా ఆమె ఏమీ చేయలేకపోయింది. భవనం లోపలికి పోగానే వాళ్ళు తలుపులు బంధించుతున్నప్పుడు మాత్రం ఆమెకు ఒక్కసారిగా గుండెలు గుభిల్లుమన్నాయి. వెంటనే ఆమె శక్తినంతా కూడదీసుకుని తనను పట్టుకున్న వాళ్ళను విదిలించుకుని వెర్రిగా కేకలు పెట్టింది.

ఒక్కక్షణం మాత్రమే ఆ ఆర్తనాదాలు బయటికి వినిపించాయి. ఆ వెంటనే తలుపులు మూసుకోవటమూ, ఆమెను లోపలి గదుల్లోకి తీసుకుపోవటమూ జరగటంతో ఆమె ఆర్తనాదాలు ఆమెతోటే లోపల బంధించబడ్డాయి...

5

టూ టౌను పోలీసుస్టేషను ఎస్సై పేరు ప్రసాదరావు. అతను అంతకుముందే ఐజీ యిచ్చిన ఉపన్యాసాన్ని నెమరువేసుకుంటూ నడుస్తున్నాడు ఆ అర్ధరాత్రి టౌన్లోని చీకటి వీధుల గుండా. రాష్ట్రమంతటా నేరాలు, కల్లోలాలు, అరాచకత్వాలు ఎక్కువయ్యాయి. కారణం పాలకుల అసమర్థతా, అవినీతియే అయినా నిందించబడుతోంది మాత్రం పోలీసుశాఖ! అందుకు తగ్గట్టు మానభంగాల్లోనేమీ, దొంగతనాల్లోనేమీ ఇత్యాదుల్లో కొన్నిచోట్ల పోలీసులే నేరస్థులుగా బయట పడుతుండటంతో ప్రజలకు పోలీసుశాఖపట్ల విశ్వాసం హరించుకుపోతోంది. కొత్తగా వచ్చిన ఐజీ నిజాయితీపరుడూ, ఆదర్శభావాలు కలవాడూ కావటంతో ఈ పరిస్థితిని మార్చటానికని ఆయన రాష్ట్రమంతటా పర్యటిస్తూ తనక్రింద అధికార్లకు క్లాసులు నిర్వహిస్తున్నాడు. అందులో వొక భాగమే ఇవాల్టి ఆయన వుపన్యాసం. ప్రజలలో నమ్మకం కలిగేటట్లు ప్రవర్తించమనీ, మరీ తప్పనిసరి పరిస్థితుల్లో తప్ప ఎవరినీ హింసించవద్దనీ, తోటి ప్రజలకు ఆదర్శంగా నిలబడుతూ వాళ్ళ సహకార సానుభూతుల్ని సంపాదించమనీ, పాతకాలపు జులుంని విసర్జించమనీ, సంస్కారాన్ని అలవర్చుకోమనీ,

ఆర్తులను ఆదుకోమనీ, యిలా బోధించా డాయన.

ప్రసాదరావు స్వతహా ఆదర్శవాది కావ టంతో ఆయన వుపన్యాసం అతణ్ణి ఆకట్టు కోవటమే కాకుండా ఉత్తేజపరిచింది కూడా.

నడుస్తున్నాడు ప్రసాదరావు. ఇంటివద్ద తనకోసం ఎదురుచూస్తుండే రమ రూపం గుర్తుకొచ్చి అతని అడుగులు మరింత వేగంగా ముందుకు పడ్డాయి.

స్థానిక ఎంపీ కొడుకు చంద్రం భవనం ముందుకు రాగానే హఠాత్తుగా అతని కాళ్ళకు బ్రేకులుపడ్డాయి. అంతకు మునుపే ఓ చిన్న కారు గేటు లోపలికి వెళ్ళటం గమనించాడతను. ఆ కారు ఆగేసమయానికి అతను గేటుముందు భాగానికి వచ్చాడు. కార్లోంచి ఎవర్నో చేతులు పట్టి తీసుకుపోవటాన్ని చూసాడు కూడా. ఎవర్నో రోగిష్టి మనిషిని తీసుకుపోతున్నారు గావును అనుకున్నాడు. ఎప్పుడయితే ఆ ఇంటి తలుపులు తెరవబడటమూ, ఆ వెల్తురులో ఓ స్త్రీ గింజుకుంటూ కేకలు వేయడమూ కనిపిం చిందో ఆ వెంటనే అతను గేట్లోంచి లోపలకు ప్రవేశించాడు. కాని అతను వెళ్ళేసరికి ఆ తలుపులు మూసుకున్నాయి.

తలుపులు తట్టాడు ప్రసాదరావు. ఎవరూ తెరవలేదు. దబాదబా బాదాడు. అప్పటికీ తెరవబడలేదు. అలా బాదుతూనే వున్నాడు.... ఆఖరికి తెరుచుకున్నాయి.

తెరిచిన వాడు దుర్ముఖుడు—తన బాస్ కొడుకు గోపాల్.

ఎవరు నువ్వన్నాడతను. ఎస్సై ప్రసాదరావు నన్నాడితను. నేనెవరో తెలుసా అన్నాడతను. తెలుసును. డీ ఎస్పీ కొడుకువి అన్నాడతను. ఇంతకీ ఏం కావాలన్నాడతను. తను చూసిన దృశ్యాన్ని చెప్పాడతను. అయితే లోపలికి రమన్నాడతను. వెళ్ళాడితను.

మళ్ళీ తలుపులు మూసుకున్నాయి.

గదిమధ్య నిలబడివున్నాడు ప్రసాదరావు. అతని ముందు నిలబడివున్నాడు గోపాల్. ఇప్పుడేమంటావ్ ఇంతకీ? అనడిగాడు గోపాల్. ఎవర్నో మీరు కిడ్నాప్‌చేసి తెచ్చి నట్లున్నారు, ఇంటిని సోదా చెయ్యాలన్నాడు ప్రసాదరావు. వారంటు తెచ్చావా అనడిగాడతను. లేదన్నాడితను. మరెట్లా అన్నాడతను. నీకున్న హక్కేదీ అనడిగాడు పైగా. అసలు నువ్వి ప్పుడు డ్యూటీలో వున్నావా? అనడిగాడు కూడా. బాధ్యతాయుతమైన పౌరుడిగా నాకా హక్కుంది అన్నాడతను. అట్లాగా అన్నా డతను. అవునన్నాడితను.

ఈలోపు మిగతా వేపుల్నించి ప్రకాష్, మౌళి, చంద్రం కమ్ముకోసాగారితణ్ణి.

6

గదిలో లైట్లు తీసివేసి కిటికీవద్ద కూర్చుని వుంది రమ. ఆమె అట్లా ఎప్పణ్ణించో అక్కడ కూర్చుని ఎదురు చూస్తోంది.

ప్రసాదం! అతను ప్రసాదం కాదు, తన పాలిటి దేవుడు! రూపవంతుడూ, గుణ వంతుడూ. మరి తనో? మామూలు అందగత్తె అన్నాకాదు. కలవారింటి కూతురన్నా కాదు. జీవచ్ఛంలా అనాధ శరణాలయంలో బ్రతుకు తుంటే—ప్రసాదం చూసి—తన నడవడికను మెచ్చుకుని—రూపం కాదు గుణం ముఖ్య మని—పెళ్ళాడాడు మూడేళ్ళ క్రితం. అప్పటికే అతను ఎస్సై. ధర్మానికి నిలబడ్డవాడు—అవి నీతికి లొంగనివాడు—తనను ప్రేమగా చూసు కుంటున్నవాడు—దేవుడు కాక మరేమిటి?

ఊళ్ళోకి ఐజీ వచ్చాడనీ, తను తిరిగి వచ్చే సరికి బాగా ప్రొద్దుపోవచ్చునీ, ఎదురు చూడక నిద్రపొమ్మనీ, చెప్పి వెళ్ళాడు. కాని తను అప్పణ్ణించీ ఎదురుచూస్తూనే వుంది. ఆ మాత్రం నిద్రని త్యాగం చెయ్యలేదా తను తన దేవుడి ప్రేమకోసం!?

ఎత్తుగావున్న పొట్టను ఓ సారి మృదువుగా తడుముకుంది రమ. ఎవరు ఎదుగుతున్నారు లోపల? జూనియర్ ప్రసాదమా? జూనియర్ ప్రసాదినియా?? నవ్వుకుంది చిన్నగా....

మరి ప్రసాదరావు ఏం చేస్తున్నాడు???

7

మంకుపట్టు వీడకపోయే సరికి—

మీసాలూస్తున్నాయని మీరేం గాబరా పడకండి!! హా హ్హాహ్హా!!
సిల్వర్ ఫిష్ బ్లేడునే వాడండి! టంటర్ర్ట్రాహాం!!



మాటా మాటా పెరిగి—

ఏం జరుగుతుందో గ్రహించే అవకాశమన్నా లేక—

ఎదురు తిరిగే వ్యవధన్నా లేక—

ఒకడు మాడుమీద బలంగా బాదితే,

మరోడు కడుపులో కత్తితో పొడవగా,

ఇంకోడు గొంతులో చాకును గుచ్చగా—

జలజలా రక్తం ఓడుతూ,

గిలగిలా అవయవాలు కొట్టుకుంటుండగా -

నేల కొరిగి,

అభిమన్యుడిలా, బాలచంద్రుడిలా....

8

మూడ్రోజుల తర్వాత!

ఊరి చివర పాడుబడిన బావిలో రెండు శవాలు కనుగొనబడ్డాయి.

ఒకటి ఎస్సై ప్రసాదరావుదయితే రెండోది టీనేజ్ పిల్ల భావనది.

ఆ పైన రకరకాల ఊహాగానాలూ, కట్టు కథలూ.

శవ పరీక్షలో ఆ పిల్ల కొందరిచేత బలవంతంగా అనుభవించపడగా చనిపోయిందని తేలింది....

9

పోలీసుశాఖలో అందరూ అవినీతిపరులే లేరనటానికి ఉదాహరణ బోసుబాబు. ప్రసాదరావు హత్యావార్తా, భావన రేప్‌తో కూడిన మరణవార్తా విని కొత్త ఐజీ షాక్ తిన్నాడు. వెంటనే అతను తన దృష్టిలో నిజాయితీపరుడూ, మెరికలాంటివాడూ అనుకున్న బోసుబాబును పంపాడు ఇన్వెస్టిగేట్ చేయటానికి. ఆయన ఆశ ఫలించింది కూడా. త్వరలోనే బోసుబాబు దుష్టచతుష్టయాన్ని కనిపెట్టి, అరెస్టుచేసి, కేసు తయారుచేసాడు. యంపీగారి పరపతిగానీ, డిఎస్పీ హోదాగానీ బోసుబాబు ముందు పనిచేయలేదు. ఇక మిగిలింది కోర్టు తతంగం! మనది ప్రజాస్వామ్య రాజ్యాంగం కావటంతో ఆ తతంగం చాలా సుదీర్ఘంగా సాగి ఆఖరికి ఎనిమిదేళ్ళు, పదేళ్ళు, అంటూ ఇలా తలా కొంత శిక్షలు పడ్డాయి.

ఇంతటితో ఆగిపోయినట్లయితే బాగానే వుండేది. ఎంతో కొంత న్యాయం జరిగిందన్న సంతృప్తి మిగిలేది సామాన్యుడికి. కాని అట్లా జరగలేదు—

దుష్ట చతుష్టయమూ, తత్సంబంధీకులూ తమకు చాలా అన్యాయం(?) జరిగిందనుకోవడంతో పైకోర్టుకు అపీలు చేసుకున్నారు.

మళ్ళీ అక్కడ మూడేళ్ళు జరిగింది విచారణ. ప్రత్యక్షసాక్షులెవరూ లేరు కాబట్టి ముద్దాయిలను వదిలివేయాల్సిందంటూ ఈ కోర్టు కాస్తా తీర్పు చెప్పింది.

ఇదెక్కడి ఫార్సు???

అట్లా అని ఆశ్చర్యపడాల్సిన పనిలేదు. ఈ దేశంలో అనేకానేక ఫార్సుల్లో ఇదొకటి! □

జ్యోతి కథల పోటీలో
ప్రత్యేక బహుమతి
పొందిన కథ

ఆట

నందిని సిధారెడ్డి

నియోన్ లైట్ల తెల్లటి వెలుగులో వెన్నెల మరుగున పడిపోయింది. మిల్క్ బల్బులా కనిపించే నిండు చంద్రుడి వంక చూస్తేగానీ, అవి వెన్నెల రోజులని తెలీనట్టుంది. సిటీలో రోజూ వెన్నెలే. అయినా — బాలి లాంటి వాళ్ళకేం వెన్నెల? బాలి లేచి నాలుగు దిక్కులూ చూసి చేతులు పైకెత్తి ఆవులించి మళ్లా కూచున్నాడు.

అయోమయం 'బంగు'లా తిప్పుతుంది.

ఆలోచన్లు గుండు సూదుల్లా గుచ్చుకున్నాయి.

మిర్చీల్లేని మిర్చీ పొట్లాం కాయితం రెపరెపలాడ్తూ వొచ్చి బాలి మొహానికీ, పెదవికీ అతుక్కుపోయినట్టుపడి జారిపోయింది.

'కాయితం' పొద్దున ఆ కాగితం కోసమే, అనవసరంగా నర్సితో తగూపెట్టుకున్నాడు. బొగ్గులకుంటలో కాయితాలు వెతుకుతున్నాడు తను. దూరంగా పాత న్యూస్ పేపర్ ఫుట్ పాత్ మీద కొట్టుకుపోతుంది గాలికి. తనూ దాని వెంటే కొట్టుకుపోతున్నట్టు నడిచాడు. ఎక్కడ్నుంచో దెయ్యంలా వచ్చింది నర్సి. పెద్ద మిఠాయి దొరికినట్టు, రిలీజింగు నాడే సినిమాకు అందునా మ్యాట్నీకి టికెట్ దొరికినట్టు గభాలున పేపరు తీసేసుకుంది. అంతే తను రెచ్చిపోయి నర్సిని తోసేసి కాగితం లాగేసుకోబోతుంటే ఎవరో 'టై' కట్టుకున్నతను....

'బాబూ....అరే బాబూ....'

ఆశ్చర్యం! ఎవరో టై కట్టుకున్నతను పిలుస్తున్నాడు. అక్కడ....యిక్కడా... ఆఁ అతనిక్కడికెందుకొస్తడు లే?

"బాబూ,బీరు తెచ్చిపెడతావా?' టై ఊగుతూ అడిగింది.

బాలి యింక ఆలోచన్లు చుట్టచుట్టి పక్కకు పెట్టేశాడు. "ఓ యస్‌సర్"

"ఏం బీరు తెస్తావ్"

"సర్, మీరెద్దెమ్మంటె గద్దెస్త"

-"ఈ షాప్‌ల్లో ఏమేం దొరుకుతాయ్?"

"సార్....

ఈసుగా చూసే జానీ గాని వైపు అమాయకంగా చూస్తూ నెత్తి గోక్కొని, "కింగ్‌పిషర్, ఈగలూ, సిల్వరూ, టాపూ ఆ.... సార్, యూబీ...."

"ఇంకా పేర్లన్నీ చదువక్కర్లేదు కాని, యూబి తెస్తవా మరి"

"ఎన్ని సార్"

"ముందైతే ఓ రెండు బీర్లు పట్రా" ఇరవై నోటు తీసిచ్చింది టై. మూలకు పడేసిన సంచిని భుజానికి తగిలించుకుని నడవబోయాడు బాలి.

"ఇదిగో, బాబూ రెండ్రూపాయలవి తినడానికేమైనా పట్రా — నేనిక్కడ ఓ కార్నర్‌కి కూచుంటా, వచ్చెయ్" టై ఊగుతూ నడిచింది.


బెల్లం మట్టమీద పెట్టుకుని నాకుతూ పరిగెత్తేవాడిలా పరిగెత్తబోయి మెల్లగానే నడిచాడు బాలి. జానీకి వాన్ని తన్ని ఆ బేరం లాక్కోవాలన్నంత కోపం వచ్చింది కానీ, తన్నుకోని రెండ్రోజులయినా కాందే మళ్ళా....

అది, చదువులకి ప్యూరిటీ యివ్వలేం కానీ, సరదాలకి, తగాదాలకి పుట్టినిల్లైయిన యూనివర్శిటీ కాంపస్.

మనిషికి అన్నింటికన్నా ఆరోగ్యమే మహాభాగ్యం కాబట్టి—విద్యార్థులకు చదువులకన్నా ఆటలే ఆరోగ్యకరం కాబట్టి — ఆర్ట్సు కాలేజి

రచయిత గురించి

తేదీ ఎప్పుడో తెలీదు కాని, నాకు ఊపిరి పోసింది రత్నమ్మా, బాల్ సిద్దారెడ్డి. ఆ ఊపిరికి చూపులు ఇచ్చింది సాహిత్యమే.



ప్రస్తుతం ఉస్మానియా తెలుగుశాఖలో 'Concept of the sun in modern poetry' మీద యం. ఫిల్ చేస్తున్నా.


నా రచనకి అయిదేళ్లు నిండినా రాసిన కథలు తక్కువ. శివారెడ్డి కవిత్వమన్నా గోర్కీ వచనమన్నా ప్రాణం. ఇరానీ హోటళ్ల సందడన్నా, మనుషుల్ని హడావుడి పెట్టే ఉదయమన్నా ఇష్టపడతాను. శీలా వీర్రాజు చిత్రాలని కూడా. శ్రీకంఠమూర్తి 'జాతర' మరువాడ 'గోడ' మోహన్ 'రాముల వారి గుడిముందు' అల్లం రాజయ్య 'చిలకా నువ్వెటు వెళ్లావ్' భైరవయ్య 'బాస్టర్డ్స్ బట్ సివిలైజ్డ్' మంథా 'కృష్ణపక్షం' నాకు నచ్చిన కథల్లో కొన్ని. జంపన పెద్దిరాజు 'ఫాల్ ఫాల్'ని. మళ్లామళ్లా చదువుకోవటం చాల ఇష్టం.

శవతల ఖాళీస్థలమంతా ప్లే గ్రౌండ్స్. అంతర్జాతీయంగా మన దేశ ఖ్యాతి ఏ రంగం నిలబెట్టలేక పోయినా, కనీసం క్రికెట్టయినా నిలబెడుతుందేమోనన్న ఆశతో, క్రికెట్ మీద కోట్ల కుకోట్లు ఖర్చుపెట్టి—ఆఫీసులకు సెలవులిచ్చి, ఆకాశవాణుల్లో కామెంట్రీలు పెట్టి, జనాన్ని అలవాటు చేసి క్రికెట్ కళని ప్రోత్సహించే పవిత్ర భారత దేశంలో ఆ యూనివర్సిటీ కూడా ఒక భాగమే కనక—క్రికెట్ అభివృద్ధికి తన శాయశక్తులా కృషి చేయాలి కనక — నాలుగు క్రికెట్ గ్రౌండ్స్‌నీ ఏర్పాటు చేసింది. ఇంకా బాస్కెట్ బాల్‌కీ, షెటిల్‌కీ, టెన్నిస్‌కీ....ఆటకో కోర్టు చొప్పున ఆ గ్రౌండ్ విలసిల్లుతోంది. పగలంతా బౌలింగ్‌లతో, రన్స్‌తో, బ్యాటింగ్స్‌తో ఆ గ్రౌండ్ అలసిపోతుంది. చీకటి బడుతూనే సేద దీర్చుకొంటుంది. మత్తుగా తాగేస్తుంది. ప్లే గ్రౌండ్ కాస్త డ్రింక్స్ కాంపౌండ్‌గా పరిణతి చెందుతుంది.

ఆ గ్రౌండ్ ముందు .పక్కకి విద్యార్థుల హాస్టల్స్ వున్నాయి, వెనకాతలే-బార్ షాప్స్, హోటల్స్. సెకన్స్ పుస్తకాల షాపులూ వున్నాయి.

ఆటలతో, చదువులతో యితర కలాపాలతో అలిసిపోయిన హాస్టల్ విద్యార్థులూ—పక్కనే తార్నాకలో పెళ్ళాలతో, ఆఫీసులతో యితర సమస్యలతో విసిగిపోయిన మూడంకెల గుమాస్తాలూ—బ్రాకెట్లతో, ఫైటింగులతో సర్వ రౌడీయిజాలతో పెట్రేగిపోయే గళ్ళలుంగీ విగ్రహాలూ—ఇంకా కొందరు, అన్ని రకాల చాలామంది సాయంత్రాన్ని అనుభవించటానికి అక్కడికి చేర్తారు. ఆ గ్రౌండ్ చాలా విశాలమైంది కాబట్టి ఆంధ్రదేశంలాగే అందర్నీ ఆదరించి అతిథి మర్యాదలు చేసే పానపూర్ణ. జట్లు జట్లుగా కళకళలాడుతూ పాటలతో, పద్యాలతో





చర్చలతో, తిట్లతో సందడిగా వుండి జాతర్లా వుంటుంది. కానీ, బాలికే జాతర్లో గారడీ ఆటలో తీగమీద నడిచే కుర్రాడిలాగానో, బలికోసం తీసుకెళ్ళే గొర్రెపిల్లలాగానో వుంటుంది.

మస్తాన్, జానీ, బాలీ వీళ్ళు ముగ్గురూ అక్కడ డ్రింక్స్ సప్లయ్ చేస్తారు. అయిదింటి నుంచి ఏటులకోసం చూసే వేళ్ళల్లో ఎదురు చూస్తూనే వుంటారు. సప్లయ్ చేసినందుకు వీళ్ళేమీ డిమాండ్ చేయరు. వాళ్ళ దయా, ధర్మం. కానీ, ఖాళీ అయిన బాటిల్సే వాళ్ళకు కూలీ.

ఒక బ్యాచికి ఎవరు సప్లయ్ చేస్తే ఆ బ్యాచితాగిన ఖాళీ బాటిల్సన్నీ అతనికే చెందాలనేది అక్కడి రూల్. రూలంటే మన దేశంలోలా రాయబడి అమలు జరగనిది కాదు. రాయబడకుండానే అమలు జరిగేది.

బాలికి పదేళ్ళుంటాయ్. బాలి ఎప్పుడూఅదోలాకప్పిపెట్టుకున్నట్టుకనిపిస్తాడు. ముఖంలో ఏదో ఒక రూపేణా అతని విషాదం వొలుకుతూ వుంటుంది. అందరితో చాలా సరదాగా, జాలీగా మాట్లాడుతాడు. అందర్నీ త్వరగా ఆకర్షించే గుణమేదో వాడిలో వుందని జానీగాడికి తెలుసు. ఆ గుణాన్ని చూసే మస్తాన్ బాలి అంటే ఇష్టపడతాడు. కానీ, జానీగాడికి భయపడి వాడు చెప్పినట్టే చేస్తూ వాన్తోనే కలిసుంటాడు మస్తాన్.

కాలి నొప్పివల్ల పరిగెత్తలేకపోతున్నాడు బాలి. షాపులోంచి తిరిగివస్తున్న బాలికి పరిగెత్తుతున్న మస్తాన్ ఎదురయాడు. "నీకోస్రం భై గట్టుకునోస్రా భై గాడ్డారినట్టే వారు తండు. జల్ది వోరభై."

"నువ్వెట్రా ఏమన్న తగిలిందా...."

"గంద్కే గదభై పోతాంది. ఆ జానీ గాడెమొ దొర్లాగ కూసుంటడు. నేనెమొ కుక్కలె ఆడ్కి ఈడ్కి దిర్గాలె. కిస్మత్ బేకూఫ్ దడుక్కొచుకున్నం ఏం జేస్తంర భై"

పూర్తిగా చీకటిపడింది.

ఐదారు బ్యాచ్‌లు సిటింగులో వున్నట్టున్నయ్.

మాటలు మామూలుగా చిదురుముదురుగానే వున్నాయ్.

ఇంకా అందుకోలేదు.

"సార్, తీస్కచ్చిన సార్" అంటూ బీరు సీసాలు, మిర్చిపొట్లం, ఖారపొట్లం తీసిచ్చాడు. తిడుతున్న వాడల్లా బీరుసీసా ముట్టుకుని చూశాడు. అంతే — బీర్ సీసాలాగే తనూ 'కూల్' అయిపోయాడు. బాలిని పేరూ అదీ అడిగి ఆప్యాయంగా పలకరించాడు. బీరు సీసాని ముద్దెట్టుకున్నాడు. బాలికి సంబంధించిన ఇతర విషయాలు అడుగుతున్నాడు. వాడు ఓపెనర్‌తో బీరుసీసాలు ఓపెన్‌చేసినట్టే చాలా విషయాలు చెప్పాడు.

"బాలీ" పిలుపు గాల్లో తేలింది,

"ఇపుడే వాస్త సార్" అని గాల్లో పరిగెత్తాడు.

సాధారణంగా హాస్టల్ స్టూడెంట్సయితేనే తనని పేరుపెట్టి పిలుస్తారు. వాళ్ళే నిత్య కస్టమర్లు కాబట్టి.

ఎవరో కాదు రాజన్‌సాబ్.

బాలి దృష్టిలో అమితాబ్ బచన్ అతను. ఎప్పుడూ అతన్తోపాటు ముగ్గురో నల్గురో వస్తుంటారు. ఈ సారి ఇద్దరే వచ్చారు. వాళ్ళిద్దర్నీ అంతకు ముందెన్నడూ చూసినట్టు గుర్తులేదు.

"అచ్చా బాలీ తీన్‌బీర్ హోనా."

"క్యాసాబ్ ముగ్గురున్నారు మూడు బీర్లేమయితయి."

రాజన్ ఒక చెయ్యి జేబులోపెట్టి ఒక చెయ్యితో కళ్ళద్దాలు సవరిస్తున్నాడు.


"బాద్‌మే దేకింగే, పహెలేతో తీన్ మంగావ్....అచ్చా బాలీ మేరా బ్రాండ్ యాద్ హైనా" రెండు పదిరూపాయల నోట్లు తీసిచ్చాడు.

"అవ్ సాబ్ అంత యాదుంది. మీ అడ్డ సుతం యాదుంది. గట్లమరి సై. ఎట్లసాబ్ మీ అసోంటాళ్ళను. నిమిషంల వాస్త" అంటూ పరిగెత్తబోయేసరికి కాలు నొప్పి ఇమ్మడైందేమో,పరుగుని నడకలోకి మార్చేసాడు.

చింతాకుతో రెండుకట్లు కట్టినా తగ్గలేదు. తనని అయ్య దగ్గరికి తీస్కోని కాలు నిమురుతూ కట్టు కడతావుంటే అయ్యలోనే అవ్వ కనిపించినట్లయింది. అవ్వ గుర్తుకొస్తూనే దుఃఖం కట్టలు తెంచుకుని వసుంది. హిమాయత్ నగర్‌లో మార్వాడీ సేట్ బంగ్లాకి సిమిటి టాప్ పోసిన్నాడు-నిచ్చెనమీంచి పడిన అవ్వ-ఆ తర్వాత రెండ్రోజులకి చనిపోయిన్నాడు ఎంత ఏడ్చాడో....కనీసం చావుకైనా అన్నగాడు రాలేదు. ఎంత పాకెట్ మార్రైనా అవ్వ గుర్తు రాదా? వాడి తాగుడు-వాడి జులాయితనం అయ్యన్నీ, తన్నీ, అందర్నీ మరిపించేసింది.

తను వొచ్చిన పని మరచినట్టు బార్లు దాటేసి పోయానని గుర్తొచ్చి వెనక్కి మరలాడు బాలి.

రాజన్‌సాబ్ ఎప్పటి అడ్డా మీద లేడు. అక్కడెవరో సాయిబుల్లాంటివాళ్ళు తెలుగులో తాగుతున్నారు. రాజన్ తెలుగువాడిలాగే వున్నా ఉర్దూలోనే తాగుతాడు. బాలి అంతా వెతికాడు. ఎక్కడా కనిపించలేదు. జాతర్లో తండ్రి దొరకని పిల్లాడిలా తిరుగుతావుంటే జానీగాడు తన్ని చూసుకుంటూ నవ్వుతాడు. టైం వేస్టయిపోతుంది. వచ్చే బేరాలన్నీ జానీగాడి పాలవుతాయి. రంధ్రం దొరకని ఎలుకలా ఆలోచిస్తూ, పిలవటానికి భయపడి కాలుగాలిన పిల్లిలా తిరుగుతున్నాడు బాలి.



"అరె బే బాలీ" కేక కొట్టొచ్చినట్టుంది.

ఆ కేక రాజన్‌దే. వెళ్ళాడు. అక్కడే రోడ్డుపక్క ఫూల్ కింది గొందిలో కూచున్నాడు. తెచ్చినవి వాళ్ళకిచ్చేసి "జల్దినొస్త సార్" అంటూ వెదుక్కుంటూ తన అడ్డా మీది కొచ్చేశాడు.

ఎనిమిది దాటింది.

కాంపౌండంతా అసెంబ్లీ శీతకాల సమావేశాల్లా గులగుల్లాడ్తోంది.

సిటింగ్స్ కోసం జట్లు వస్తూనేవున్నాయ్.

బాలీ, మస్తాన్‌ల పుణ్యమా అని షాపుల్లోంచి సీసాలు జట్లుజట్లుగా లేచొస్తున్నాయ్.

పాపం. బాలి అందర్నీ సరిగా సముదాయించలేకపోతున్నాడు.

అందరూ పిలవటమే.

అందరూ తిట్టటమే.

ఈమధ్య ఎప్పుడూ ఈ రోజంతా హడావుడి లేదు. దానికి తోడు ఈ రోజే కాలునొప్పి మొన్న జానీగాడు తగువు పెట్టుకోకపోతే ఈ రోజింత అవస్థయేది కాదు. తనూ పరిగెత్తేవాడే మస్తాన్‌లాగా. ఆ బాడుకావ్, అనవసరంగా తనమీద పడుతున్నాడీ మధ్య. శుక్రవారంనాడు ఆ దరిద్రం గ్రూప్ వచ్చింది. వాళ్ళే సీసాలవీ తెచ్చుకున్నారు. పోయేటప్పుడు తనని పిలిచి ఆ ఖాళీ బాటిల్స్ తీసుకుపొమ్మన్నారు. వాళ్ళు పిలవకపోతే అవి జానీగాడికే వదిలేసేవాడు. పిలిచారు కదా అని తెచ్చుకుంటే వాడు తగువు కొచ్చాడు. ఎంత సర్దిచెప్పినా లాభం లేకపోయింది. చివరకు బాటిల్స్ ఇస్తానన్నా ఊరుకోక వాటిని పగలేశాడు. కొన్ని ముక్కలు తన కాలికి గుచ్చి రక్తం చిమ్మాయి. ఆవేశంతో తనూ వాడిమీద పడ్డాడు. మస్తాన్‌గాడూ, ఇంకెవరో వచ్చి ఇద్దర్నీ చల్లబరిచారు.

"అరేఁ ఈ సారి బీసు అప్పుడంత సల్లగ

లేదేంట్రా" మీసాలు గద్దించేయి.

తనకేం చెప్పాలో తోచలేదు.

అతనో లారీ డ్రైవర్. అంటే లారీని అమాంతం తలమీద పెట్టుకుని నడవగలిగే వాడు. అతను పట్టుపడితే వుడుంలా వదలడని చాలామంది అంటారు. నల్లగా కాలయముడు లాగే వుంటాడు కాబట్టి చాలామంది ప్రాణాలు తీసుకుని కేబిన్‌లో పెట్టుకున్నాడు. అతను లారీ నడపనప్పుడల్లా తాగుతాడు. అతన్ని చూస్తే చాలా భయం బాలికి. తంతాడేమోనని భయంగా వుంటుంది. వాడి చేతిలో తనో బంతి అయినట్టు కుంచించుకుపోతాడు.

"బాలి" తెల్లహై మళ్ళా పిలిచింది.

సమయం, సాకూ దొరికిందని సంతోష పడ్తూ "అబ్బీ ఆతాసాబ్" అని అటువేపు నడిచాడు.

"క్వార్టర్ విస్కీ" మత్తుగా చెప్పాడు.

అప్పటికే రెండు బీరు బాటిల్స్ ఖాళీ చేశాడు.

మళ్ళా విస్కీ!

"విస్కీ ఎట్లా తాగుతరు సార్."

"అరేయ్. నీపేరేంది, బా....బాలీ, కె యస్ ఐ కంపెనీ మేనేజర్ చెప్పాక నీకెందుకు పో. వాంటెడ్ క్వార్టర్ విస్కీ" ఈసారి యాభయి నోటు తీసిచ్చాడు.

హై ముద్దుగానే వుంటుంది.

ఇదీ అంటూ ఖచ్చితంగా చెప్పలేని ఏదో భావం ఆ మొహంలో వుంటుంది. ఆ కళ్ళు ఆ ఒళ్ళు చూస్తుంటే ఎందుకో సిగ్గు పడుతున్నట్టు కుంచించుకుపోతాయి. అందుకే___ బార్స్‌ల్లో తాగలేక ఇక్కడి కొచ్చాడేమోనని అనుమానంగా వుంది బాలికి.

"పో. త్వరగా పట్రా పో" అంటూ ఖాళీ బాటిల్ తీసుకుని పదే పదే ముద్దు పెట్టుకున్నాడు.

బాలి వెళతా వెళతా రాజన్ దగ్గరకెళ్ళి "కుచ్ హోనా సాబ్" అడిగాడు.

"అచ్చా, బాలీ, నా పేర్జెప్పి మూడు బీర్లు తీస్కరా" కళ్ళద్దాల్ని తీసి తుడిచి పెట్టుకుంటూ అన్నాడు.

"ఇయ్యరు సాబ్."

"ముందు నువ్ పొయ్యడుగు."

"లేద్సార్."

పక్కతను ఇరవై నోటుతీసి "మూడు తీస్కరా పో" అన్నాడు.

"నక్కో కైలాస్ ఉనో దేతా."

ఈలోగా బాలి డబ్బులు తీసుకని వెళ్ళి పోయాడు.

వీళ్ళమధ్య మెదలడం కంటే గాల్లో గడ మీత నడవడమే హాయిగా వుంటుందనిపిస్తుంది బాలికి.

అయ్యలాగే తనూ ఓ దగ్గర చెప్పులు కుట్టుకుంటూ కూచున్నా పొయ్యేది?

పొయ్యేది ఎప్పుడో?

పొయ్యేది___పొయ్యేది

వండటానికి పొయ్యేది?

అవ్వ పోయాక పొయ్యేసుకుని వంట మొదలెట్టిన రోజున తన చెయ్యి కాల్చుకున్నాడు.

చెయ్యేకాదు ఆ నాడే అంతా కాల్చుకున్నా___ పొయ్యేది.

"సేఠ్‌జీ మూడు టాప్, క్వాటర్ విస్కీ."

మొదట్లో బీరు తాగాలనిపించే దెపుడయినా. అడుగు చుక్కలయినా వుంచరు లక్కీ డ్రాప్స్ అంటూ చివరంటా పీలుస్తారు. బీరు విస్కీ ఎలాగూ తాగలేదు తను. పొద్దుట్నుంచి సంకటయినా తాగలేదు.

తెల్ల'హై'కి విస్కీ యిచ్చేసి రాజన్ వైపు బయల్దేరాడు.

పదకొండవుతోంది. ఎక్కడి వాళ్ళక్కడ వెళిపోతున్నారు. జనం పల్చబడింది. మొదట్లా బోసిపోయినట్లుందా గ్రౌండ్. ఇంటికెళ్ళి పోవాలి. అయ్య తాగి టాప్ గేర్‌లో వుండుంటాడు.

"అరేయ్ బేకూఫ్ ఇది 'టాపే'నా బే" రాజన్ కళ్ళద్దాల చాటునుంచి అరిచాడు. గుక్కలో బీరు నేలమీద ఊసాడు, తిడుతూ.

"టాపే సార్" బాలి జవాబు.

మళ్ళా ఓ గుక్క పోసుకున్నాడు. నోట్లోంచి

టాప్‌గుక్క కడుపులోకి వెళ్ళటం లేదు.

"ఇది వాపస్ యిచ్చి టాప్ తీస్కరా పో"

"ఓపెన్ చేసినంక వాపస్ తీస్కోరు సార్, గమ్మతుగ మాట్లాడ్తండ్రు."

"మరిదేం చెయ్యమంటవ్ బే"

సరదాగా, బాలికి రాజన్ దగ్గర వుండే చనువు కొద్దీ కొంచెం సాహసించీ అన్నాడు.

"తాగేసెయండ్రి సార్ బాగనే వుంటది"

బాలి సమాధానానికి గుక్క రెచ్చిపోయింది. అది బస్ట్ అయినట్టు కోపంగా వొచ్చి బాలి మొహమ్మీద పడింది. బాలి మొహమంతా బీరుతో తడిసిపోతుంది. బిందువులు బిందువులుగా మొహంమీంచి జారుతోంది. తుడుచుకోటానికి వాడి దగ్గర చేతులుతప్ప కర్చీఫ్ లేదు. రెండు చుక్కలు నాలుకమీద కూడా పడినయ్. అసహ్యం జుగుప్సవేసింది.

రాజన్ అసహ్యంగా కనిపించాడు.

అతని కళ్ళద్దాలు, అతని బట్టలు, అతని కాలేజీ, అతని సంస్కారం అంతా అసహ్యంగా కనిపించాయి బాలికి.

పక్కన వున్న యిద్దరూ తమకేమీ పట్టనట్లు సీసాలు నోట్లో పెట్టుకొని చీకుతున్నారు.

"పో, రాస్కెల్ ఇంకెందుకు నిల్చున్నవీడ. సువ్వర్‌కె బచ్చ"

బాలికి రాజన్‌ని బూతులు తిట్టాలనిపించింది.

పట్టుకుని కుక్కకి మల్లే చియ్యలు చియ్యలు పీక్కు తినాలనిపించింది.

మెల్లగా కదిలిపోతున్న బాలికి పక్కవాడటిగిన మాట వినిపించింది.

"ఏరా రాజూ, పాపమా పోరణ్ణి అన్యాయంగా ఇజ్జే స్తివి గద"

"నో. నీకు తెల్వది కైలాసం. ఇంతో అంతో తాగినంకద. దీనికి అర్థం వుండాల్నన్నా, కాసంత మజా చెయ్యాల్నన్నా ఇట్లాంటి ఒకటో రెండో జేస్తెగానీ, ఎంజాయ్ అవదు—బస్టె షన్నీ, సరదా—"

ఏడుస్తూ నించున్నా బాలికి పిలుపులు తప్ప లేదు. ఎందుకు తప్పుతాయి?

వాళ్ళ సుఖాలకోసం. వాళ్ళ భోగాలకోసం,

వాళ్ళ అవసరాలు సర్దటంకోసం తను జీవిస్తున్నపుడు ఎలా తప్పుతాయి?

"బాలిగా" తెల్ల పై అరచింది.

బాలి వెళ్ళి నించున్నా కన్నీళ్ళు కప్పుకోలేకపోతున్నాడు.

తెల్ల పై విస్కీ బాటిల్ లాగే బాలీని దగ్గరకు తీసుకుంది.

అతను బాలి మొహమ్మీదంతా తన కర్చీఫ్‌తో తుడిచాడు.

బాలి బావురుమని జరిగిందంతా చెప్పుకున్నాడు.

అతను విస్కీలా నల్లబడిపోయాడు.

బాలి మొహాన్ని ఆప్యాయంగా నిమిరాడు. గుండెకు హత్తుకున్నాడు.

బాలికి అవ్వ గుర్తొచ్చింది.

అయ్య గుర్తొచ్చాడు.

మనసులోనే తెల్ల పైకే మొక్కుకున్నాడు.

దేవుడి పాదాలముందు కొబ్బరికాయ తల బాదుకున్నట్టు బాలి 'పై'ముందు బాదుకున్నాడు.

పై ఓదార్చింది. సానుభూతి పద్యాలు నడిచాయి.

మిర్చీ తినమని యిచ్చి బలవంతంగా తినిపించా డతను.

బాలి కొంచెం కొంచెం మామూలు స్థితికి వచ్చాడు.

"మేం పోతున్నం రా బై" మస్తాన్‌గాడు వెళ్ళిపోయాడు.

బాలి ఒక్కసారి లేచి చుట్టూ చూశాడు. రాజన్ వాళ్ళ బ్యాచి తప్ప ఎవరు లేరు.

ఆర్.ఆర్. లాబ్స్ వెళ్ళే రోడ్డుమీదనుంచి లారీ వెడుతోంది, మత్తుగా.

గుబురుగా కమ్ముకున్న చెట్లమీంచి ఏదో కూస్తుంది, కొత్తగా.

"బాలీ కూచోరాదుర" పై సన్నగా కూస్తోంది.

"ఇపుడే వొస్తాన్ సార్" అని తన అడ్డా మీదికి వచ్చి ఖాళీ బాటిల్స్ కూడేసిన సంచి తెచ్చుకున్నాడు. మిగిలిన ఒకటీ అరా ఏరుకుని ఇట్నుంచే ఇంటికెళ్ళచ్చని?

తెల్లపై అతను ఎదురుగా కూచోపెట్టుకుని మాటలు చెబుతుంటే ఏదో ఆత్మీయత కలుక్కుమని తొంగి చూస్తుంది బాలికి.

విస్కీ బాటిల్ ఇంకా కొంచెం మిగిలింది.

అతనికూడా ఇదీ అని చెప్పలేనిదేదో మిగిలినట్టుంది.

బాలి అతన్ని తండ్రిలా, తల్లిలా, దేవుడిలా యింకా యింకా దేంతో సరిపెట్టుకోవాలో తేలక ఆకాశంకేసి చూస్తున్నాడు.

చెప్పాల్సింది ఎలా మొదలెట్టాలో తెలీక అతను బాలివైపే చూస్తున్నాడు.

తెల్ల పై చేతులు బాలి మొహాన్ని దగ్గరికి తీసుకున్నాయి.

చేతులు కదలటం ప్రారంభించాయి.

బాలికి మొదటగా ఆశ్చర్యంగా వుంది. తరువాత అయోమయంగా వుంది. పిదప యింకా దశలు మారింది. భయం మొదలయింది.

చేతులు ఇనుప పట్కారు రెక్కల్లా బాలి నిక్కర్‌లోకి వెళ్ళాయి.

తొడల్ని నలిపేస్తున్నాయ్.

బాలికి చచ్చిపోతానేమోననిపించి తన్నుకోటం మొదలెట్టాడు.

పై పిచ్చిగా రక్కుతూ నిక్కర్ పీకేసింది.

రోట్లో రోకలికి మల్లే గుండె కొట్టుకోటం బాలికి.

బాలికి అర్థంకాని ఆవేశం వచ్చింది.

శవంమీదపడ్డ నక్కలా, దొంగలమీదపడ్డ పోలీసు కుక్కలా, గద్దలా రక్కాలనిపించింది. చంపాలనిపించింది. తెల్లదనాన్ని. పైని.

కానీ—

బాలి ఏం చేయగల్డు పాపం.

ఊపిరే ఆడకుండా అయింది.

సీరియల్

మీరా



లక్ష్మి

బామ్మగారు దగ్గరకి రాగానే "బామ్మా!" అంది మీరా.

బామ్మగారు మీరా తల నిమురుతూ "బాబమ్మా! తెల్లగా వున్నాడు. నీ ఒంట్లో ఎలా వుందమ్మా!" అని ఆప్యాయంగా అడిగారు.

"చాలా తేలిగ్గా వుంది బామ్మా! బామ్మా, అమ్మ ఏదీ?" అడగలేక అడగలేక అడిగింది మీరా.

"ఇంటికి వెళ్ళిందమ్మా! నేనే పంపేను—నీకు కాఫీ తీసుకురమ్మని."

అది అబద్ధమని మీరాకి తెలిసిపోయింది. బాధగా నిట్టూర్చింది.

మీరాని ఇంటికి తీసుకొచ్చిన రోజున కాంతమ్మ అంది "దొడ్డమ్మా! మనం వెళ్ళిన రోజునే ఆ లావుపాటి ఆవిడకి కూతురు పుట్టి పోయింది చూడు. ఆవిడకి పిల్లలు పుట్టకుండా ఆపరేషన్ చేశార్ట. ఇంక కాన్పువస్తే బ్రతకదన్నారుట. వాళ్ళు పెంచుకుంటారట—నర్సు చెప్పింది. దానికి నువ్వు కాస్త చెప్పు."

"మీరా!" అని మీరా మొహంలోకి చూసిన బామ్మగారు ఇంక మాట్లాడలేకపోయారు. కాస్సేపు చూసిన కాంతమ్మ, "ఇప్పుడు దానికేమీ తెలియట్లేదు—ఎవరికి జవాబు చెప్పుకోగలం? చిన్నతనంవల్ల తనకి తెలియకపోయినా తన కోసం పెద్దవాళ్ళు చెప్తే వినవద్దా?" ఆవిడ డగ్గుత్తికతో ఆగిపోయింది.

"మీరా! అమ్మ చెప్పింది నిజమేనమ్మా! నిన్ను చూసుకునే ఈమాత్రమన్నా మీ అమ్మ వుంది. నీ జీవితం యిలా అయిందంటే...."

మీరా కళ్ళెత్తి బామ్మగారి ముఖంలోకి చూసింది.

"ఈ పాపం కూడా ఎందుకు బామ్మా, తెలిసి చేయడం? వాడేం చేశాడు మధ్య! ఆవిడకి పిల్లలు పుట్టకుండా అపరేషన్ చేయలేదు. ఆపరేషను చేసి బిడ్డను తీశారు కాన్పు కష్టమైతే" నిదానంగా అంది.

తను చేసిన దొంగతనం బయటపడిపోయినట్టు గిలగిల్లాడింది కాంతమ్మ.

"ఇంత వివరంగా చెప్పినా నా మాట విననప్పుడు ఇంక నేనెందుకూ? ఇంక నేనూ—వున్నా ఒకటే చచ్చినా ఒకటే! ఎందులోనన్నా పడి చస్తాను" ఏడుపు మొదలెట్టింది.

"ఇన్ని ఏడుపులూ గొడవలూ ఎందుకు బామ్మా! ఈనాడు నన్ను చేయమంటున్న పని ఆనాడు తనే చేస్తే—ఇన్ని సమస్యలుండేవి కావుగా........"

"ఎంత మాటన్నావే-ఎంత మాటన్నావే!" గుండెలు బాదుకుని ఏడ్చింది కాంతమ్మ.

మూడు రోజులు మంచం దిగలేదు కాంతమ్మ.

ఇద్దరికీ సర్ది చెప్పేసరికి బామ్మగారికి తలప్రాణం తోక్కొచ్చినంత పనయింది.

మొదటిసారిగా బామ్మగారి వళ్ళో తల పెట్టుకుని కరువుతీరా ఏడ్చింది మీరా. "తప్పమ్మా! ఏడిస్తే తలనొప్పి వస్తుంది. బాబు లేచాడు చూడు" అన్నారు బామ్మగారు మీరాను లేపి సరిగా కూర్చోపెడ్తూ.

* * *

ఉదయం పని అయిపోగానే బామ్మగారి దగ్గర కూర్చుని అంది మీరా "బామ్మా! ఉద్యోగానికి అప్లికేషను పెడతాను. ఊరికే కూర్చుంటే నాకేం తోచటం లేదు. అయినా ఎన్నాళ్ళిలా!"

ఎప్పుడో అప్పుడు మీరా ఇలా అంటుందని ఆవిడ అనుకుంటూనే వున్నారు. ఇప్పుడు కాంతమ్మ పరిస్థితి చూస్తే ఆవిడకి భయంగా వుంది. దీనికేం గొడవ చేస్తుందో!

"మాద్దాంలేమ్మా! ఇప్పుడేం తొందర? అమ్మ ఆరోగ్యం నయంకాని."

"మనం కావాలనుకున్న వెంటనే వస్తాయా బామ్మా! నీకు తెలియదూ?"

"మీరా! నీకు తెలియంది ఏముంది! అమ్మ సంగతి చూస్తున్నావుగా! దేనికీ తట్టుకోలేక పోతోంది. ఇప్పుడు దేనికీ తట్టుకొనే పరిస్థితిలో లేదు మీరా! నువ్వే అమ్మని అర్థం చేసుకుని ఆ ప్రకారం నడచుకోవాలి."

"............................"

"ఏం మీరా?"

"అలాగే బామ్మా!"

* * *

"అయ్యో అయ్యో! దుక్కలాంటి చెంబు! ముప్పై రూపాయలు పెట్టినా రాదు. అయినా నూతిమీద పెట్టుకుంటారా!" అని లబలబలాడుతూ అక్కడికి వచ్చింది చంద్రమ్మగారు. రావుడమ్మ నూతిలో గేలం వేస్తోంది.

"అయినా ఎన్నిసార్లు చెప్పేనే నీకు?నూతంచుమీద ఏం పెట్టవద్దని! నీకెవరి మాటా లెక్కలేదు. అందుకే నీ అత్త అంత మొత్తుకుంటుంది."

"మీరుండహె! వూరికే ఖంగారుపెట్టేత్తన్నారా!" కోపాన్ని అణచుకుంటూ విసుగ్గా అంది రావుడమ్మ.

"పైగా నేను ఖంగారెత్తున్నానా? నువ్వు చేసిన పని బాగుందా?" చంద్రమ్మగారు ఖస్సుమన్నట్టుగా అంది.

"మీరెల్లండె. మీ చెంబు తీసిత్తాగా! మీకేటి బయ్యం" కాస్త తగ్గినట్టుగా అంది. చంద్రమ్మగారికి నమ్మకం లేదు. "అంత దుంగలాంటి చెంబు గాలానికి చిక్కుతుందా? అయిపోయింది! పొద్దున్నే మంచి గొడవే తెచ్చిపెట్టావు. రేపటి నుంచి నువ్వు రాకు. నీ అత్తనే రమ్మను" అంది.

రావుడమ్మకి కోపం వచ్చింది "పదిసార్లు ఆలా అనకండె! మానేయమంటే మానేత్తాను" అంది కోపంగా గాలం తాడు అలాగే పట్టుకుని.

అక్కడే వున్న రమణమ్మ యిద్దరికీ సర్దిచెపుతున్నట్టుగా అంది "ముందు చెంబు సంగతి చూడు రావుడూ!" అని, చంద్రమ్మగారితో "మీరు స్నానం చేసేయండి. మళ్ళా వంట ఆలస్యం అయిపోతుంది. ఆయన తొందరగా భోజనంచేసి వూరికెళ్తానన్నారు" అంటూ ఆడపడుచుని అక్కడనించి పంపేసింది. రావుడమ్మకి కోపంవస్తే ఎక్కడ పనికిరాదోనని ఆవిడ భయం. దాని అత్తకి ఈమధ్య ఒంట్లో బాగుండటంలేదు. అందుకే కోడల్ని పంపుతోంది. రావుడమ్మకి సర్దిచెప్దామంటే "అదిగో పనిమనిషిని వెనకేసుకొచ్చింది" అని చంద్రమ్మగారు విరుచుకుపడ్తుంది.

చంద్రమ్మగారు స్నానంచేసి వంటపని చూస్తున్నా ఆవిడ ధ్యాసంతా బావిలోపడ్డ చెంబుమీదే వుంది. "అయ్యో దుక్కలాంటి చెంబు! రాయిలాంటి చెంబు! ఏనాటి చెంబు?" అని సణుక్కుంటూనే వుంది.

అప్పుడే నిద్ర లేచివచ్చిన బాచి "ఏమిటి? ఏమయింది?" అన్నాడు.

బాచికి ఏం చెప్పకూడదనుకుంటూనే కంచుచెంబు తళతళలాడుతూ కళ్ళముందు మెదిలేసరికి "కంచు చెంబు లేదూ...." ఇంకా ఆవిడ ఏదో చెప్తూంటేనే మధ్యలో బాచి అన్నాడు "నీళ్ళు పోయకుండా చిక్కటిపాలు వేరే పెట్టుకుంటావూ! ఆ చెంబా?"

"అవున్రా! చిక్కటి పాలన్నీ నేనే తాగేస్తున్నాను" బాచితో చెప్పటమే తన బుద్ధితక్కువని తనని తాను తిట్టుకుంటూ కోపంగా అంది.

"సర్లే! ఆ సంగతెందుకు. ఇప్పుడా చెంబుకి ఏమయింది? కడుపు నొప్పా! తలపోటా?"

చంద్రమ్మగారికి చాలా కోపం వచ్చింది. ఇంకేదేనా అంటే ఇప్పుడు పెద్ద గొడవ జరుగుతుంది. అప్పుడే ఏడు గంటలయిపోతోంది. వంటకి ఆలశ్యమవుతుందని కోపాన్ని దిగ మింగుకుంటూ, "నువ్వెళ్లొరే! నాకు పని వుంది" అంటూ విసుక్కుంది.

బాచికి ఆవిడకి క్షణం పడదు.

"నీ పనికి నేనేం అడ్డం వచ్చేను అత్తయ్యా! ఆ చెంబు వుందా?"

"ఉంటే ఈ గొడవెందుకూ?" విసుక్కుం దావిడ.

"పోయిందా! ఆఖరిసారిగా ఎక్కడ? ఎన్ని గంటలకి చూశావ్?"

అసలే చెంబుపోయి బాధపడుతోంటే బాచి మాటలతో పిచ్చి కోపం వచ్చిందావిడకి. విసురుగా లేచి నుంచుంది.

ఎందుకేనా మంచిదని బాచి నాలుగడుగులు వెనక్కివేసి నిలబడ్డాడు.

"నా నెత్తిమీద చూశారా! నువ్వు పో అవతలకి నన్ను చంపక. నేను కూర్లబుట్ట తెచ్చు కోవాలి" అంది.

"ఇంకనేం మరి! నువ్వు స్నానం చేస్తుంటే జారి నూతిలో పడుంటుంది" అన్నాడు బాచి.

ఆవిడకి విసుగొచ్చి, "ఓసే రవణమ్మా! ఓసారి ఇలారా!" అని కేకేసింది. అంతలో తండ్రిమాట వినపడి బాచి అక్కడనుంచి మెల్లగా జారుకున్నాడు. మొత్తానికి ఎలాగయితేనేం రావుడమ్మ బావిలోంచి చెంబు తీసింది.

"ఇదిగోనండి మామ్మగారా! మీ చెంబు తీశాను" అంది.

"దొరికిందే! తీశావా?" సంభ్రమంగా అంటూ వచ్చిందావిడ.

"లేకపోతే మీరూరుకుంటారేటి?"

"మా అమ్మమ్మ యిచ్చిందే యిది. దీని కథ నీకేం తెలుసు?" చెంబుని చేతిలోకి తీసుకుని కొత్తచెంబుని తడిమి చూసినట్లు చూస్తూ అంది.

చెంబు బావిలో పడిపోయినప్పటినుండీ చంద్రమ్మగారన్న మాటలు రావుడమ్మ మర్చి పోలేదు. ఆ కోపం యింకా అలాగే వుంది.

"మీ చెంబు మీకిచ్చాను బాబూ! తీసిత్తానండీ అంటే ఒకటే ఖంగారెట్టేసి తోచకుండా చేసేశారు—పైగా మాటలో! అంత ఒల్లు తెలవకుండా పనెట్టా సేత్తావనుకొంటున్నారో!" అంది కొంగుకి తడి చేతులు తుడుచుకుంటూ.

"పెద్దావిడ ఏదో అంటే తప్పట్టుకుంటారే! నువ్వు వెళ్ళి మొహం కడుక్కుని రా! కాఫీ ఇస్తాను" రవణమ్మ దాన్ని పంపేసింది.

"అమ్మో! దీనికళ్ళు నెత్తిమీదుంటాయేమ్మా!" అంటూ చెంబు తీసుకుని లోపలికి వెళ్ళి పోయింది చంద్రమ్మగారు!

"అక్కయ్యా! ఎవరొచ్చారో చూడు" అంటూ శాస్త్రిగారొచ్చేరు.

"బాగున్నావా అక్కయ్యా!" అంటూ పలకరించేడు వచ్చిన పెద్దమనిషి.

నుంచున్న చోటనే కూలబడుతూ, "మీ బావని మింగేశారా, లచ్చుప్పా" అంటూ గొల్లు మంది చంద్రమ్మగారు.

"వూరుకో, వూరుకో?....ఏమిటో అప్పటినించీ రావటం పట్టలేదు. ఎప్పటి కప్పుడే ఏదో ఒక ఇబ్బంది" నసిగేడాయన.

రవణమ్మ వచ్చినాయనకి చెంబుతో నీళ్ళిచ్చి కాళ్ళు కడుక్కోమంది. పీట వాల్చి కూర్చోమని కుశలప్రశ్న లడిగింది. చంద్రమ్మగారు ఏడుపు మాని పదేళ్ళనాటి సంగతులన్నీ చెప్ప సాగింది. లచ్చప్పని చూడగానే చంద్రమ్మగారు పెట్టిన శోకం వినగానే ఖంగారుగా ఆవిడ కూతురు గిరిజా బాచీ వచ్చేరు. "ఎవర్నీ మింగేశానంటోంది అత్తయ్య" తల్లినడిగాడు బాచి.

"ఎవర్నీ లేదు. నువ్వెళ్ళవతలకి" కసురుకుందావిడ.

"ఎవర్ని గిరిజా మీ అమ్మా మింగేశానంటోంది" గిరిజ నడిగాడు బాచి.

"అవతల ఎవరో వచ్చేరు ఏమిటిదీ? చెప్తోంటే నీక్కాదూ!" తల్లి కోపంగా అనేసరికి బాచి వెళ్ళిపోయాడు.

"ఎవరొచ్చేరత్తయ్యా!" అని గిరిజ అడిగింది.

"మీ అమ్మకి పెద్దమ్మ కొడుకు—మీనాన్న పోయాక యిదే రావటం" అంది.

ర ర ర

నాలుగు నెలలు రాగానే బోర్లాపడుతున్న విజయ్ నాలుగోనెల వెళ్ళబోయే ముందు పొట్టతో కాస్త కాస్త ముందుకి జరగటం మొదాలెట్టేడు. ఏవేవో శబ్దాలు చేస్తూ కాళ్ళూ చేతులూ తప తప కొట్టుకుంటూ తన బోసినోరంతా తెరచి నవ్వుతాడు. మీరాకి ప్రపంచ మంతా ఆ చల్లని నవ్వులోనే కన్పిస్తుంది. అలాంటప్పుడు అక్కడ ఎవరూ లేకపోతే విజయ్‌ని పైకి ఎగరేసి పట్టుకుని వాడితో ఎన్నో కబుర్లు చెప్తుంది. అక్కడ తల్లి లేకుండా బామ్మగారు ఒక్కరే వుంటే పళ్ళు బిగించి సున్నితంగా విజయ్ బుగ్గ పట్టుకుని సాగదీస్తుంది ముద్దుగా. తల్లి కూడా వుంటే ముద్దుగా వాణ్ని చూడ్డానికే సాహసించదు. ఏదో తప్పుపని చేస్తున్నట్టుగా అన్పించేది అలాంటప్పుడే.

విజయ్‌కి మూడోనెల రాగానే బామ్మగారు కంసాలికి బంగారం ఇచ్చేరు గొలుసూ, మురుగులూ, మొలకి మామడిపిందెలు చేయమని. ఒంట్లో బాగుండలేదనీ, యిదనీ, అదనీ చెప్పి విజయ్‌కి నాలుగు నెలలు వెళ్ళబోయే ముందు యిచ్చేడు. బామ్మగారు అయిదోనెల రాగానే వేద్దామన్నారు. "నువ్వు అలాంటి చాదస్తాలు పెట్టుకోవద్దు బామ్మా! నువ్వు ఎప్పుడు చేస్తే అప్పుడే మంచిది" అంది మీరా.

"ఏమిటోనమ్మా నీకా నమ్మకం. నా పేరు పెట్టొద్దు కాంతం అంటే అప్పుడు మీ అమ్మ వినలేదు. నా పేరు పెట్టకపోతే నీ జీవితం బాగుండేదేమో!" బాధగా అన్నారు బామ్మగారు.

"అదేమిటి బామ్మా! నీపేరు బలంవల్లే ఇలా వున్నాను. లేకపోతే ఇంకా ఎలా వుండేదాన్నో! ఏమిటి? ఇవ్వాళ ఇలా మాట్లాడుతున్నావు?"

ఆవిడోసారి కళ్ళు మూసుకు తెరిచి "ఏమిటోనమ్మా! నువ్వూ మీ అమ్మా ఒకరికొకరు అంటీ ముట్టనట్టు తిరుగుతున్నారు—నేను ఎన్నాళ్ళు వుంటాను చెప్పు!...."

"బామ్మా!" భయంగా, బాధగా అంది. "అలా అనకు బామ్మా! విజయ్‌ని నువ్వే పెంచి పెద్దచెయ్యాలి" అంటూ బామ్మగారి రెండు చేతులూ తన రెండు చేతుల్లోకి తీసుకుంది.

"పిచ్చితల్లి! ఎండిన ఆకు రాలకుండా ఎన్నాళ్ళుంటుందమ్మా!"

"ఎన్నాళ్ళయినా వుండాలి—వుంటుంది—నువ్వలా మాట్లాడకు బామ్మా! నాకు భయం వేస్తోంది" మీరా గొంతు వణికింది.

"నేను వున్నా ఏం చేయగలను మీరా! నెల రోజులుగా ఇలా వున్నాను. లేచి తిరగలేక పోతున్నాను. అయినా అమ్మా, నువ్వూ యిలా వుంటే ఎలాగ? అమ్మ మాటలు పట్టించుకోక, నువ్వే అమ్మని మాట్లాడిస్తూండాలి. అప్పుడు అమ్మకి ధైర్యం చిక్కుతుంది."

'హుః అమ్మ చూసే చూపు బామ్మకేం తెలుసు? కోపంగా చూడకపోయినా ఆ చూపులకి తట్టుకునే శక్తి తనకి లేదు.'

"అమ్మమీద నాకేం కోపం లేదు బామ్మా! అయినా అమ్మమీద నా కెందుకు కోపం? ఆవిడేం చేసింది మధ్య! నే నేదేనా మాట్లాడితే ఆవిడకి కోపం వస్తుందేమోనని ఊరుకున్నాను."

"అమ్మకి మాత్రం నీమీద కోపం ఎందుకుంటుంది! నీ భవిష్యత్తు గురించి దిగులు—అంతే! నువ్వే అమ్మతో అదీ ఇదీ మాట్లాడుతూ తిరిగావంటే నెమ్మదిగా తనూ ధైర్యం తెచ్చుకుంటుంది."

మీరా మౌనంగా వుండిపోయింది.

* * *

"ఇదేమిట్రా లచ్చప్పా వచ్చి నాలుగు రోజులయినా కాలేదు అప్పుడే వెళ్తానంటున్నావుట. ఇంకో నాలుగురోజు లుండరా!" అక్కడికి వస్తూ అంది చంద్రమ్మగారు.

"ఉండడానికి వీల్లేదే అక్కయ్యా! ఇప్పుడు రావడమే బ్రహ్మాండం అయిపోయిందనుకో! మళ్ళా ఎప్పుడేనా వస్తాలే" అన్నాడు బాగ్ సర్దుకొంటూ.

"ఆఁ! మళ్ళా వచ్చేమాట వట్టిదేలే! ఇన్నాళ్ళకి యిప్పుడొచ్చావు. వచ్చినవాడివి ఎలాగూ వచ్చేవు. నాలుగు రోజులుండి వెళ్ళు" అంది మళ్ళీ.

"ఇప్పుడు వుండడానికి లేదే అక్కయ్యా! గిరిజ పెళ్ళికి తప్పకుండా వస్తాను" అన్నాడు. చంద్రమ్మగారు యింకేం మాట్లాడలేదు.

చంద్రమ్మగారి భర్తపోయిన పదేళ్ళకి ఆవిడని చూడ్డానికేం రాలేదాయన. ఆయనకి తాతలనాటిది రెండెకరాల పొలం ఈ వూళ్లో వుంది. అది శాస్త్రిగారే చూస్తున్నారు. అదికాస్తా అమ్మి డబ్బు పట్టుకుపోదామని వచ్చేడు. చంద్రమ్మగారు మొదట ఇన్నేళ్ళకి తనని చూడ్డానికే వచ్చేడనుకొంది. వాళ్ళ పెద్దమ్మ లచ్చప్పావాళ్ళు చిన్న పిల్లలుగా వున్నప్పుడే పోయింది. లచ్చప్ప తండ్రి మళ్ళీ పెళ్ళి అయిదారేళ్ళకి కాని చేసుకోలేదు. అప్పుడు లచ్చప్పా అన్నగారు ఇక్కడే పెరిగారు. ఓ తల్లి కడుపున పుట్టిన బిడ్డల్లా మసులుకొనేవారు. ఇప్పుడు వాళ్ళకారోజులు గుర్తులేవు. చంద్రమ్మగారు శాస్త్రిగారు మాత్రం మర్చిపోలేదు.


అందరికీ చెప్పి లచ్చప్ప వెళ్ళిపోయాడు.

"ఆయన వుండను మొర్రో అంటుంటే ఎందుకంత బ్రతిమాలుతావు" విసుక్కుంది గిరిజ.

"పోనీ చాలా రోజులకి వచ్చేడుకదా అని వుండమన్నాను. వుండకుండానే వెళ్ళాడు" బాధగా అందావిడ.

"ఒసేయ్ రవణమ్మా! బాచిగాడు పొలం వెళుతున్నట్టున్నాడు. వచ్చేప్పుడు గోంగూర కొమ్మలు పీక్కురమ్మను" అంది చంద్రమ్మగారు. బాచితో సాధారణంగా చెప్పదు.

"చూడు గిరిజా! బాచి వున్నాడేమో! వుంటే చెప్పిరా" అంది రవణమ్మ.



గిరిజ వెళ్ళి చెప్పి వచ్చింది.

బాచి పొలం వెళ్ళగానే పాలేరుచేత గోంగూర ఇంటికి పంపేడు.

సాయంత్రం బాచి ఇంటికి వచ్చేసరికి చంద్రమ్మగారు గోంగూర పచ్చడి చేయడానికి రుబ్బురోలు కడుగుతోంది.

"పచ్చడి చేయడం అయిపోయిందా అత్తయ్యా!" బాచి అడిగాడు.

"లేదు నాయనా! దానికే రోలు కడుగుతున్నాను. వాడిన నీళ్ళన్నీ దానీమీదుగానే పోతాయి. ఇది కాస్త ఆ గుమ్మం దగ్గర వేయించండ్రా అంటే ఒక్కళ్ళు వినరు. ఆ పాలేరుగాడు నా మాట వింటాడా?" అందావిడ. రోలు దగ్గర కూర్చోవడానికి వీల్లేకుండా రొచ్చులా అయిపోయిం దక్కడ.

"అంతే అత్తయ్యా! న్యాయానికి ధర్మానికి రోజులు కావు ఇవి. ఏం చేస్తాం చెప్పు! మన రోజుల్లో ఎంత అల్లాడేవారు? ప్చ్!" చాలా జాలిగా బాధగా ముఖం పెట్టేడు బాచి. చంద్రమ్మ గారికి కోపం వచ్చినా 'హుఁ! వాడితో నాకేమిటి?' అని వూరుకుంది.

"పచ్చడి చేయడం అయిపోయిందేమోనని ఉరుక్కుంటూ వచ్చేననుకో."

"అదేఁ? పచ్చడికి కాదేమిటి? పచ్చడికే అనుకుని వేయించేశాను" నడ్డిన చేయి అన్చు కుంటూ అడిగింది.

"అమ్మమ్మ! అక్షరాలా పచ్చడికే! పచ్చడి చేయడం అయిపోయిందేమోనని, ఉల్లిపాయలు వేశారో లేదోనని...."

ఆవిడ ఖస్సుమంది. "ఏకాదశిపూటా ఉల్లిపాయలేమిట్రా! అయినా మడికట్టుకుని నేను ఉల్లిపాయలు ఎలా ముట్టుకుంటాను?"

అప్పటికే బాచి వుల్లిపాయలు ఒలవటం మొదలెట్టేడు. "నువ్వు కాసేపు తప్పుకో! నేను చేసి పడేస్తాను" అన్నాడు.

చంద్రమ్మగారు అన్నీ రోలు దగ్గిరికి తెచ్చుకుని కూర్చుంది.

"లేత కూరేమో వేగి యింతయింది. దాన్ని రెండు రకాల పచ్చళ్ళు చేస్తే ఎవరి ముక్కులోకి రాను: కావాలంటే ఇంకో రోజు చేస్తుందిలే మీ అమ్మ" అంది.

"నీ ముక్కులోకి సరిపడేది నువ్వు తీసుకుని మిగతాది ఇవతల పడేయ్" అని, "గిరిజా: మీ అమ్మ ఈ ఉల్లిపాయలు వేయించమంటోంది" అరిచాడు. గిరిజ నిజమేననుకుని వచ్చింది.

"నేనేం పిలవలేదు. వెళ్ళవతలకి" కూతుర్ని కసురుకుంది.

"నేనేం వేయించలేననుకున్నావా?" అంటూ గబ గబా కొబ్బరాకులు మంటచేసి ఉల్లిపాయలు వేయించేసి రోటి దగ్గరకి వచ్చేడు.

"నువ్వెంత మొత్తుకొన్నా నేనీవేళ వెయ్యనురా: చెప్తోంటే వినవేం?" కోపాన్ని అణచుకుంటూ అందావిడ.

"హమ్మమ్మ....హరి భుజింతును గోంగూర పచ్చడి, వుల్లిపాయ లేందే ఏం బాగుంటుంది? నువ్వే చెప్పు చంద్రమ్మత్తయ్యా!" పాటకింద పాడేశాడు బాచి.

అంతలో రవణమ్మ అక్కడికి వచ్చింది.

"చూడు రవణమ్మా: ఇప్పుడు ఉల్లిపాయలు వేయమంటాడు: ఎంత పచ్చడవుతుంది? ఈ కాస్తదానికి రెండు రకాలా?....అబ్బా: ఈ రోలు ఇక్కడినుంచి తీయించు రవణమ్మా: ఈ బొద్దింకలతో చస్తున్నాను" దూరంగా విదులుస్తోంటే అవి రెట్టింపు వేగంతో కచ్చికట్టినట్లే తిరిగి వస్తున్నాయి బొద్దింకలు.

తల్లి చెప్పినా బాచి వినలేదు. "అత్తయ్యని తనకి తీసుకుని వెళ్ళమను: ఏమిటి ఇబ్బంది?" అన్నాడు.

చంద్రమ్మగారు లేచి యివతలకి వస్తూ బొద్దింకమీద కాలేసింది.

"హత్యా: హత్యా: ఊరూ పేరూ తెలియని ఒక బొద్దింక చంద్రమ్మత్తయ్య కాలికిందపడి దుర్మరణం పాలయింది" అరిచాడు బాచి.

"అయ్యో, ఎక్కడ్రా!" ఖంగారుగా రెండడుగులు వెనక్కి వేసిందావిడ.

"ఎక్కడేమిటి?—వెళ్ళిపోయింది ఆ లోకానికి. ఈపాటికి యముడితో నీమీద చెప్తూ వుంటుంది."

రవణమ్మ బాచిని మందలిస్తోంటేనే చంద్రమ్మగారంది "చూశావే వాడి మాటలు. బొత్తిగా నేనంటే వాడికి కిట్టటం లేదు."

రవణమ్మ బాచిని కేకలేసి అవతలకి పంపేసింది. తర్వాత ఆడపడుచుతో అంది "వాడి మాటలు మీరు పట్టించుకోకండి వదినా: నేను కేకలేస్తూనే వున్నాను చూస్తున్నారుగా: ఓసారి వాళ్ళ నాన్నగారితో చెప్పాలి. అయినా చేతినిండా పనిలేక అలా కొట్టుకుంటున్నాడు. అందాక ఏ కొట్లోనన్నా పెట్టినా బాగానే వుండును."

"వీడు అక్కడ మాత్రం తిన్నగా చేస్తాడనా?" అంది చంద్రమ్మగారు.

"ఆc, చెయ్యకేం చేస్తాడు? చచ్చినట్టు చేస్తాడు" అంది.

చంద్రమ్మగారికీ బాచికీ పడకపోవడానికి చాలా కారణాలున్నాయి. ఆవిడ చెప్పినట్టే అందరూ వినాలనే స్వభావం ఆవిడది.

మడి మడంటూ ఆవిడ ఏం చేసినా నలుగురికి సరిపడినన్ని వేరే పెట్టుకుంటుంది. తర్వాత

చాటుగా కూతురికి పెడుతుంది. ఇంకా మిగిలితే పాడైపోయినాక అవతల పారేస్తుంది. రవణమ్మ చూసీ చూడనట్లు వూరుకుంటుంది. బాచి వూరుకోడు. చాలా ఆర్భాలు తీస్తాడు. గిరిజకి ఇలాంటివేం కిట్టవు. తల్లిని చాటుగా కేకలేస్తుంది. చాటుగా తల్లి ఏం పెట్టినా తినదు. "వాళ్ళు నాకేం పెట్ట నట్టు చేస్తావేమిటి? అత్తయ్య చూస్తే ఏమనుకుంటుంది?" అంటుంది. అయినా ఆవిడ వినిపించు కోదు. ఏడుస్తుంది. అలాంటప్పుడు గిరిజ తల్లినేమీ అనలేదు.

గిరిజకి ఇటు తల్లి చేసే పనులూ నచ్చవు. అటు బాచి తల్లిని హేళన చేస్తోంటే చూసి భరించలేదు. 'ఎవరికి చెప్పినా వినరు' అనుకుని బాధపడుతుంది. సాధ్యమైనంతవరకూ వాళ్ళిద్దరూ గొడవపడుతోంటే ఆ చుట్టుపక్కల వుండదు. మేనత్త కూడా కూడా తిరుగుతూ ఆవిడకి పనిలో సహాయం చేయడమో లేకపోతే ఏదేనా కుట్టుకుంటూ కూర్చోవడమో చేస్తూంటుంది.

గిరిజకి చేతి పనుల్లోనూ ఇంటి పనుల్లోనూ వుండే శ్రద్ధ చదువులో లేదు. నాలుగో క్లాసులో మూడేళ్లు కూర్చుని మానేసింది. చదువు ఎలాగూ రాలేదు సంగీతం చెప్పించమని చంద్రమ్మగారు తమ్ముడిని పోరసాగింది. శాస్త్రిగారు మేనకోడలిని అడిగారు "ఏం గిరిజా! సంగీతం చెప్పించు కుంటావా?" అని. "నీ ఇష్టం" అంది గిరిజ.

చదువు ఎలాగూ రాలేదు సంగీతమన్నా వస్తే మంచిదని అనుకున్నాడాయన. ఇప్పుడు ప్రతీవాళ్ళు పిల్ల ఏం చదువుకుందని అడుగుతున్నారు. చదువూ లేక సంగీతం లేకపోతే పెళ్ళి అవటం కష్టమే అనిపించింది. రెండేళ్ళనుట్టే సంగీతం చెప్పిస్తున్నారు. అంత చురుగ్గా ఒంట బట్టక పోయినా గిరిజ గొంతు బాగానే వుంటుంది. ఆ పల్లెటూర్లో అంత బాగా చెప్పేవాళ్ళుకూడా లేరు. ఓ మెల్లకన్ను మేష్టారు అయిదారేళ్ళబట్టి ఆ వూళ్లో సంగీతం చెప్పుకునే సంసారం ఈడు స్తున్నాడు. గిరిజకి ఆయనే చెప్తున్నాడు.

ఆ సంగీతం మేష్టారు వచ్చి వెళ్ళాక చంద్రమ్మగారు వూరుకోదు. ఆయన గిరిజకి చెప్తోంటే శ్రద్ధగా విని, ఆయన అటు వెళ్ళగానే నెమ్మదిగా కూనిరాగాలు మొదలెడ్తుంది. అప్పుడు బాచి పళ్ళెమో డబ్బానో తీసుకుని వెనకాలే మద్దెల వాయిస్తాడు. ఆవిడకి కోపం వస్తుంది. ఇద్దరూ వాదించుకుంటారు. దెబ్బలాడుకుంటారు. గిరిజ అయితే దూరంగా పోతుంది గాని రమణమ్మ వూరుకుంటే బాగుండదు కదా! ఇద్దరికీ సర్దిచెప్పి, ఇద్దర్నీ చెరో పక్కకీ పంపేసరికి ఆవిడకి తల ప్రాణం తోక్కొస్తుంది.

* * * *

కార్తీక మాసపు చలి గడగడలాడిస్తోంది.

తెల్లారగట్ల నాలుగు గంటలనుంచే విజయ్ పడుకోకుండా ఏడుపు మొదలెట్టాడు. మీరా ఒళ్ళో పడుకోబెట్టుకున్నా కాళ్ళమీద పడుకోబెట్టుకున్నా వాడు వూరుకోలేదు. బుజాన్నేసుకుని తిప్పింది. వూరుకున్నట్టే వూరుకుని మళ్ళీ ఏడవడం! ఎందుకో మీరాకి తెలియలేదు. ఒళ్లు వెచ్చగా వుందా అంటే అదేం లేదు. బామ్మగారిని లేపుదామా అనుకుని మళ్ళీ వూరుకుంది మీరా.

విజయ్‌ని చంకనేసుకునే నీళ్ళపొయ్యి అంటించింది. నీళ్లు పోస్తే పడుకుంటాడేమోనని. ఈరోజు బామ్మ శివాలయంలోకి వెళ్దామంది. పొద్దుపోతే చాలామంది వస్తారు తొక్కిసలాటుగా వుంటుంది. ఏకాదసి కదా 'ఎలాంటివాళ్ళు వస్తారు' అంది.

కార్తీక మాసం వచ్చినప్పటినుండి బామ్మగారు అందరిలా కాలవదగ్గరకెళ్ళి దీపాలు పెట్ట లేక పోయినా ఇంట్లో బావిదగ్గరే స్నానంచేసి తులశమ్మ దగ్గరే దీపాలు పెట్టుకుంటున్నారు.

కాంతమ్మ ఏ పూజా చేయడం మానేసింది. మీరా పరిస్థితి ఇలా అవటంతో ఆవిడకి రెండు చేతులూ ఎత్తి నమస్కరించాలంటేనే విరక్తిగా వుంది. ఆవిడ చిన్నప్పటినించీ సుఖం అంటే ఏమిటో సంతోషం అంటే ఏమిటో ఎరగదు. "దేవుడే ఉంటే ఇన్ని బాధలా! ఒకటి కాకపోతే ఒకటన్నా మంచి జరగద్దా?" అనుకుంటుంది.

నీళ్ళు కాగగానే విజయ్‌కి నీళ్ళుపోసింది మీరా. విజయ్‌కి ఒళ్ళు తుడిచి పౌడరద్దుతూ. "ఈ వేళ బామ్మకన్న నువ్వే ముందు లేచావురా విజయ్! నువ్వే బామ్మని లేపాలి. బామ్మా! నీమీద సొద్దేశానని చెప్పాలి! ఏం? బామ్మ దీపాలు పెడ్తుందిగా! నువ్వు జేజకి దండం పెడ్తావా?" అంది.

విజయ్ కితకితలు పెట్టినట్టే నవ్వేడు.

"ఏం? బామ్మమీద సొద్దేశానని సంబరమా? ఊఁ....." అంటూ ముద్దు పెట్టుకుంది.

మీరా విజయ్‌ని తీసుకుని ఇవతలకి వస్తోంది. కాంతమ్మ అప్పుడే లేచినట్టుంది. వంటింట్లో ఏదో సవరిస్తోంది. మీరా బామ్మగారి మంచం దగ్గరికొచ్చింది.

"బామ్మా! విజయ్ నీమీద సొద్దేసేశాడు" అంటూ మంచంమీద కూర్చుంది.

బామ్మగారినుండి సమాధానం రాలేదు.

"బామ్మని లేపమ్మా విజయ్!" అలా అంటూనే "బామ్మా! ఈరోజు తొందరగా గుడికి వెళ్దామన్నావుగా!" బామ్మగారిమీద చేయివేస్తూ అంది.

ఆవిడ కదల్లేదు.

మీరాకి భయంవేసింది. చీమ చిటుక్కుమంటే మేలుకునే బామ్మ—"బామ్మా! బామ్మా!" ఖంగారుగా కుదుపుతూ గబగబా పిల్చింది.

"రాత్రి పొద్దుపోయే వరకూ మేలుకుంది — పడుకోనీ!" కాంతమ్మ వంటింట్లోంచి అంటోంది. ఇంతలో మీరా "బామ్మా!" అంటూ ఒక్క వెర్రికేక పెట్టింది.

"ఏమిటి, ఏమయింది" అంటూ ఖంగారుగా కాంతమ్మ చేసేపని ఆపుచేసి పరుగెత్తు కొచ్చింది.

"బామ్మ మాట్లాడటంలేదు—కదిపినా కదలటంలేదు" ఏడుస్తూనే చెప్పింది మీరా.

"ఏమిటే?!" ఖంగారుగా అంటూ మంచం దగ్గరకి వచ్చి "దొడ్డమ్మా!" అంటూ ఆవిడ ఒంటిమీద చేయివేసిన కాంతమ్మ గొల్లుమంది.


వీళ్ళ ఏడుపులు విని పూజారింట్లోవాళ్ళు మేష్టారింట్లోవాళ్ళు పరుగెత్తుకొచ్చేరు.

"ఇదేమిటే? నిన్న సాయంత్రం మాతో మాట్లాడింది" అని ఒకరంటే "రాత్రి మాతో మాట్లాడితేనా" అని ఇంకొకరన్నారు ఆశ్చర్యంగా.

"పుణ్యాత్మురాలు. ఎంతటివాళ్ళకి ఇలాంటి చావు. కార్తీకమాసం—ఏకాదశి—ఎంతటి వాళ్ళకి. ఏనాడో పుణ్యం చేసుకుంది" అందరూ తలోవిధంగా అంటున్నారు. మీరానీ కాంతమ్మనీ ఎవరూ వూరుకోపెట్టలేక పోతున్నారు.

"రాత్రి అందుకేనా అంత పొద్దుపోయే వరకూ అప్పగింతలు పెట్టినట్లు అలా చెప్పావు" అని ఇద్దరికిద్దరూ అనుకుని ఏడుస్తున్నారు.

"అయ్యో! ఇన్ని కష్టాలేమిటి? ఎన్ని జన్మల పాపం భగవంతుడు కట్టి కుడుపుతున్నాడు. ఆఖరికి నీ నీడకూడా లేకుండా చేశాడా దేముడు. దొడ్డమ్మా! నీ బదులు నన్నన్నా తీసుకుపోలేదేం?



ఇంకా నాకు పాప పరిహారం కాలేదా! ఇంక నేనే బాధకీ తట్టుకోలేను దొడ్డమ్మా! చిన్న బాధ వస్తే ఇంక ఎవరితో చెప్పుకోను'' మంచం కోడుకి తలేసి కొట్టుకుంది కాంతమ్మ.

మీరా ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లినట్లుగా పడిపోయింది.

*   *   *   *

పదిహేను రోజులు గడిచిపోయినాయి.

బామ్మగారు పోయాక ఇల్లంతా నిశ్శబ్దమయిపోయింది. కాంతమ్మ ఓ గదిలోనూ విజయ్‌ని పెట్టుకుని మీరా ఓ గదిలోనూ కూర్చుంటారు.

ఇద్దరిమధ్యా వారధిలా వుండే బామ్మగారు పోయాక తల్లీ కూతుళ్ళు చెరోపక్కకీ విసిరేసినట్లు అయిపోయారు. మాట్లాడుకోవడానికి వాళ్ళకేం కారణాలు కనిపించటం లేదు. మీరా తల్లితో ఏదేనా మాట్లాడదామని వెడుతుంది. తీరా తల్లిదగ్గరకి వచ్చేకా ఏం మాట్లాడాలో అర్థంకాదు. మెల్లగా వచ్చినట్లే వెనక్కి వెళ్ళిపోతుంది.

కాంతమ్మ పూర్తిగా మంచం దిగడం మానేసింది.

బామ్మగారు పోయినప్పటినుంచీ బాచి రోజూ రెండుపూటలూవచ్చి చూసిపోతున్నాడు. అది ఆ తల్లీ కూతుళ్ళకి కాస్త వూరట కలిగిస్తుంది.

ఇంక మీరా ఒకటే అనుకుంది. తను ఏం చెప్పినా తల్లి వినదు. నింపాదిగా బాచిచేత చెప్పిస్తే తల్లి మందు, ఆహారం తీసుకుంటుందేమోనని ఆశకలిగింది. బాచిని చాటుకి పిలిచి చెప్పింది.

బాచి ఎంత బ్రతిమాలినా కాంతమ్మ వినలేదు. ఆఖరికి బాచి ఒట్టు పెట్టుకుని కళ్ళ నీళ్ళు పెట్టుకుని, "ఇన్నాళ్ళూ మీరు నన్ను కన్నకొడుకులా భావిస్తున్నారనుకొన్నాను" అన్నాడు.

కాంతమ్మ ఏడ్చేసింది. "కడుపున పుట్టిన బిడ్డలు ఇంత బాధ పడరు బాబూ! నువ్విలా వచ్చి పోతున్నావు గనుకనే ఈమాత్రం వుండగలిగాను" అంది.

"మరి నేను చెప్పినట్లు ఏం విన్నారండీ పిన్నిగారూ! ఒక్కపూట మీ చేత గుప్పెడన్నం తినిపించగలిగేనా!.... నేనేదేనా తప్పుగా అంటే నామీద కోపం పెట్టుకోకండి" అన్నాడు బాచి బాధగా.

"ఎంత మాట బాచి! నీమీద నాకు కోపమా! నువ్విలా రోజూ కనిపించకపోతే నాకు పిచ్చెక్కిపోనీ పాటికి."

"మీ చేతి వంట తిని చాలారోజులయిందండీ పిన్నిగారూ!"

కాంతమ్మ సంబరపడిపోయింది. "నిన్ను కన్న తల్లిదండ్రులు ఎంత అదృష్టవంతులయ్యా బాచి! నేనంటే నీకెందుకింత అభిమానం?—ఉండు! క్షణంలో చేసిపెట్టనూ? నేనుచేసే వంటల్లో నీకేది ఇష్టమో చెప్పు! చిటికెలో చేసిపెడతాను" అంది లేస్తూ. ఏమిటో ఆవిడకి ఎక్కడలేని బలం వచ్చినట్లయింది.

మీరాకి క్షణంసేపు ఏమిటోలా అయిపోయింది మనసు. కాని, వెంటనే సర్దేసుకుంది. పోనీ బాచి ధర్మమా అని అమ్మ యిలా వుంటే....

"నువ్వు బాచీతో కబుర్లు చెప్తూండమ్మా! నేను చేస్తాను" అంది మీరా.

"వద్దులే! నేను చేస్తాను. నువ్వెళ్ళి లేత వంకాయలు కోసుకురా. బాచికి గుత్తివంకాయ కూర చాలా ఇష్టం" అంది.

తల్లి మాట్లాడిన ఆ కాస్త మాటకే మీరా సంబరపడిపోయింది.

రోజూ బాచి వచ్చి కాంతమ్మ అన్నం తిందో లేదో మీరాని అడిగి తెలుసుకునేవాడు. మీరా తినలేదని చెప్పిననాడు ప్రతిమాలి నిష్ఠూరంగా మాట్లాడి ఆవిడ అన్నం తిన్నాక వెళ్ళేవాడు. "ఇదే మీ కన్నకొడుకయితే ఇన్నిసార్లు చెప్పించుకుంటారా? అతని మనసు ఇలా బాధపెడ్తారా!" అనేవాడు. ఆ మాట కాంతమ్మ మీద మంత్రంలా పని చేసేది.

కడుపులో బెంగ వున్నప్పుడు, మనసు కుదురులేనప్పుడు ఎన్ని మందులు తిన్నా ఒకటే-ఎంత మంచి ఆహారం తీసుకున్నా ఒకటే!

కాంతమ్మ రోజు రోజుకీ బాగా నీరసపడిపోసాగింది. బాచి బలవంతంమీదే ఒకసారి డాక్టరు దగ్గరికి వెళ్ళి వచ్చింది. డాక్టరు సన్న సన్నగా చివాట్లేసింది. "పోయిన వాళ్ళతో పోతామా? పెద్దవారు మీరే యిలా అయితే ఎలాగండీ!" అంటూ.

నాన్నగారు పోవడం—తల్లి బొత్తిగా అలా అయిపోవటంతో మీరాకి తెల్లారుతోందం టేనే ఏదో దిగులూ, భయమూ. బాచి ఋణం ఎన్ని జన్మలెత్తినా తీర్చుకోలేననుకుంటుంది.

రెండు నెలలు గడిచిపోయాయి.

కాలం ఇంత నత్తనడకలా నడవడం మీరాకి ఎప్పుడూ అనిపించలేదు.

"లాభం లేదు. ఇలా వూరికే కూర్చుంటే పిచ్చెక్కడం ఖాయం" అనిపించింది మీరాకి. అయినా ముందు జీవనోపాధి చూసుకోవద్దు! కూర్చుని తింటే కొండలయినా తరుగుతాయన్నది అసత్యమేం కాదు.

తల్లితో నింపాదిగా చెప్పింది తను వుద్యోగం చేస్తానని.

ఆవిడ కాసేపు మాట్లాడలేదు. ఇంకోసారి చెప్పే ధైర్యం లేని మీరా మరోసారి చెప్పచ్చులే అనుకుంది.

తర్వాత కాంతమ్మ అంది "నీ ఇష్టం! నీకెలా మంచిదనిపిస్తే అలా చెయ్యి. నన్ను మాత్రం ఎక్కడికీ రమ్మనకు."

మీరాకి వెర్రి దుఃఖం—తల్లిమీద ఎన్నడూ రానంత కోపం వచ్చినాయి. తల్లిని ఇలా వదిలేసి తను వెళ్తుందా? ఒక్కమాటలో వద్దనిచెప్తే పోలా!

మీరాకి ఆలోచించగా ఆలోచించగా అన్పించింది పోనీ ప్రయివేట్లన్నా చెప్పుకుంటే మంచిదేమో! బాచిని చూడమని చెప్పాలి. అమ్మ కలసి రాదుగాని, ఈ వూళ్ళో సెంటరులాంటిది ఏం లేదు. చక్కగా ఓ గదిలో యింత టైమని పెట్టుకొని మిషను కుట్టటం, కత్తిరింపులూ నేర్పితే చాలామందే వస్తారు. కాలక్షేపానికి కాలక్షేపం అవుతుంది. ఈ వూళ్ళోనే వుండాలనుకున్నప్పుడు మరి సంపాదనా చూసుకున్నట్లవుతుంది.

* * *

విజయ్‌కి బాగా జలుబు చేసింది. రాత్రినించి ఒళ్ళు వెచ్చగా కూడా వుంది. మీరాకి భయం వేసింది. వెళ్ళి తల్లికి చెప్పింది.

"ఒళ్ళు బాగా వేడిగా వుందా?" అని అడిగిందావిడ.

"అంత బాగా లేకపోయినా కొంచెం వేడిగానే వుంది. అయినా ఏమిటోలా వున్నాడు, డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళనా?" అడిగింది మీరా.

కాంతమ్మ ఉయ్యాల దగ్గరకొచ్చి విజయ్ ఒంటిమీద చెయ్యివేసి చూసింది. వేడిగా వుంది. ఏం చేయాలో తోచలేదావిడకి. డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళడం ఆవిడకి ఇష్టంలేదు. ఆవిడ ఆలోచనలు అనేక రకాలుగా పోయినాయి. మీరా పిల్లాడిని ఎత్తుకెళ్తే అంతా ఏం అనుమానిస్తారో! అందులో వాడు అచ్చు మీరా పోలికే. అసలు ఊరి చివర ఈ ఇంట్లో ఎవరున్నారో చాలామందికి తెలియనే తెలియదు. ఈ చంటాడి గురించి ఎంతమందికి తెలుసు? చూసినవాళ్ళు ఎవరబ్బాయమ్మా అని అడిగితే! మీరా చెప్పలేక మౌనం వహిస్తే! వాళ్ళకి అనుమానం కలగదూ!....

"డాక్టరు దగ్గరికి తీసుకెళ్ళనా?"

మీరా మాటలతో ఆవిడ వులిక్కిపడింది. "బాగా జలుబు చేసిందంతే! కస్తూరి మాత్ర వేసి ఈ పూటకి చూద్దాం" అంది.

మీరాకి డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళాలని వున్నా మళ్ళీ తల్లి ఏమంటుందోనని వూరుకుంది. విజయ్‌కి కస్తూరిమాత్ర ఏం పనిచేయలేదు. మీరా దిగులుగా కూర్చుంది.

ఎప్పుడూ మీరానే తల్లిని అన్నానికి పిల్చేది. కాఫీ టైముకి తల్లికి కాఫీ యిచ్చేది. ఈరోజు మీరా పన్నెండు దాటినా భోజనం ధ్యాస వున్నట్లు లేదు. ఉయ్యాల దగ్గరే కూర్చుంది. క్షణం కూడా ఒకచోట వుండకుండా ఇల్లంతా పాకుతూ, అవీ, ఇవీ పట్టుకు లేస్తూ, పడ్తూ తెగ అల్లరి చేసే విజయ్ అలా పడుకునుంటే మీరాకి భయమేసింది.

కాంతమ్మ వచ్చింది. మీరా ఉయ్యాల దగ్గర కుర్చీలో కూర్చునుంది.

"మీరా! అన్నానికి రా! పన్నెండు దాటింది" అంది.

"నాకు ఆకలి లేదమ్మా! నువ్వు తినేసెయ్యి!" అంది మీరా.

"ఆకలి లేకపోవడం ఏమిటి? నువ్వెళ్ళి తినిరా! నే నిక్కడ కూర్చుంటాను" అంది కాంతమ్మ ఉయ్యాల దగ్గరకొస్తూ.

ఎన్నాళ్ళకి పిల్చింది "మీరా" అని. ఏనాడయింది 'మీరా' అని—"అన్నానికి రామ్మా!"

అని. విజయ్ ఒళ్ళు తెలవకుండా పడుకున్నాడని భయంవల్లో—ఇన్నాళ్ళకి తల్లి పెద్దగా ఆప్యాయంగా పిలవకపోయినా—పిల్చిందనో—మరి ఆ రెండూ కలిసో కాని—మీరా కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. తల్లి చూడకుండా మొహం తిప్పేసుకుంది.

"నువ్వు తినేసిరా! నేను తర్వాత తింటాలే" ఇటు తిరక్కుండానే అంది మీరా.

"ముందు నువ్వెళ్ళి తినిరా! తర్వాత నేను తింటాను" అంది కాంతమ్మ.

మీరా తప్పనిసరిగా లేచి వెళ్ళింది.

విజయ్ పుట్టిన ఈ ఎనిమిది నెలల్లో ఎన్నడూ రొంపన్నా పట్టి ఎరగడు.

విజయ్ అలా పడుకోవటంతో కాంతమ్మకి ఏం తోచకుండా పోయింది. కాంతమ్మ విజయ్‌ని ఎప్పుడూ ఎత్తుకుని ఎరగదు. బామ్మగారున్నన్నాళ్ళూ ఆవిడే వాడిని పక్కలో పడుకోబెట్టుకుని—ఒళ్ళో కూర్చోబెట్టుకుని ఆడించేది. ఆవిడ పోయాక మరీ కృంగిపోయినట్టయిపోయింది కాంతమ్మ. మీరానే అన్నీ చూసుకొనేది. విజయ్ ఆరోనెలనే పాకడం మొదలెట్టేడు. ఏడో నెలలో మంచాలూ, కుర్చీలూ పట్టుకుని నిలబడ్డం అడుగులేయడం మొదలెట్టేడు. కాంతమ్మ కూర్చుని ఏదేనా పని చేసుకుంటోంటే విజయ్ పాక్కుంటూ వచ్చి ఆవిడని పట్టుకుని లేచి నుంచుంటాడు. చేనేవి లాగేస్తాడు. ఆవిడ మంచంమీద పడుకుంటే దుప్పటి లాగేస్తాడు—జుట్టు, చెవులు పీకుతాడు. ఎక్కువగా 'దా దా' అంటాడు. ఎంతసేపని వాడిని తాకకుండా వుంటుంది? మొదట్లో దూరంగా కూర్చోపెట్టేది. మీరా చూస్తోందేమోనని చూనేది మళ్ళీ. మీరా చూడనట్లే-కావాలనే విజయ్‌ని తీసేది కాదు. "వాడే ఆవిడని మార్చాలి. వాడివల్లే ఆవిడ మళ్ళీ మామూలు మనిషికావాలి" అనుకుని వాడెంత అల్లరిచేసినా ఏదో పని మిషతో దొడ్లోకి వెళ్ళిపోయేది మీరా.

అలా అల్లరి చేస్తున్న విజయ్‌ని కాస్సేపు ఒళ్ళో కూర్చోపెట్టుకుని, ఆడుకోవటానికి బొమ్మో—లేకపోతే బిస్కట్టో ఇవ్వక తప్పేదికాదావిడకి. వాడి చురుకూ—ఆ ముఖంలో రాచకళ—"ఏ జమీందారింట్లోనో పుట్టి అల్లారు ముద్దుగా అపురూపంగా పెరగవలసిన బిడ్డకదూ!" అనుకుంది కాంతమ్మ.

సాయంత్రం తల్లిని అడిగింది మీరా "తగ్గినట్టు లేదు. డాక్టరు దగ్గరకి తీసుకెళ్ళనా?"

"నేను తీసుకెళ్తాలే!" అంది కాంతమ్మ. ఆవిడ ఇందాకటినుంచీ అనుకుంటోంది తను తీసుకెళ్ళాలని. మీరా తీసుకెళ్ళడం ఆవిడకి ఇష్టంలేదు.

కాంతమ్మ రెండు లంఖణాలు చేసి క్రితం రోజే పత్యం తీసుకుంది. తల్లి నీరసంగా వుంది. తనే తీసుకెళ్ళ దలుచుకుంది మీరా. "నువ్వెందుకూ? అసలే నీరసంగా వుండి, నేను తీసుకెళ్తాను" అంది మీరా.

కాంతమ్మ ఫరవాలేదు నేను తీసుకెళ్తానన్నా మీరా వినలేదు.

మీరా విజయ్‌ని తీసుకుని హాస్పిటల్‌కి వచ్చింది. జనం చాలామందే వున్నారు. "ఏం అక్కా-ఇలా వచ్చేవు" అని అడిగాడు బాచి. కాలు కుంటుతున్నాడు.

"విజయ్‌కి ఒంట్లో బాగుండలేదు. అదేం అలా కుంటుతున్నావు?"

"గాజుపెంకు గుచ్చుకుంది, తీసేశాను కదాని అశ్రద్ధచేశాను. ఇంకా లోపల వుందేమో—వాచింది. పాదం మోపలేకపోతున్నాను. విజయ్‌కి జ్వరమా? ఎప్పటినించీ!" ఆతృతగా అడిగేడు బాచి.

"రాత్రినించి" చెప్పింది మీరా.

ఆడవాళ్ళవేపు చాలామంది వున్నారు. మగవాళ్ళవైపు ఇద్దరు ముగ్గురున్నారంతే! బాచి మీరాని మగవాళ్ళవైపు తీసుకెళ్ళాడు. విజయ్‌ని బాచి తీసుకెళ్ళాడు. డాక్టరు పరీక్ష చేస్తోంటే అప్పుడు మీరా వెళ్ళింది. డా॥ కుమార్ విజయ్‌కి ఇంజక్షనిచ్చి—మందులు ఇచ్చేడు. బాచి మీరా ఇవతలకి వచ్చేరు. అప్పుడే డా॥ మాధురీదేవి ఎందుకో వరండాలోకి వచ్చింది. మీరా నమస్కారం చేసింది.

మాధురీదేవి "మీ అమ్మగారికి ఎలా వుంది?" అని అడిగి, "ఈ బాబు ఎవరు?" విజయ్‌ని చూసి అడిగింది.

మీరా ఏం చెప్పలేక తికమక పడసాగింది. వెంటనే బాచి, "వాళ్ళ అక్క కొడుకండీ!" అన్నాడు.

"ఓ!" అర్థమయిందన్నట్టుగా అందావిడ. మళ్ళీ మీరాతో అంది: "ఇంకా ఆ బాధనుండి తేరుకోకుండానే పాపం బామ్మగారు పోయారు. నువ్వే ధైర్యం చెప్పాలి మీ అమ్మగార్కి."

మీరాతో మాధురీదేవి చనువుగా సరదాగా మాట్లాడుతుంది. ఆవిడకా వూళ్లో చదువుకున్న వాళ్లు చాలా అరుదుగా కలుస్తోంటాడు. అలాంటప్పుడు ఆవిడకి ప్రాణం లేచివస్తుంది. పట్నాల్లో చదువుకుని నలుగురి మధ్యా సరదాగా మసలటం అలవాటయిపోవడంవల్ల ఆవిడకి ఒక్కొక్కసారి పిచ్చెత్తినట్టుగా వుంటుంది.

బాచి అలా వెళ్ళిపోయాడు. మీరా ఇంటిదారి పట్టింది.

కాస్త దూరం వచ్చేసరికి నర్స్ జానకి ఎదురుపడింది.

"హాస్పటల్‌కి వెళ్ళలేదా?" అని అడిగింది మీరా.

"లేదు. మా పిన్ని వస్తానంటే బస్టాండుకి వెళ్ళాను. రానేలేదు! అదృష్టవంతుల్ని చెడిపే వారు లేరు దురదృష్టవంతుల్ని బాగుచేసే వారు లేరంటారు-ఇదేకాబోలు. ఎన్నాళ్ళనుంచో ఏదయినా సరే ముప్పై రూపాయలయినా చాలు ఏదేనా పని చూసి పెట్టమని ఉత్తరాలమీద ఉత్తరాలు రాసేది. పోనీ నా దగ్గరకొచ్చి వుండు నాకు మాత్రం ఎవరున్నారంటే విన్నది కాదు పూరికే ఎందుకూ అంటూ. ఇప్పుడు చూడు పని చూసినదాకా రాలేదు. ఆ పని కాస్తా పోతే ఏడుస్తుంది మళ్ళీ" గబగబా చెప్పుకుపోయింది జానకి.

"ఏం పని?" యధాలాపంగా అడిగింది మీరా.

"జమీందారుగారింట్లో—ఒకావిడ. ఆవిడకి వండిపెట్టి ఆవిడకి సహాయంగా వుండాలి. ఒక్క మనిషి. ఏమంత పని వుంటుంది. హాయిగా నిశ్చింతగా వుంటుందని రాశాను. ఈ రోజు వస్తానంది రాలేదు.... హాస్పటలకా? అమ్మగారికి ఎలా వుంది?" అని అడిగింది.

"కులాసాగానే వుంది" అంది మీరా.

"వస్తా! గంటలో వస్తానని చెప్పి వచ్చేను. చాలా ఆలస్యమయింది" అంటూ హడావిడిగా వెళ్ళిపోయింది జానకి.

రెండు రోజుల్లో జ్వరం తగ్గిపోయింది. విజయ్‌కి నాలుగు రోజుల్లో ఎప్పటిలా కులాసాగా ఆడుకోసాగాడు.

మీరా ఈ అయిదారు రోజుల్నుంచీ చాలా తీవ్రంగా ఆలోచిస్తోంది నర్స్ జానకివల్ల ఆ జమీందారు గారింట్లో ఏఏ పనులు చేయాలో మాటల్లో అడిగినట్లు అడిగి తెలుసుకుంది. జానకి

కూడా "మా పిన్ని వుత్తరం రాసింది వాళ్ళ తోటి కోడలికి ఒంట్లో బాగుండలేదుట! వాళ్ళు కబురు చేస్తే వెళ్ళిందట. తను వచ్చేవరకూ ఇక్కడ ఆగుతాయా చెప్పు! ఇక్కడ అమ్మగారేమో ఎవ ర్నైనా మంచి మనిషిని చూసిపెట్టమని ఒకటే ఇదిగా చెప్తున్నారు. ఏ శనిదేవత నెత్తిమీద వుందో కాని, డాక్టరమ్మగారు వంటమనిషి కావాలన్నప్పుడు రమ్మని రాశాను. అప్పుడూ ఇలాగే ఎవరికో జబ్బుగా వుందని రాలేదు. అయినా ఒకచోట పనికి ఒప్పుకొన్నాక వాళ్ళకి జబ్బుగా వుంది వీళ్ళకి జబ్బుగా వుందని మాటిమాటికి వెళ్ళినా బాగుండదు. ఎవరూ ఆదరించరని తెలిసీ ఎందుకో అలా పాకులాడుతుంది'' అని చెప్పింది.

పోనీ తానాపనికి ఒప్పుకొంటే! ఆవిడ ఒక్కావిడ. అమ్మ వుద్యోగానికి ఒప్పుకోవటం లేదు. ఈ ఊళ్లో ప్రయివేట్లు దొరికినా ఎంత? ఆవిడ చాలా మంచి ఆవిడని జానకి చెప్తోంది. అమ్మ దానికి ఒప్పుకోదు. ఏదో చిన్న అబద్ధమాడాలి. ఇలా కూర్చుని తింటే ఎన్నాళ్లు వస్తుంది డబ్బు?

ఇలా ఇంకో నాలుగురోజులు గడిచినాయి.

ఆఖరికి మీరా ఆలోచనలు అంగీకారానికి వచ్చినాయి. ఇందులో తప్పేంలేదనిపించింది మీరాకి. అలా ఓ నిర్ణయానికి వచ్చిన మీరా జానకిని కలుసుకుంది. మీరా చెప్పిన సంగతి విని జానకి తెల్లబోయింది.

"నువ్వా!? ఆఁ, అంతా వేళాకోళం" అని తేల్చేసింది.

"లేదు. నిజం జానకీ! ఇందులో తప్పేముంది? అమ్మని వదిలి నే నెక్కడికో ఉద్యోగానికి వెళ్ళడానికి లేదు. అమ్మ ఇక్కడనుండి కదలదుట! ఎలా చెప్పు! కూర్చుని తింటే ఎన్నాళ్ళు గడుస్తుంది చెప్పు!" అంది.

"నాతో వేళాకోళంగా అన్నావనుకొన్నాను. అయినా ఇందులో ఏం తప్పులేదు. అయినా ఆవిడ ఎంత మంచి మనిషో చూస్తే నీకే తెలుస్తుంది. ఆవిడ పని మనుషుల్నికూడా ఎంత ఆద రంగా చూస్తారో తెలుసా? కన్నతల్లికూడా అంత ఆప్యాయంగా మాట్లాడదనుకో! మరి అమ్మ గారు ఒప్పుకొన్నారా?" అని అడిగింది.

"అమ్మకి ఇంకా చెప్పలేదు. ఏదో ఒకటి సర్ది చెప్తాలే! ఇలా అని చెప్తేమాత్రం ఒప్పు కోదు. అక్కడికి ఎప్పుడు వెడ్దామంటారు" మీరా అడిగింది.

"నీ యిష్టం. ఎప్పుడయినా ఇలాంటి టైములోనే వెళ్ళాలి! సాయంత్రం హాస్పటల్‌కి వెళ్లాలి కదా! ముందు ఆవిడకి చెప్పి తర్వాత వెళ్తే బాగుంటుందేమో!" అంది జానకి.

"అవును! అదే మంచిది. ఆవిడ ఏం చదువుకుందని అడిగితే ఏ థర్డుఫారమో అని చెప్పు" అంది మీరా. అలాగే అంది జానకి.

మీరా భయంగా అడిగింది "ఆవిడ ఏదేనా అడుగుతుందా?"

"ఆఁ! అడగటానికి ఏముంటాయి."

"ఆవిడకి ఎప్పుడు చెప్తావు? రేపు రావా మళ్ళీ!"

"ఇప్పుడు నేను వెళ్ళి చెప్తాను. ఆవిడ కాదనదు. ఎవరయినా ఆవిడకి తోడునీడలా వుండాలి. రేపు రా!" అంది జానకి. అసలు మీరా ఏ స్కూలు ఫైనలో చదువుకుంది అనుకుంది జానకి.

(ఇంకా వుంది)


మీరు అందమయిన
దుస్తులు ధరిస్తే చాలా?
మీ ముఖ సౌందర్యాన్ని
పెంపొందించు
కోవాలి!
మీ ముఖం అందంగా
వుండడానికి... పాండ్స్ ఫేస్ పౌడర్
మృదుత్వమే కారణం.
అది మీ ముఖానికి మృదుత్వంతో
అసమానమయిన కళని తీసుకు
వస్తుంది. ఆ కళ అలాగే
వుంటుంది. గంటల తరబడి...
గంటల తరబడి...
FACE POWDER
Pond's
FACE POWDER
CP-1462
పాండ్స్ ఫేస్ పౌడర్
అనుపమ ముఖసౌందర్యానికి అద్వితీయమయినది
Pond's

జ్యోతి కథల పోటీలో ప్రత్యేక బహుమతి పొందిన కథ

సొమ్మొకడిదే - సోకొకడిదే

అంగర వెంకటశివప్రసాదరావు

"ఏటియ్యాల యింత ఆలీసం అయిపోనాది" కాళ్ళకి నీళ్ళిస్తూ అడిగింది లచ్చి.

'అయ్యగోరు నాపేరుమీద బండి బుక్కు చేసేరే....' ఆనందంగా అన్నాడు సింహాచెలం.

"ఏటి....ఎద్దులబండా....?" అడిగింది లచ్చి గిన్నెలో అన్నంపెడతూ.

"ఓసి ఎర్రిమొగమా....బండంటే....ఎద్దుల బండిగాదే, సూటరు. దాని కరీదెంతనుకుంటన్నావు....? దగ్గిర దగ్గిర ఆరువేలు....!"

"ఏటీ ఆరువేలే....! రూపాయలేనా...? ఆరొందలు కల్ల సూళ్ళేదు.... ఆరువేలు ఏడనించి వొస్తాయిరా మావాఁ.... అవునూ నాకు తెలీకడుగుతానూ .... నువ్వుచేసే బంట్రోతు వుజ్జోగానికి సూటరెందుకు....?"

"నువు నిజ్జెంగా ఎర్రిమొగానివేనే....అయ్యగోరు నా పేరుమీద బండి బుక్కు చేసేరన్నాను గానీ, నాకు బండి యిచ్చేస్తారన్నానేటే.... అసలు సంగతేటంటే .... నిన్న పేపర్లొ సూటర్లు బుక్కు చెయ్యడానికి యియ్యాల్టి నుంచి అప్లికేషను పారాలు యిస్తారని అచ్చేసారు. అయ్యగోరు పేపరు సూసి, నన్ను యియ్యాల సీకట్నే రమ్మన్నారు. నాను ఎల్లేను గందా....ఏటీ ఎల్లేనంటావా....నేదా....?"

"ఎల్లేవు...."

"అప్పుడేటైందంటే....అయ్యగోరు నన్ను ఆరి సూటరుమీద ఎక్కించుకుని మద్దిలిపాలెంలో వో ఆపీసుకాడికి తీసుకెళ్ళారు.... అక్కడ తీర్తపెజలా జనం నిలబడివున్నారు. నన్ను అయ్యగోరు ఆ లైనులో నించోబెట్టి నా సేతిలో అయిదు కాయితం పెట్టి...."ఒరేయ్ సింహాచెలం—అప్లికేసన్లు తీసుకుని యింటికి ఎళిపొచ్చేయి" అంటూ చెప్పి, ఆరెల్లిపోయారు.

"ఏటి....! మద్దిలిపాలెంలో నిన్నొగ్గేసి, ఆరింటికి .... ఎల్లిపోనారా .... మరాడనుంచి నువ్వెలాగొచ్చేవురా...." బెంగగా అడిగింది లచ్చి.

"ఉండహె....మద్దిలో పానకంలో పుడకనాగ అడ్డురాకు. ఆరు ఎల్లిపోనారు గందా ఆలైను అనుమంతుడు తోక నాగ పెరిగిపోతన్నాది. సూరీడు నెత్తెక్కిపోతన్నాడు. సెమట్లుకారిపోతన్నాయి. ఆ ఆపీసువోళ్ళునింపాదిగావొచ్చి తలుపు తీసి, అప్లికేసను పారాలు యిచ్చినారు. నాను అప్లికేసను పారాలు తీసుకుని, మద్దిలిపాలెం నుండీ అయ్యగారి బంగలాకి నడిచెల్లిపోనాను."

"అంతదూరం ఎలాగొస్తాడన్న బుద్ది ఆరికుండాల. పోనీ సిటీకి డబ్బులైనా యివ్వనేదు. పెద్దోలంతాయింతే. మన్లాటోల్లు ఆరి అడుగులకు మడుగులొత్తాల" దుయ్యబట్టింది లచ్చి.

"ఊరుకోయే .... ఆల్లు వుండబట్టే మనకీ పాటి గెంజి నీల్లన్నా దొరుకుతున్నాయి."

"సాల్లేరా .... ఈపాటి మన పల్లెటూర్లో దొరకదేటి? నువ్వెప్పుడూ ఆల్లు నేసిందే రైటంటావు" ఎత్తిపొడిచింది లచ్చి.

"అప్పుడేటయ్యిందంటే...నాను అప్లికేషను పారాలు అట్టుకెల్లానా....అయ్యగోరు ఆరిపేరుమీద వోటి....పెద్దమ్మగోరి పేరుమీదవోటి, సినబాబుగోరిపేరుమీద వోటి, సిన్నమ్మగోరి



పేరుమీద వోటి అప్లికేసనుపారాలు నింపేసినారు....''

"ఏటీ....అమ్మగోరు నూటరు నడుపుతారేటి....?'' మధ్యలో అందుకుంది లచ్చి.

"నా నందుకే నిన్ను ఎర్రిమొగవాఁ అంటూ వుంటాను. అప్లికేసను పారం నింపారన్నాను గాని....అమ్మగోరు బండి తొక్కతారన్నానా... యికపోతే మరో అప్లికేసను పారం వుండిపోనాది. అది ఎవురిపేర నింపాలా అని అయ్యగోరు ఆలోసించుతుంటే, అమ్మగోరు ఆరి తమ్ముడుగోరి పేరు నింపమని అడిగినారు. అంటే అయ్యగోరి బామ్మర్దిగోరన్నమాట.

"అయ్యగోరు ఏటన్నారో తెలసా?''


''నాకేటెరిక....నువ్వు సెప్తన్నావుగా...."

"ఏటన్నారంటే....ఆడిపేర్న బుక్కైసేస్తే బండాడు అమ్మీసుకుంటాడని సెప్పి, యింగిలీసులో ఏడేటో అన్నారు. అవన్నీ నీకు సెప్పినా అరదంగావులే....అందుకే నీకు సెప్పలేదు....'' దర్జాగా చెప్పాడు సింహాచెలం.

"నువ్వు సదివీసినావు గందా కలకటేరు సదువు.... పెద్ద నీకే అరదమైపోనాది." విసుక్కుంది లచ్చి.

రచయిత గురించి

పుట్టింది, పెరిగింది, కలం పట్టింది విశాఖపట్నంలోనే. రచయితగా వూపిరిపీల్చింది సరిగ్గా పదేళ్లక్రితం యిదేపత్రికలో. ఈ పదేళ్లలో చేసిన రచనలు సుమారు పాతిక వుంటాయి (అచ్చయినవి). అందులో ఒకటో, అరో సాధారణ బహుమతులు పొందినవి వున్నాయి.



కీర్తిశేషులు అంగర వెంకట కృష్ణారావుగారు మా అప్పగారు (పెద్దనాన్నగారు). వారే నాలోని రచయితని మేల్కొల్పి, నాచే 'అ' 'ఆ'లు దిద్దించారు. నా రచనలు చూపి పనికొస్తావన్నారు.

పురుషలక్షణమని వుద్యోగంచేస్తూ, సాగర సంసారపులోతులు చూస్తూ, మధ్య మధ్య రచనలు చేస్తున్నాను.

ఈ కథకి తప్పక బహుమతి వస్తుందని నా అంతరాత్మ (ఉంటే) చెప్పింది. అది నిజం చేశారు ఈ పత్రిక సంపాదకులు.

"ఉండెహే....నాను సెప్పేది సొంతం యిను. ఆఁ....ఎంతదాకా సెప్పేను.ఆఁ....అయ్యగోరు దిక్కులు నూస్తూ ఆలోసిస్తన్నారు. నాను ఆరి ఎదురుగ్గా సేతులు కట్టుకు నిల్సున్నాను.

ఆరు నాకేసి సూసి "సింహాచెలం నీకు బాబున్నాడా?" అని అడిగేరు.

"మా అయ్యా బాబూ....ఆడుపోయి మొన్న పండక్కి రెండేళ్లు అయిపోనాదే" అంటూ కళ్ళునీళ్ళెట్టుకున్నాను.

'పేరేంట'ని అడిగేరు.

నాను 'అప్పన్న'ని సెప్పాను.

ఆ అప్లికేసనుమీద నాపేరు, మా అయ్య పేరు యింకా ఏటేటో రాసినారు. సివర్న నన్ను అందులో సంతకం సెయ్యమన్నారు."

"ఏటీ! అందులో సంతకం ఎట్టేసినా వేటి...? ఎవురేనా కాయితం ముక్క సూపించి సంతకం పెట్టమంటే ఎట్టేడమేనా....? నాలుగు అచ్చరం ముక్కలు నానేగందా సదివేనని గొప్పగా సంతకం సేసీడవేఁ...."

"మనకేటి బయమే ఎర్రిమొగమా....మనకి బూములున్నాయా .... పుట్రలున్నాయా....ఏటి నాక్కుంటారని జడుపు." నవ్వుతూ అన్నాడు సింహాచెలం.

"మనకేటి బయమని నింపాదిగా అడుగుతున్నాడు....ఆల్లకి మనం బాకీ వున్నామని సెప్పి రాయించేసి, మన వొంట్లో సీవూఁ నెత్తురు పిండీగల్రు.జలమంతా ఆల్లకాడపడుంటి ఆల్లకి సాకిరీ సెయ్యాల....అది సాల్దేటి...."

"అయ్యగోరు అలాంటోరు కాదే...." తేల్గ్గా తీసిపారేసాడు సంహాచెలం.

"ఏ వుట్టనో ఏ పాముందో మనకేటెరుక."

"సర్లె నీ సోదెప్పుడూ వుండేదే....నాను

సెప్పింది యిను. ఆ తరవాత అయ్యగోరు అవేవో పేపర్లు....ఆటిపైన పెద్దపెద్ద సింహం బొమ్మలు వున్నాయి. ఆటిమీద ఏటో రాసి, మల్లీ సంతకం పెట్టించుకున్నారు.

"ఓరి! ఆటిమీదకూడ సంతకం ఎట్టేశావా., అది టాంపుపేపరని మా అయ్య సెప్పినాడో పాలి. మన పెల్లికి మా పొలం అమ్మేసినప్పుడు ఆ కాయితంమీద రాయించి అయ్యసేత ఏలి ముద్దర ఏయించినాడు పకీలు బాబు....అవి దస్తావేజులంట....ఓరి దేవుడోయ్ నా కొంప కూల్చేసినావు గందా...." అంటూ ఏడుపు మొదలుపెట్టింది.

"ఊరుకోహే .... ఆఁ .... సెప్పడం మరిసి పోతాను. రేపు సీకట్నే లేపు. పోట్టాపీసునో పనుంది. అయ్యగోరు సెప్పినారు."

"ఏ గంగనో దూకుతావో దూకు నాకేటి.." నులకమంచంలో ముసుగుతన్ని పడుకుంది లచ్చి.

సింహాచెలం చుట్ట వెలిగించి, పూరిపాక కన్నాల్లోంచి కనిపిస్తున్న చంద్రుణ్ని చూస్తూ పొగ పీలుస్తున్నాడు. చుట్ట పూర్తిగా కాలేంత వరకూ కాల్చి, రేపటిగురించి ఆలోచిస్తూ పడుకున్నాడు.

* * *

"ఇవాళెన్ని సంతకాలెట్టావు...." గుమ్మంలోనే ఎదురెళ్ళి అడిగింది లచ్చి.

"రెండు.." కాళ్లు కడుక్కుంటూ చెప్పాడు సింహాచెలం.

"అవున్లే....నిండా మునిగినోడికి సలేటి.... ఎట్టెట్టు రావఁకోటీలా ఎట్టు సంతకాలు..సీకట్నే యెలిపోడం పొద్దుగూకేక రావడం...." అన్నం వడ్డిస్తూ అంది లచ్చి.

"ఇయాలేమైందంటే...."

"నాకేటి సెప్పక్కర్నేదు. బేగి వణ్ణంతిని తొంగో....మల్లీ రేపు సీకట్నే నేపుతాను. రేపెల్లి మరో పాతిక సంతకాలు ఎట్టు...."

"సీ సొదెక్కువైపోనాదే ... నా నియాల సెప్పిగాని తొంగోను. ఇయాల ఏమైనాదంటే."

"అదుగో మల్లీ....నాకు సెప్పొద్దన్నానా.." కయ్యిమంది లచ్చి.

"నీతో ఏటీ సెప్పడం నేదు. నాలో నేనే సెప్పుకుంటున్నాను. అయ్యగోరు, నాను కలిసి పోట్టాపీసుకి ఎల్లాం. అక్కడకూడ జనం బారులుతీరి నిల్సోని వున్నారు. నన్ను అయ్యగోరు ఆ లైనులో నించోబెట్టి నిన్నట్లా ఎల్లిపో లేదు. ఎదురుగ్గా వున్న సోపాలో కూకున్నాడు. ఆరెందుకు కూకున్నారో తెలీక నాను పల్లకున్నాను. కొంచెం సేపటికి పోట్టాపీసు మడుసులు వొచ్చి సిలేమా టిక్కట్లు బుక్కింగులా డోరుతీసి మాకాడ కాయితాలు, డబ్బూ తీసుకుంటున్నారు.

"అయ్యగోరూ....మీరెల్లిపొండి, నానీ పని సిటంలో నేసుకుని ఎలిపొస్తను" అని అన్నాను.

అయ్యగోరు నవ్వి, 'డబ్బుతో పన్రా.... రెండువేల అయిదొందలు కట్టాలి' అన్నాడు.

అయ్యగోరు కూచున్న సోపాకాడ పంకా నేదు. దూరంగా వుంది. గాల్లేక అయ్యగోరు ఆపసోపాలు పడిపోతన్నారు సోపాలో. మజ్జిలో అయ్యగోరు 'ఒరేయ్ నువు లైన్లోంచి ఏడకీ ఎల్లిపోక, నానిప్పుడే కాపీ తాగొస్తా....' అంటూ బైటికెల్లారు. మల్లీ వొచ్చి సోపాలో కూకున్నారు. మా లైను సీవఁలా నడుస్తోంది."

"అంతేకాని నీకు టీనీల్లుకూడ పోయించ నేదు....అయినా నాకెందుకులే...."

"నీకాడని సెప్పేనా సెప్తుంట....నువ్వెందుకు యినాలి....ఆఁ....సివరికి నా ముందు మడిసికాడ కాయితాలు తీసుకున్నాడు బుకింగులో ఆసామి. ఆ తరవాత నానే....అప్పుడు అయ్యగోరొచ్చి, 'యిక నువ్వు యిటొచ్చి, నాను నిలబడతాన'ని సెప్పేరు. నాను హాయిగా పంకాకాడికెల్లి గుండెల్నిండా గాలి పీల్చుకున్నాను."

"మనకదే మిగులుద్ది సివరకి...." నెమ్మదిగా గునిసింది.

"అయ్యగోరు డబ్బు కట్టేసి బైటికొచ్చి 'నువు యింటికెలిపోరా....నాకు ఏరే పనుందంటూ' ఎల్లిపోనారు. నాను కాల్లీడ్చుకుంటూ బంగలాకి ఎలిపోనాను.

"ఇవాల కత యిది" అంటూ ముసుగుతన్ని పడుకున్నాడు సింహాచెలం.

* * *

"అయ్యగోరు నా పేర్న సూటరు బుక్కు-సేసేరని సెప్పానుగందా....ఏటి? గురుతుందా?" రెట్టించి అడిగాడు సంహాచెలం.

"ఇంకా ఆ కత అవనేదేటి....?" విసుగ్గా అడిగింది లచ్చి.

"కత మొదలైంది యియ్యాలేనే .... యియ్యాల ఆ ఆపీసోళ్లు ఎవురు....సూటరు బుకింగు సేసిన ఆపీసోళ్ళు సీట్లు తీస్తారంట. అందునో వొరసగొచ్చిన నెంబర్లకి సూటర్లు ఆ వొరసలోనే అమ్ముతారంట.

మరో యిసిత్రం ఏటంటే....మొట్టమొదలొచ్చిన నెంబరుకి బండి వుత్తినే యిచ్చీస్తరంట. అంటే అరదంగాలేదా? డబ్బు పుచ్చుకోరంట."

"ఏటీ మాట నమ్మమంటావా....ఆరువేలు కరీదుసేసే సూటరు వుత్తి పున్నేనికి యిచ్చిడానికి ఆడేం మన మాంగోరా? నేక అత్త కొడుకా...." ఎకతాళిగా అంది లచ్చి.

"మరి కాదేటి....లచ్చా ఏబైవేల అప్లికేసన్లనో మొట్టమొదట లెంబరు రావడం మాటేటి....?" సంబరపడిపోతూ అన్నాడు సింహాచెలం.

"అదేదో నీకే వచ్చీసినట్టు మా సంబరపడిపోతున్నావు" దెప్పి పొడిచింది లచ్చి.

"సర్లె....బేగే వణ్ణం ఎట్టు. మల్లీ బంగలాకి ఎల్లాల. అయ్యగోరు, నాను కలిసి ఆ ఆఫీసుకాడి కెల్లాల" అంటూ కాళ్ళు కడుక్కో-డానికి వెళ్ళాడు సింహాచెలం.

* * *

జనం కిటకిటలాడిపోతున్నారు. డ్రా తీసే టైము దగ్గరపడుతోంది. కలక్టరుగారు యింకా రాలేదు. వారి సమక్షంలో డ్రా తియ్యబడుతుంది.

అంతా ఆతృతగా ఎదురుచూస్తున్నారు. కలక్టరుగారి కారు రానే వచ్చింది. అప్లికేషను మీద వున్న నెంబర్లు వేరే చిన్నచిన్న కాయితాల మీద ప్రింట్ చేసి, అవన్నీ పెద్ద పెట్టెలో వేసి స్టేజిమీద పెట్టేరు.

కలక్టరుగారు నించుని చిన్న వుపన్యాసం యిచ్చారు. వాహనసౌకర్యం ఎంత అవుసరమో చెప్తూ, పరిగెడుతున్న కాలంతోపాటు మనమూ పరిగెత్తాలని, నడిస్తే లాభం లేదని, సిటీ బస్సులమీద, రిక్షాలమీద వెళ్తే పనులు జరగడం కష్టమని, పెద్ద వాహనాలు అంటే కారు లాంటివి కొని, భరించే స్తోమత ఎంతోమందికి వుండడం కష్టమని, తిండి గింజలకంటే అధికంగా పెరిగిపోతున్న పెట్రోలు ధర వలన, లీటరుకు ఎక్కువదూరం వచ్చే చిన్నచిన్న వాహనాలు అంటే స్కూటర్లు, మోపెడ్లు ఎంత అవసరమో విశదీకరించారు.

కొంతవరకూ పబ్లిక్కు గౌరవంగానే ఆయన వుపన్యాసం విన్నారు. ఇక వినే వోపిక లేక చప్పట్లు కొట్టేసారు. తను చెప్పిన మాటల్లో ఏది జనాన్ని హర్షింపజేసిందో అర్థంకాలేదు కలక్టరుగారికి.

మొత్తానికి అనుకున్న సమయానికి ఒకటి రెండు గంటల ఆలస్యంలో డ్రా మొదలైంది.

మొట్టమొదటి నంబరుకు స్కూటరు ఫ్రీగా యివ్వబడుతుందని ఆ ఆఫీసు యాజమాన్యం వారు గర్వంగా తెలియపరిచారు.

ఈ మారు జనం మళ్ళీ చప్పట్లుకొట్టేరు, ఈలలు వేసారు.

నాకే....నాకే....అంటూ గోల తరంగం జనం మధ్య లేచింది.

దూరంగా నిలుచున్న సింహాచెలం యిదంతా చోద్యం చూస్తున్నట్లు చూస్తున్నాడు.

స్టేజికి దగ్గర్లో వున్న రిజర్వుక్లాసు కుర్చీల్లో కూర్చుని వున్నారు అయ్యగారు.

మొదటి నెంబరు బైటికి తీసారు కలక్టరుగారు. ఆ నెంబరు పైకి చదివారు. జాక్‌పాట్ నెంబర్‌లా అంతా తమ చేతిలోవున్నా నెంబర్లు వెతుక్కున్నారు.

ఆ ఆఫీసు యాజమాన్యంవారు వెంటనే రిజిష్టరు తీసి ఆ నెంబరు ఎదురుగా వున్న పేరు ఎ.ఎస్. చెలం అని చదివారు.

ముందు సీట్లలో వున్న అయ్యగారు ఎగిరి

గంతేసి స్టేజిమీదకు వెళ్ళారు.

అయ్యగారి పేరు వెలం కాదే అన్న అను మానం కలిగింది సింహాచెలానికి.

అయ్యగారు కలక్టరుగారి దగ్గరకెళ్ళి, ఆ నెంబరు తన ఆసిస్టెంటుదని, అతన్ని పనిమీద తనే వూరికి పంపానని, కేరాఫ్ ఎడ్రస్సు తనదే నంటూ అవసరమైన కాయితాలు తన బ్రీఫ్‌కేసు లోంచి చూపారు.

కలక్టరుగారు అయ్యగారికి చిరునవ్వుతో షేక్‌హ్యాండ్ యిచ్చారు. ప్రముఖ దినపత్రిక ఫోటోగ్రాఫరు ఫోటో తీసాడు. ముఖ్యమైన విషయాలు నోట్ నిసుకున్నాడు ఆ దినపత్రిక విలేఖరి.

ఆ తరవాత వరసగా నెంబర్లు తీసారు. కొంత సేపటికి అయ్యగారు లేచి బైటికి వచ్చేస్తూ, రేపొచ్చి స్కూటరు తీసికెళతానని చెప్పారు.

జనంలోంచి బైటికి వచ్చిన అయ్యగార్ని కలుసుకున్నాడు సింహాచెలం.

"ఒరేయ్ .... నీ పేరుమీదే మొదటి స్కూటరు వచ్చింది....నిన్నే పంపిద్దామను కున్నాను స్టేజిమీదకు; కాని కలక్టరుగారు స్వయంగా ఆ కాయితాలు అందిస్తుంటే....వారి గౌరవానికి భంగం కలుగుతుందని..."ఇబ్బందిగా అన్నారు అయ్యగారు.

"ఎవురైతేనేటిబాబు .... సొమ్ముమీది.... మన అప్లికేసనుకే వొచ్చింది బహుమతి.... అంతేచాలు"ఆనందంగా అన్నాడు సింహాచెలం.

ఆ మర్నాడు మిగిలిన నాలుగు అప్లికేషన్ల నంబర్లు అడిగి తెలుసుకున్నారు అయ్యగారు. అవి వేలసంఖ్యదాటిపోయాయి.

అయ్యగారు కొత్తబండి తెస్తారని ఎదురు చూస్తూ నిలబడ్డాడు సింహాచలం బంగళాగేటు దగ్గర. అయ్యగారు తన పాతస్కూటరు మీదే వచ్చారు. బహుశా బండి వెనకాతల బండిలో వస్తోందేమో, కొత్తది కదా అని తనలో తానే సమాధాన పడ్డాడు సింహాచెలం.

"స్కూటరేది....?" గుమ్మంలోనే అడిగారు అమ్మగారు.

"అమ్మేసాను." అయ్యగారు లోపలికి నడుస్తూ అన్నారు.

మెట్లకింద నిలబడిపోయిన సింహాచెలానికి సరిగా అర్థంకాలేదు.

"ఎంతకి....?" అమ్మగారు అడిగారు.

"పదివేలకి...." ఈజీఛైర్లోకూర్చుంటూ ఈజీగాచెప్పారు అయ్యగారు.

"అబ్బా....!" ఆశ్చర్యం ప్రకటించారు అమ్మగారు.

"మామూలుగా అయితే బ్లాకు నాలుగువేలు. బండి ఫ్రీగా వచ్చిందికాబట్టి సాలిడ్‌గా పదివేలు లాభం...." గుండెల్నిండా గాలిపీల్చుకున్నారు అయ్యగారు.

ఆ ఆనందంలో అమ్మగారుకూడ పాలు పంచుకున్నారు.

మెట్లకింద నిలుచుండిపోయిన సింహాచెలం మాత్రం మనసులోనే అనుకున్నాడు "సొమ్మూ అయ్యగారిదే..సోకూ అయ్యగారిదే..."నని. □

వచ్చే సంచిక నుంచి

"కొత్త పుస్తకంతో కొంతసేపు"

విపుల సమీక్షల శీర్షిక చదవండి


మీ అందానికితగిన
మిల మిల మెరిసే చీరెలు!
కంచి, ధర్మవరం, బెంగుళూరు, బెనారస్, ఆరణి పట్టుచీరెలు!!
వేలకొలది రకములు
గ్యారంటీ వెండి,
జరీతో తయారైనవి
లభించును.
లక్ష్మీ జనరల్ స్టోర్స్
గవర్నరుపేట, విజయవాడ-2
గ్రామ్స్: శిష్ట్లా, ఫోన్: 73467, 77052

మరో "పులి పులి" కథ

రుద్రాభట్ల నరసింగరావు

ఇద్దరు వయస్సులో ఉన్న కుర్రవాళ్లు తమ అభ్యంతర మందిరంలో (అనగా 'ఇతరులు లోనికి రాకూ' డని వీధివైపు కొట్టుగది) కూర్చున్నారు. ఒకతను సిగరెట్లు తయారు చేసుకొంటున్నాడు. (స్త్రీలని అనుకరించడంలాగే, పల్లె ప్రజలని కొత్త పద్ధతుల్లో అనుకరించడం కూడా ఒక ఫేషన్ గదా.) ఇంకొకతను దీపావళి సంచిక చూస్తున్నాడు. వారిమధ్య బల్లమీద కాళీ అయిన రెండు టీగ్లాసులున్నాయి. వాళ్లిద్దరూ వీధివైపు కిటికీ దగ్గిర కూర్చున్నారు.

సిగరెట్ల ఉత్పత్తిదారు పేరు వేణు.

పత్రిక చదువుకుంటున్నతని పేరు రఘు.

వేణు అప్పుడప్పుడు వీధివైపు చూస్తున్నాడు

'ఆఁ వొచ్చిందిరోయి.' అన్నాడు వేణు. అని వెంటనే 'పైట జారిన పైదలి' అనికూడా వివరించేడు.

మొదటి మాటకి లక్ష్యపెట్టకపోదాం అనుకున్నరఘు రెంటో మాటకి చప్పున తలఎత్తేడు.

వేణు అన్నది నిజమేలా ఉన్నా పరకాయించి చూస్తే శుద్ధ అబద్ధం.

ఒక జవ్వని అంచులేని నీలపు పాలియష్టర్ జార్జెట్ చీరా అదేరంగు జాకెట్టూ వేసుకుంది. పైట హత్తుకునేలా వేసుకోవడంవల్లా, అంచు లేకపోవడంవల్లా కాసంత భ్రాంతీ, కొండంత దిగ్భ్రాంతీ కలిగిస్తోంది.

ఇలాటి దృశ్యాల్ని రఘు తను పుట్టినప్పటి నించి చూస్తున్నాడు. పెదవివిరిచి పత్రికలో తల దూర్చేడు.

సిగరెట్లు పూర్తయేయి. ఒకటి రఘు కిచ్చి ఒకటి తను ముట్టించుకున్నాడు వేణు.

రఘు తన సిగరెట్టుని అలాపక్కన పెట్టుకున్నాడు.రెండు పీల్పుల తర్వాత అడ్డువొస్తున్న పొగని చేత్తో తోలుతూ చూసి అన్నాడు వేణు.

'మళ్ళీ వొచ్చింది రోయి, కాస్తజారిన కామాక్షి'

విసుగుకుంటూ తలెత్తేడు రఘు.

నారింజ పండురంగు జాకెట్టూ సిగరెట్టు పేపరు లాంటి తెల్ల చీరా కట్టుకుని ఉంది. కాస్తేం, జానెడుపైగా జారిపోయి అలానిలిచినట్టుంది పైట.

'వెధవ సిగరెట్టూ నువ్వూను.' అంటూ జాగ్రత్తగా చూసేడు రఘు.

ఆ తెల్లచీరకి జానెడు పైగా నారింజ పండు రంగు అంచు ఉంది.

ఈ ఫేషనూ రఘు ఎరగని దేమీ కాదు.

అన్నీ Optical illusions! (భ్రాంతులు) సత్యమైన దొక్కటీ లేదు ఈ ప్రపంచములో- అనుకున్నవాడి మొహంతో ప్రత్యేక సంచికలో మొహం దూర్చేడు రఘు.

సిగరెట్టు అయిపోయింది వేణుకి.

'అద్భుతంరోయి' అని మాత్రం అని ఆతృతగా కుర్చీలో ముందుకి జరిగి కిటికీ లోనించి చూడసాగేడు. రఘు తలెత్తినదీ లేనిదీకూడా గమనించే స్థితిలో లేడు వేణు.

మూడోసారి వొచ్చిన ముద్దుగుమ్మకి నిజంగానే పైట జారిపోయింది. కుచ్చెళ్లు కాలిచప్పులో తగులుకుంటే తీసుకుందామని వొంగగా మీఁగడ లాంటి సిల్కుచీరేమో జారి చక్కా ఊరుకుంది. మెళ్లో ఏవో హారాలు వేలాడుతున్నాయి కూడా.

రఘు మాత్రం అదేమీ ఎరగడు. ఈసారీ వొట్టిదే అనుకున్నాడు.

ఆమె కుచ్చెళ్ళు సరిచేసుకుని పైట సర్దుకుని వెళ్లిపోయేక.

రఘుకి సంభవించిననష్టం తెలుసుకుని 'ఓరి పూల్!' అన్నాడు వేణు.

మినీ కథ

మూడు జంటల కథ



లతిక

ఆఫీసు వదిలివస్తూ, తోవలో హోటల్లో కాఫీ తాగి, రూము చేరుకున్నాడు రాజు. ఇంటిగల వారమ్మాయి పోస్టులో వచ్చిన కవరు తెచ్చి అందించింది. అతని వుత్తరాలు ఆఫీసుకే వస్తాయి. ఒక్కరి దగ్గరనుంచి మాత్రమే ఇంటి అడ్రసుకి వస్తుంది. అవి అతని ప్రియురాలు

శోభని

రాణి దగ్గరనుంచి. ఉత్తరం యిచ్చినప్పుడల్లా యిల్లు గలవారమ్మాయికి చాకలెట్లు యిస్తూంటాడు.

ఉత్తరం తీసుకుని, చింపి ఆసక్తితో చదువుకున్నాడు. రాణికి పెళ్ళి సంబంధాలు చూస్తున్నారు. రాజు నటుడు. చాలా పరిషత్తులలో ఉత్తమ నటనకి బహుమతులుపొందేడు. రాణి తల్లికి నాటకాల వాళ్ళంటే అయిష్టం. వాళ్ళ శీలం మంచిదికాదని ఆవిడ అనుమానం, నమ్మకంకూడా! అంచేత రాణి రాజును పెళ్లాడ్డం ఆమె కిష్టంలేదు.

పెద్దలు రాణికి రామారావు సంబంధం చూశారు. అతను హైదరాబాదులో వున్న వో ప్రసిద్ధ ఔషధ సంస్థలో రిప్రజెంటేటివ్. వాళ్ళ పెద్దలు రాణిని చూసి, నచ్చి, కట్నాలూ వగైరా నిర్ణయించేసుకున్నారు. రాణి ఫోటో రామారావుకి పంపించారు. బిజినెస్ గురించి వైజాగ్ వచ్చినపుడు రాణిని చూసుకుని, అతను తన అంగీకారం తెలియజెయ్యడమే తరవాయి. రాణికి అతనితో సంబంధం కుదిరినట్టే. అతను వారం రోజుల్లో వైజాగు వస్తున్నాడు. అంచేత యీలోగా రహస్యంగా ఆ సంబంధం తప్పేలా చూడడం రాజు కర్తవ్యమని రాణి రాసిన వుత్తరం సారాంశం.

రాజు తన సమస్య పరిష్కారానికి వుపాయం ఆలోచించడంకోసం స్నేహితుడు చంద్రశేఖరం దగ్గరికి బయల్దేరాడు. శేఖరం రచయిత. అతను రూములోనే వున్నాడు. రాణి రాసిన వుత్తరం గురించి చెప్పి, సలహా అడిగాడు.

"ఒక్కటే వుపాయం. ఆ రామారావుగారిని కలిసి, విషయం ఆయనకి చెప్పేసి, సాయం చెయ్యమని రిక్వెస్టు చెయ్యడమే. ఆయన కంపెనీ వివరాలు నీకు రాసిందికదా? మనూళ్లో వున్న రెండు పెద్ద మెడికల్‌షాపులవాళ్ళనీ కలిసి, ఆయన వచ్చినపుడు మనకి తెలియజెయ్యమందాం. మరొకరికి మనసిచ్చిన అమ్మాయిని, పెద్దలమాట విని చేసుకునే మనస్తత్వం అతనికి వుండకపోవచ్చనే అనుకుందాం" అంటూ శేఖరం మిత్రుణ్ణి వోదార్చాడు.


"నిజమే ననుకో! రాణి అందమైనది. అతను పెద్దలమాట వినే అపర రామచంద్రుడనుకో, అప్పుడెలా?" రాణిని రామారావు యెగిరి గంతేసి పెళ్లాడెస్తున్నాడన్నంత నిరాశతో అడిగాడు రాజు. "అప్పటి సంగతప్పుడు చూసుకుందాం. ముందు అతను వచ్చినపుడు మనకి తెలియజెయ్యమని మెడికల్ షాపులవాళ్ళకి చెప్పివద్దాం పద" మిత్రులిద్దరూ రోడ్డుపట్టారు. శని ఆదివారాలలో రామారావు విశాఖ వస్తున్నట్టు మెడికల్ షాపులలో తెలిసింది.

2

రాజు, శేఖరం శనివారం ఆఫీసుకి సెలవు పెట్టుకున్నారు. హైదరాబాదు నుంచి వచ్చి, హోటల్లో దిగి, మెడికల్ షాపులకి వచ్చే వేళల గురించి ఓ అంచనాకి వచ్చాక, ఆ టైముకి మిత్రద్వయం వొక మెడికల్ షాపులో నిరీక్షిస్తున్నారు.

వాళ్ళ అంచనా ప్రకారం రామారావు వచ్చాడు. షాపు వాళ్ళకి మందులకి సంబంధించిన లిటరేచరూ, శాంపిల్సూ యిచ్చి ఆర్డరు బుక్ చేసుకున్నాడు. మనిషి స్ఫురద్రూపి. మాటకారితనం గురించి ప్రత్యేకం చెప్పనక్కరలేని వృత్తి. అతనికి రాణి నచ్చడం మాటెలా వున్నా, రాణి అతన్ని చూస్తే, మనసు మార్చేసుకుని అతన్నే వరించేస్తుందేమో అని భయం కలిగింది రాజుకి.

రామారావు సెలవు తీసుకుని బయల్దేరబోతూండగా షాపు యజమాని మిత్రులిద్దరినీ అతనికి పరిచయం చేశాడు. రవీంద్రభారతిలో రాజు ప్రదర్శన చూసేనని చెప్పి, అతన్ని కలుసుకున్నందును సంతోషం వెల్లడించాడు రామారావు. శేఖరం కథలు తరచు పత్రికలలో చూస్తున్నానన్నాడు. ఈసారి హైదరాబాదు వచ్చేటప్పుడు తెలియజేస్తే అవసరమైన సహాయం తప్పకుండాచేస్తానని చెప్పాడు. రాజు యెక్కువగా మాట్లాడే స్థితిలో లేడు. శేఖరమే కలగజేసుకుని అడిగాడు.



"మీతో కొన్ని విషయాలు మాటాడాలి. మీకెప్పుడు వీలవుతుంది సార్?"

"ఆంజనేయుడు సూర్యుడి దగ్గర విద్యాభ్యాసం చేశాట్ట, అతనితోపాటు ఉదయాద్రినుంచి పడమటి కొండలవరకూ సంచరిస్తూ! మా వృత్తి సూర్యుడి పరిభ్రమణం లాటిది. ఈ వాళంతా వైజాగ్ చుట్టబెట్టి, ఒకటీ అరా షాపులు మిగిల్తే రేపుదయం అవికూడా సందర్శించి, మధ్యాహ్నం వొక స్వంతపని చూసుకుని సాయంత్రం స్టేషనుకి చేరాలి. ఇదీ నా ప్రోగ్రాం. మీకెప్పుడు అనుకూలంగా వుంటుందో మీరే చెప్పండి."

"మీరు హోటలుకి ఏ టైముకి చేరగలరు?"

"సుమారు తొమ్మిదనుకోండి. అంతవరకూ మిమ్మల్ని వెయిట్ చెయ్యమనడం భావ్యం కాదు. ఒక మహానటుణ్ణీ, వొక గొప్ప రచయితనీ నా రొటీను పూర్తయేవరకూ వుండమనలేను. మరో రెండు ఏజన్సీలు చూసొస్తాను. ఈవాళ మీరు నా గెస్టులు. మీ రెక్కడికి రమ్మంటే అక్కడికి వస్తాను, వో పదినిముషాలు అటూ యిటోలో! దయచేసి మరోలా అనుకోకండి."

శేఖరం వొక హోటలు పేరు చెప్పి అక్కడ కలుద్దామని చెప్పాడు. మరో రెండు గంటల్లో అక్కడికి చేరుకుంటానన్నాడు రామారావు....

హోటల్లో....

"చెప్పండి సార్!" రామారావు అడిగాడు.

"ఇది వొకరకంగా చిన్న సర్వే! అభిప్రాయ సేకరణన్నమాట. వివిధ రకాల వ్యక్తుల్ని ఈ విషయంలో కలుస్తున్నాం. మీరు నిర్మొహమాటంగా మీ అభిప్రాయాలు చెప్పాలి. మీ సమాధానాలమీద కొందరి భవిష్యత్తు ఆధారపడి వుంటుంది" శేఖరం చెపుతున్నాడు.

"రియల్లీ ఇంటరెస్టింగ్! ఇవే మా మాటల్లో చెప్పాలంటే మరో హామీకూడా చేరుస్తాం. వివరములు రహస్యంగా వుంచబడును" నవ్వుతూ చెప్పాడు రామారావు. మిత్రులిద్దరూ శ్రుతికలిపారు.

"మా సర్వేలోకూడా అది తప్పకుండా

పోటిస్తాం. ఇక అసలు విషయం. సమస్య యువతీ యువకుల పెళ్ళి. తమ అభిప్రాయాలకి విరుద్ధంగా తలిదండ్రులు మరో సంబంధం చూస్తారనుకోండి. ప్రేమించిన అమ్మాయిని నట్టేట్లో వొదిలేసి, తన దారి తను చూసుకోడం మంచిదే నంటారా? మీరైతే యేం చేస్తారు?"

"ఇక్కడ మీరొక విషయం స్పష్టంగా చెప్పలేదు. ప్రేమంటే — మనసులు యిచ్చి పుచ్చుకోడమేనా? ప్రేమ వ్యవహారంలో యింకే మైనా సాహసాలుకూడా చేశారా? అదికూడా ఆలోచించాలి. నా మట్టుకి నాకు యువతీయువ కులు వో నిర్ణయానికి వచ్చాక, పెద్దలు యిష్ట పడకపోయినా, స్వతంత్రించి పెళ్ళి చేసుకునే ధైర్యం వుండాలి. ఉన్నప్పుడే ప్రేమించడం ప్రారంభించాలి."

"మీ అభిప్రాయం బాగుంది. అలాటి పరి స్థితి మీ కెదురైతే యేం చేస్తారు?"

"కేవలం చెప్తే సరిపోతుందా? ఆచరణలో వుండాలికదా! నిజం చెప్పాలంటే నేనా పరిస్థితి లోనే వున్నాను."

రాజులో ఆసక్తి కలిగింది. రామారావు ప్రారంభించాడు. "మా వాళ్ళు యిక్కడో సంబంధం చూశారు. ఆ అమ్మాయిని నేనుచూసి నా అభిప్రాయం చెప్పాలి. అఫ్‌కోర్స్! చూడ్డం అనవసరమనకోండి."

"అదేం అలా అన్నారు?"

"ఎందుకంటే, నేను చేసుకోబోయేది పెద్దల యిష్టానికి వ్యతిరేకంగా మరో అమ్మాయిని కాబట్టి! ఆమె తలిదండ్రులకి రెండో అమ్మాయి. పెద్దామె పెళ్ళయేవరకూ మేం వెయిట్ చెయ్యాలి. అంచేత యిలా పెద్దలు చెప్పిన సంబంధాలు చూస్తూ కాలయాపన చేస్తు న్నాను. ఇక్కడి సంబంధం అలాగే లాంఛన ప్రాయంగా చూసి, నా కిప్పట్లో పెళ్ళి వుద్దేశం లేదని నాన్నగారికి రాసేస్తాను."

రాజుకి గుండె బరువు తీరింది. తేలికగా నిట్టూర్చేడు. అసలు సంగతి చెప్పడమే మంచి దని తోచింది శేఖర్‌కి. రాణీ రాజుల ప్రేమ సంగతి చెప్పి, రామారావు సహాయం కోరాడు శేఖర్.

బ్రీఫ్‌లోంచి రాణి ఫొటో తీసి చూపిస్తూ అడిగాడు రామారావు, "ఈ అమ్మాయేనా?"

"అవును"

"రేపు వాళ్ళింటికెళ్ళి, మీ సొత్తు — అదే వాళ్ళ ఫొటో వాళ్ళకిచ్చేస్తాను. శుభలేఖ పంపడం మాత్రం మరిచిపోకండేం?"

"ఎంత మాటసార్! నాకు బంధువులులేరు. ఉన్నదంతా మీలాటి ఫ్రెండ్సే. మీరే దగ్గరుండి పెళ్ళి జరిపించాలి" రాజు కృతజ్ఞతతో అన్నాడు.

"విత్ ప్లెషర్! ఓ నెల ముందే అందేలా శుభలేఖ పంపండి. దాన్నిబట్టి మ్యా టూరు ప్రోగ్రాం ఫిక్స్ చేసుకోవాలి" అంటూ ఫొటో కవరులో పెట్టి బ్రీఫ్‌లో పెట్టుకోబోతూ....


"బైదిబై! ఈమె జానకి! వ్యాసమూర్తిగారి పేరు వినేవుంటారు. హి యీజ్ వనాఫ్‌ది లీడింగ్ పబ్లిషర్స్. దేవుడు చల్లగా చూసి అన్నీ సక్రమంగా జరిగితే ఈమె నా అర్ధాంగి అవు తుంది" అంటూ మరో ఫొటో చూపించాడు.

రామారావుకి రాజు మరీ మరీ కృతజ్ఞతలు వెళ్ళడించుకున్నాడు. "నేనే మీకు థేంక్సు చెప్పుకోవాలి! అనవసరంగా వొకమ్మాయి తలి దండ్రులలో ఆశలు కలిగించి, ఆశాభంగం కలి గించే డెలికేట్ సిట్యుయేషను నుంచి తప్పిం చారు" అంటూ యిద్దరి అడ్రసులూ తీసు కున్నాడు రామారావు.

3

శేఖరం ఆఫీసులో వుండగా బోయ్ వచ్చి హైదరాబాదు నుంచి ట్రంకాల్ వచ్చిందని చెప్పాడు. తనకి హైదరాబాదునుంచి ఫోనుచేసే దెవరా అని ఆశ్చర్యపడుతూ వెళ్ళి, రిసీవర్ అందుకున్నాడు శేఖరం.

"హలో శేఖరంగారూ! నేను రామారావుని! మీరూ రాజుగారూ యింటర్వ్యూ చేశారు, నమస్తే! మీతో అవసరంపడింది.... ఈ మధ్య పత్రికల వాళ్ళు పోటీల్లో కొత్త పద్ధతులు అవలంబిస్తున్నారు కదా! అదే, రీ నంబరింగ్



యిచ్చి పరీక్షపేపర్లు దిద్దే పద్ధతి! .... మీరు విక్రాంతి మంత్లీ కథలపోటీకి యేఁవేనా పంపించారా? మరేంలేదు — బీయస్సీలో నా బెస్టు ఫ్రెండొకాయన, వనాఫ్ ది జడ్జెస్! కథల సెలక్షను కమిటీలో ఆయనకి మరికొందరు తెలిసిన వాళ్ళున్నారు. మీ కథపేరు చెప్తే....వద్దంటారా ....టాలెంటొక్కటే చాలదు మహాశయా! మీ స్టేండర్డుమీద మీకా ఆత్మవిశ్వాసం వుండడం మంచిదే! ప్రయత్నంకూడా చేస్తే తప్పులేదు కదా? ప్లీజ్! మనకో అవకాశం అందుబాటులో వున్నపుడు వినియోగించుకోవడంలో తప్పేఁ వుంది? కథపేరు చెప్పండి! ఓకే!....ఇక అసలు సంగతికి వస్తాను. రాజుగారి ప్రేమాయణంలో నే నడ్డొచ్చినట్టే, మా మామగారి దృష్టిలో మీరున్నారు. పెద్దామెకి పెళ్ళి సెటిలయింది. ఒకప్పుడు రాజుగారి అవస్థే నాకు కలిగింది. ఆది వారం యేకాదశినాడు వ్యాసమూర్తిగారు, జానకిని మీ కిస్తామని చెప్పడానికి వైజాగ్ వస్తున్నారు. మీరు నాకు లైన్ క్లియరివ్వాలి. ఈ వారం హెడ్‌క్వార్టర్సులోనే వుండాల్సి వచ్చింది. లేకపోతే వచ్చి పెర్సనల్‌గా రిక్వెష్టు చేసేవాణ్ణి! మా పెళ్ళి జరిపించే బాధ్యత మీది.. ప్రామిసేకదా....థేంక్యూ....వుంటాను మరి. సెలవు" ఫోను పెట్టేశాడు రామారావు.

శేఖరానికి లోగడ తనూ రాజూ పడిన అవస్థ గుర్తొచ్చింది. రాజు విషయంలో రామారావు సాయపడ్డాడు. అతని విషయంలో తను సాయపడబోతున్నాడు. మరొకరికి సహాయం చెయ్యడంలో వున్న తృప్తి, ఆనందం అనుభవానికి వచ్చేవేళ అతనికో అనుమానం కలిగింది. కొంపదీసి తన విషయంలోకూడా యెవరినేనా సహాయం కోరాల్సి వస్తుందా!

ఆఫీసు వదిలి, రూము చేరుకుని, తలుపు తెరిచేసరికి రెండు కవర్లు కనబడ్డాయి. కొత్తగా పత్రిక ప్రారంభిస్తూ, తననో కథ పంపమని రాసిన ఆహ్వానం వొకటి. రెండోది పార్వతి రాసినది.

శేఖరం రచనా వ్యాసంగం ప్రారంభించి

పదేళ్ళయితే, సుమారు రెండేళ్ళుగా పార్వతి అతని అభిమాన పాఠకురాలిగా పరిచయమైంది. విజయవాడ హనుమంతరాయ గ్రంథాలయంలో రచయితల మహాసభకి డెలిగేట్‌గా వెళ్ళినప్పుడు ఆమె శేఖరాన్ని కలుసుకుంది. అతని రచనల గురించి, సెంటిమెంట్ల గురించి, ఆశయాలూ అభిరుచుల గురించి, యింకా బోలెడు విషయాల గురించి యిద్దరూ చర్చించుకున్నారు. చాలా విషయాల్లో యిద్దరిదీ వొకే అభిప్రాయం.

అప్పటినుంచి ఆమె వుత్తరాలలో రచనల గురించేకాక, శేఖరం గురించికూడా ఆసక్తి వెల్లడించేది. అది ప్రేమగా రూపొందింది. ఆమె తండ్రి సూరిబాబుగారు ప్రఖ్యాత రంగస్థల నటుడు, ప్రయోక్త! ఆయనకి రాజు నచ్చేడు. పార్వతిని రాజుకిచ్చి పెళ్ళి చెయ్యాలని ఆయన సంకల్పం. ఆదివారం ఏకాదశి నాడు ఆయన పెళ్ళిచూపులకి రాజుని ఆహ్వానించడానికి వైజాగ్ వస్తారు. తనని దక్కించుకునే భారం శేఖరానిదేనని పార్వతి వుత్తరం సారాంశం.

శేఖరానికి థ్రిల్లింగ్‌గా అనిపించింది. కథలలో అసహజంగా కనిపించే సంఘటనలు జీవితాలలో చోటు చేసుకోడం చిత్రంగానే వుంటుంది. అతనికి రామారావు ఫోను సంభాషణ గుర్తొచ్చింది. ఎంత లౌక్యం ప్రదర్శించేడు? తనకో వుపకారం చేస్తున్నట్టు చెప్పి, ముందు కాళ్ళకి బంధంవేసి, అసలు విషయం వెల్లడించాడు. వాళ్ళ ప్రేమాయణంలో అడ్డు నిలవకండా వుండడానికి ప్రతిఫలం, తన కథకి బహుమతి!

ఇతరులకోసం చేసే ప్రతి పనిలో యిచ్చి పుచ్చుకోడాలు విధిగా వుండాలా? తనిప్పుడు రాజుని కలవాలి. పార్వతి విషయంలో అతనెలాగూ ప్రతిబంధకంకాదు. అతను రాణి కోసం పరితపిస్తున్నాడు కనక! శేఖరం రాజు కోసం బయల్దేరాడు. రూమునుంచి రిహార్సలుకి బయలుదేరుతున్నాడతను. శేఖరాన్ని చూడగానే వెనక్కి వచ్చాడు. ఇద్దరూ రూములో కూచున్నారు.

"ఊరక రారు మహాత్ములు! నువ్వు రూము వదిలి వచ్చేవంటే యివాళ వర్షం పడాల్సిందే! ఏఁవిటి విశేషం?"

"విశేషం కాదు, విశేషాలు?"

"చిత్తం! సెలవియ్యండి" నాటకీయంగా అన్నాడు రాజు.

"మిత్రోత్తమా! భవదీయ వైవాహిక కార్యకలాపము విరహవిలాపముగా మారనున్న విషఘడియలలో, ఆపద్బాంధవుని వలె అభయమొసంగెనే...."

"రామారాయడు కదా, అతనినెట్లు మరువగలాడను?"

"తత్సజ్జనుండు...."

"బాబోయ్! మరి గ్రాంథికం వద్దు"

"అలా రా దార్లోకి! రామారావు ట్రంకాల్ చేశాడు!"

"మళ్ళీ యేం పీకలమీదికి తెచ్చాడు?"

"నీకాదు, అతనికే నీ అవస్థ కలిగింది."

"అతనికోసం మనం యెవరి దగ్గరికేనా రాయబారం వెళ్ళాలా?"

"అవసరం లేదులే! జానకిని నా కిద్దామనుకుంటున్నారట! గురుగారూ, మీరు మాటసాయం చెయ్యాలని అడిగాడు. అదొక విశేషం!"

"వరం యిచ్చేశావా?"

"కనీసం, నీకోసమైనా తప్పదుకదా!"

"రచయిత వనిపించుకున్నావ్! నీ పార్వతిగారికోసమని చెప్పక, నాకేదో వుపకారంవైనట్టు మాటాడతావేం?"

"పార్వతి కోసమన్నది మనలో మాట. బయటికి కనిపించేది, అతను నీకు సాయపడ్డాడు నీకోసం అతనికి నేను సాయపడతాను"

"రెండో విశేషం?"

"ఏబీ—బీసీ—సీయే"

"మహాప్రభో! నాకు అంకగణితమే సరిగా రాదు. బీజగణితంవేం తెలిసేడుస్తుంది?"

"నేను చెప్తానుకదా! ఏ నువ్వు—బి రామారావు—సి నేను"

"అంతవరకూ ఫరవాలేదు"

"బీ యేకి సాయపడ్డాడు. సి అంటే నేను బీకి సాయపడ్డాను. ఈ త్రిభుజంలో మిగిలిం దెవరు?"

"నాకు అతను, అతనికి నువ్వు—నీకు? నే నన్నమాట! సాల్వ్ చేసేశాను!"

"చెయ్యదింకా,చెయ్యాలి.అందుకే వచ్చాను. పార్వతి ఫాదరు సూరిబాబుగారు ఆదివారం యిక్కడికి వస్తారుట, నీకోసం! అదీ విశేషం!"

"అంటే, నేనిప్పుడు నీకు లైన్‌క్లియర్ యివ్వాలన్నమాట. మా నాటకానికో పాతిక టిక్కెట్లు అమ్మిపెట్టు గురూ!"

"పాతిక టిక్కట్లమ్మాలా, నా చిట్టి తండ్రే! పాతిక పైసలు కవరు రామారావు తండ్రికి రాసి పడేస్తాను"

"బాబ్బాబు? బాంచెను, కాల్మొక్తా!"

"అలా రా దార్లోకి!"

"దార్లోకి రావద్దని చెప్పడానికే కదోయ్ నువ్వొచ్చింది? రచయితలు కూడా అచ్చు తప్పులు...."

"నా దారి కడ్డురాకు, సరేనా?"

"ముమ్మాటికీ సరే! అది సరేగాని, మన సెలక్షన్లు మాత్రమే అయేయి. వీటికి పెద్దల ఆమోద ముద్ర కావాలికదా! వాళ్ళని మన దారికి తేవడమెలా?"

"చెప్తాను! మీ మాంవగారిక్కడే వున్నారు కదా?"

"ఆహా,సలక్షణంగా అత్తగారూ సమేతులై"

"నాకోసం వ్యాసమూర్తిగారూ, నీకోసం సూరిబాబుగారూ యిక్కడికి వస్తారు."

"వస్తారు, మన దుంపతెంచడానికి"

"నువ్వు నోరు మూసుకుంటావా కాసేపు" చికాగ్గా అన్నాడు శేఖరం.

"నువ్వు స్వగతం మాటాడుకుంటున్నావని నాకేం తెలుసు? స్వగతం బేక్ కర్టెను వేపు తిరిగి చెప్పాలి .... కళ్ళెర్రజెయ్యకు.... మాటాడనులే....ఎంచక్కా నవ్వేవురా? అలా సమస్యలు నగుమోముతో పరిష్కరిం చాలి. ఇద్దరు కన్యాదాతలు యిక్కడికి వస్తారు. మనంవేం చెయ్యాలిప్పుడు?"

"రామారావుని రమ్మని టెలిగ్రాం ఇస్తాం."

"చేతులు కట్టుకుని వాల్తాడు. తరవాత...."

"తరవాత కథ వెండితెరమీద చూడండి"

4

రాజు తన నాటక బృందాన్ని వెంటబెట్టుకుని స్టేషనుకి వెళ్ళి బెజవాడనుంచి వచ్చే సూరిబాబు గార్ని రిసీవ్ చేసుకున్నాడు. పాదాభివందనం చేశాడు. రాజుకి తనపట్ల గల భక్తి భావానికి పరవశించాడాయన. వ్యక్తికంటె వ్యక్తిత్వం గొప్పది. ఆ వ్యక్తిత్వం పూజింపబడితే వ్యక్తి పరమానంద భరితుడౌతాడు!

"మీకు గుర్తుందో లేదోగానీ, తొలిసారి నాచే స్త్రీపాత్ర ధరింపజేశారు. మీ శిక్షణలో నాట కంలో తొలిసారి వేషం కట్టేను. ఆ నాటి మీ ఆశీస్సులవల్ల యింతవాణ్నయి యీనాడు పరి షత్తులలో గుర్తింపబడ్డాను. నా నాటక కళకి రాజమార్గం చూపించినట్టే, నాకూ నా మిత్రు లకి జీవితరంగంలోకూడా మీరు చేయూత నివ్వాలి. మీ అమూల్య ఆశీస్సులతో మా బ్రతు కులు తీర్చి దిద్దాలి." అంటూ చెప్పవలసిన విషయాలకి బీజం వేసేడు.

రామారావు, వ్యాసమూర్తీ కూడా అదే ట్రెయినులో దిగారు. రామారావు వ్యాస మూర్తిని రాజుకి పరిచయం చేశాడు. శేఖరం తరపున రాజు ఆయన్ని ఆహ్వానించాడు. సూరిబాబు, వ్యాసమూర్తీ, రాజూ రామారావూ టాక్సీలో శేఖరం రూముకి వచ్చారు.

ప్రయాణ బడలిక తీర్చుకున్నాక సంప్ర దింపులు ప్రారంభమయేయి. శేఖరం పెద్దలిద్ద రికీ సంబంధాలలో సర్దుబాట్ల గురించి వివరిం చాడు. పెద్దల సహకారం అర్థించాడు. రామా రావూ రాజూ అతన్ని సమర్థించారు.

సూరిబాబూ వ్యాసమూర్తీ ఏకాంతంగా కొంచెంసేపు చర్చించుకున్నాక మిత్రత్రయం నిర్ణయాన్ని ఆమోదించారు. రాజు తరపున రాణి తలిదండ్రులతో సంప్రదించి వాళ్ళని అంగీకరింపజేసే బాధ్యత సూరిబాబు వహిం చారు.

వ్యాసమూర్తి పెద్ద కూతురు పెళ్ళిలో మూడు జంటలకీ నిశ్చయ తాంబూలాలు పుచ్చు కుందికి నిర్ణయం జరిగింది; తమ తల్లిదండ్రులని అంగీకరింపజేసే బాధ్యత పెళ్ళికొడుకులదే నన్న షరతుమీద!! □



["Forgive us, O Lord, we acknowledge ourselves of the common man,

Of the men and women, who shut the door and sit by the fire."

"Small folk who live among small things" T S. Elliot.]

* * *

"లేస్తారా, టైమ్ ఆరయ్యింది"

My god, అప్పుడే ఆరయ్యిందా!!

బ్రష్‌మీద పేస్ట్ వేసుకుని బాత్రూమ్‌కి....

పరుగు....పరుగు....పరుగు.

అప్పుడే పేస్టయిపోయిందే! కొని ఎన్ని రోజులయిందో? ఈసారి బాక్సుమీద డేట్ వెయ్యాలి.

"రాజీ, ఓ గ్లాస్తో వేణ్నీళ్ళివ్వు."

FREE!!

ఉచితం!!!

మరణం కొరకు సిద్ధబాటు

1972 వ సంవత్సరం సెప్టెంబర్ 24 వ తారీకు హైదరాబాద్ ప్రజలకు మరపురాని రోజు. హిమయత్ సాగర్ కట్టలు తెగి పోయిందని, నీళ్ళు పట్టణంలోకి వస్తున్నాయని, ఎవరో పుట్టించిన పుకార్లు విని పెద్దలు, పిన్నలు, పండితులు, పామరలు, నిరుపేదలు, ధనవంతులు అందరూ ప్రాణాన్ని దక్కించు కొనుటకు ఎత్తయిన ప్రదేశాలు వెదుక్కుంటూ పరుగులు తీసారు. యువకులు నడువలేని వృద్ధులను వీపు మీద ఎక్కించుకొని పరుగెత్తారు.

నౌబత్ పహాడ్, యూనివర్శిటీ బిల్డింగ్స్ అంతా మనుష్యులతో క్రిక్కిరిసి పోయింది. కొంతమంది గర్భిణీ స్త్రీలు భయపడి అకాలములో ప్రసవించారు. కొంత మంది గుండె ఆగి మరణించారు. ఏనాడో ఒకనాడు ప్రతి వ్యక్తినీ దర్శించే మృత్యువుకు అందకుండా పారిపోయి ఎక్కడైనా సురక్షిత ప్రదేశంలో తలదాచుకుందామని ప్రతివ్యక్తి ఎంతగా ప్రయత్నించినా మరణం ఆసన్నమైనప్పుడు దానిని తప్పించుకోవటం అసాధ్యం.

ఈ లోకం ఆరంభమయినప్పటి నుండీ మానవులకు కష్టాలు, కరువులు, వ్యాధులు, బాధలు, యుద్ధాలు వస్తున్నాయి. కాని ఆఖరి రోజులలో రాబోయే కష్టాలు వీటిలో దేనికి సాటిరావు. ఇటువంటి కష్టాలను తప్పించుకొని మానవు లెక్కడికి పారిపోగలరు? ఈ కష్టాలవల్ల మరణించిన తరువాత మీ నివాసం ఎక్కడ? దాని కోసం సిద్ధపడుతున్నారా? హృదయములో మార్పులేక పాపక్రియలతో మరణించిన వారంతా నిరంతరం మండే అగ్నిగుండంలో త్రోయబడతారని బైబిలు హెచ్చరిస్తుంది. మరణం మీకు సంభవిస్తే దానినెదుర్కొనుటకు సిద్ధంగా ఉన్నారా?

చదలవాడ చంద్రమతీదేవి

ఉచితం !!

కరుణామయుడు, దైవస్వరూపుడు అయిన యేసుక్రీస్తు జీవిత చరిత్ర, ఆయన కమనీయ బోధలు తెలిపే అందమైన 300 పేజీల పుస్తకం ఉచితంగా పొందదలచుకుంటే ఈ రోజే మీ చిరునామా మాకు వ్రాయండి. పోస్టు ఖర్చులు మేమే భరించి మీకు ఉచితంగా పంపుతాము.


ఉచితం !!

ఇదీ అడ్రస్ :

ఆల్ఫా ఒమేగా
పోస్టు బాక్సు 42
హైదరాబాద్ - 500 004

A.M.G.

GOSPEL MESSAGE INSERTED BY A. M. G.



షేవింగ్ సోప్‌కూడా ఐపోవచ్చింది. బహుశా రెండూ ఒకేసారి కొని వుంటాం. వెధవ బ్లేళ్ళు సరిగా తెగిచావవు.

"కాఫీ ఇప్పుడిచ్చెయ్యమంటారా — బాత్ చేసిం తర్వాత తాగుతారా?"

"కాఫీ ఇటిచ్చి, బాత్రూమ్‌లో నీళ్ళు పెట్టు."

కాఫీలో పంచదార తక్కువ. అంటే అసలు ఇంట్లోనే నిండుకుని వుండాలి. లేకపోతే రాజీ నాకెప్పుడూ సుగర్ తక్కువెయ్యదు.

"రాజీ, సుగర్...."

"లేదండీ, ఐపోయింది"

మొదలు!

లేదు....లేదు....లేదు.

బాత్రూమ్ గుమ్మం ఎప్పుడూ మాడు పగిలేలా తగుల్తూనే వుంటుంది. నీళ్ళెప్పుడూ గోరువెచ్చనకంటే ఎక్కువ వెచ్చగా వుండవు.

"రాజీ... సోప్...."

"లేదండీ, ఐపోయింది"

లేదు....లేదు....లేదు.

"ఇవాళ తారీకెంత రాజీ"

"ఇరవై రెండనుకుంటాను, చూస్తానుండండి. ఇవాళ సోమవారంకదూ? ఇరవై ఒకటి"

(పేస్ట్ లేదు, పంచదార లేదు, సోప్ లేదు.

ఇక ఇంట్లో బియ్యంకూరలు పప్పులూ వున్నాయా? అడగడం అనవసరం. అన్నీ ఒకె సారి క్లైమాక్స్‌కి వచ్చాయే?

అవునంతే, అతనంతే!

ఇంటర్‌వెల్‌లోనే క్లయిమాక్స్‌కి వచ్చిన సినిమా అతని బ్రతుకు)

"టిఫిన్ బావుంది. కొంచం చట్నీ వెయ్యి రాజీ"

"అన్నట్టు చెప్పడం మర్చిపోయానండీ, డాక్టరుగారబ్బాయి చెప్పాడు — ఫాక్టరీనించి ఫోనొచ్చిందిట—మిషనేదో ట్రబులిచ్చిందిట. వెంటనే రమ్మని"

టైమ్....అప్పుడే 7—45!

టిఫిన్‌బాక్స్ తీసుకుని పరుగులాంటి నడకతో సిటీ బస్టాండువైపు కదిలాడు.

("మధ్యాహ్నం అంచికి వస్తారా? పోనీ సాయంత్రమైనా, తొందరగా వస్తారా?" ఆమె వెయ్యని ప్రశ్న.

"ఏమో, ఎట్లా చెప్పగల్ను. ట్రై చేస్తాను"

అతను ఇయ్యని జవాబు.

అవును, అతనుమాత్రం ఎట్లా చెప్పగల్డు— అతని చేతిలో లేంది.)

* * *

పరుగు....పరుగు....పరుగు.

ఏడూ ఏభైకో బస్సుంది. అది దాటితే మళ్ళీ ఎనిమిదీ ఐదుక్కానీ లేదు. ఎప్పుడూ అనుకుంటూ వుంటాడుతను—ఓ సైకిల్ కొనుక్కోవాలని. ఇంటిలో సరుకులే నెలకు తగ్గట్టు కొనలేనివాడు సైకిలేం కొనుక్కోగల్డు?

ఫాక్టరీ!

"సారిసర్, కొంచం లేటయ్యింది."

"ప్రతీరోజూ లేట్‌గావస్తే ఎలాగ రామారావ్! ఇంకోసారి యిలా జరిగితే ప్రొడక్షన్ సూపరింటెండెంట్‌కి రిపోర్టు చెయ్యాల్సి వస్తుంది' ప్రొడక్షన్ ఇంచార్జ్.

"ఇంకెప్పుడూ యిలా జరగదు సర్."

"సర్లే, ముందా మిషన్ సంగజ్జూడు."

"ఓకేసర్. అన్నట్టు మనింట్లో వాటర్ మోటరు సరిగ్గా పన్చేస్తోందా సార్?"

"మనమంతా బానిసలం,
గానుగలం పీనుగులం!
మనదీ ఒక బ్రదుకేనా?
కుక్కలవలె నక్కలవలె!
మనదీ ఒక బ్రదుకేనా
సందాలలో పందాలవలె!"

* * *

అక్కణ్ణించి టైము పందెం గుఱ్ఱంలా పరిగెడుతుంది. మిషనరీ ట్రబుల్స్, ఎలక్ట్రికల్ ట్రబుల్స్, ఫాక్టరీ పర్చేజెస్.

తన వర్కింగ్ అవర్స్ పేరుకి మాత్రం ఉదయం ఎనిమిదినుంచి సాయంత్రం ఆరు వరకూ. మధ్యాహ్నం 12 గం॥నుంచి రెండు వరకూ లంచ్‌టైము. కానీ ఎప్పుడూ లంచ్‌కి యింటికి వెళ్ళడానికి టైముండదు. రోజూ రాత్రి ఏడూ, ఎనిమిదీ ఐపోతుంది. ఒక్కోరోజు రాత్రి పదీ, పదిన్నరకూడా ఔతుంది. విసుగ్గా వుంటుంది. పనిచేసి చేసి వచ్చిన శరీరానికి కొంచం ఆహారం పడగానే వెంటనే నిద్ర ముంచుకొచ్చేస్తుంది.

మళ్ళీ ప్రొద్దున్నే

"ఏవండీ, ఆరయింది. లేస్తారా?"

మామూలే!

ఎన్నాళ్ళిలా?

"బ్రదుకు వృధా చదువు వృధా!
లేదు సుఖం లేదు సుఖం
లేదు సుఖం జగత్తులో,
లేదు సుఖం లేదు రసం
చేదు విషం జీవఫలం."

* * *

(మామూలు రోజుల్లో అట్లా సాగిపోయే అతని జీవితం ఆదివారాల్లోకూడా ఏమీ తేడా వుండదు. ఆదివారంకూడా పని వున్నరోజుల్లో ఐతే,ఆ రోజూ మామూలు రోజు లాగానే సాగుతుంది. వర్కలేని ఆదివారాలు అతను ఉదయం పదిగంటలవరకూ లేవడు. తర్వాత మధ్యాహ్నం భోంచేసి మళ్ళీ పడుకుంటాడు. సాయంత్రం లేచిన్తర్వాత, బతికున్న రోజుల్లో (అంటే అతని భాషలో, నెల మొదటి రెండు ఆదివారాలు) ఐతే యిద్దరూ ఏదైనా హోటల్లో భోజనంచేసి, ఏదో ఒక సినిమాకి కుమ్ముకుంటూ, తొక్కుకుంటూ వెళ్తారు. సినిమాలో ఏక్టర్ ఏడిస్తే ఏడుస్తారు; నవ్విస్తే నవ్వుతారు. చివరికి ఏడుస్తూ యింటికి చేరుకుంటారు. తెల్లారిన తర్వాత మళ్ళీ రొటీన్‌లో పడిపోతారు.

పదోసారి చూసే సినిమాలా, అతని జీవితం అతనికే విసుగు కలిగించడంలో ఆశ్చర్యమేముంది?)

* * *

ఆ రోజు:

"లేస్తారా, ఆరయింది"

పేస్ట్....షేవింగ్ సోప్....బాత్ సోప్.

లేవు! ఐపోయాయి!

"ఇవాళ తారీకెంత రాజీ"

"ఖర్మ, మీకేదీ గుర్తుండదు. ఇవాళ ఫస్టండీ బాబూ"

అవునుకదూ! ఈ రోజైనా కాస్త ఎర్లీగా



వెళ్ళాలి. నిన్ననే ఇన్‌స్టాల్ చేసిన కొత్త మిషన్ స్మూత్‌గా రన్ ఔతోందో లేదో!

* * *

"గుడ్ మార్నింగ్ సర్''

కొత్తమిషన్ చెక్ చేశాను. ఎవరిథింగ్ ఈజ్ ఓకె. ఫాక్టరీకి కావల్సిన లిక్విజిషన్స్ రాయిస్తున్నాను.

ఫోన్ మోగింది.

"రామారావ్, నీకు...."

ఆఫీసునుంచి! ఎకౌంటెంట్ రావుగారు.

"అలాగే సార్....వస్తున్నా సార్''

ఈ రోజు కాషియర్ శెలవుట; అకౌంట్స్ క్లర్కూ, టైపిస్టూకూడా శెలవు పెట్టేరుట. ఇవాళ పే డే?

బాంకునించి డబ్బు డ్రా చెయ్యాలి. ఆయన స్టేట్‌మెంట్స్ ప్రిపేర్ చేస్తున్నారుట. నేను బాంక్‌కి వెళ్ళి డబ్బు డ్రా చేసుకురావాలి. పన్లో పని ఫాక్టరీ పర్చేజెస్ కూడా అప్పుడే చేసేస్తే సరి.

నా జీతం నాలుగువందలు. పి.ఎఫ్; ఇ.ఎస్.ఐ మొదలైన కటింగ్స్‌పోను మామూలుగా మూడు వందల యాభై చేతికొస్తుంది.

క్రితంనెల ఇరవై మూడవ తేదీని తీసుకున్న ఎడ్వాన్స్ వందాపోను, ఈ రోజు తన చేతికొచ్చేవి రెండువందల యాభై. ఏం బతుకు తనది! ఛీ!

"రామారావ్, ఇప్పుడు ఫాక్టరీ పర్చేజెస్ అవీ ఏమీ పెట్టుకోకు. వెళ్ళేటప్పుడు ఎట్లా వెళ్ళినా వచ్చేటప్పుడు మాత్రం ఆటోలో రా. కాష్ జాగ్రత్త!''

తను అప్పుడప్పుడు బాంక్‌నించి కాష్ తేవాల్సివచ్చినా, వెళ్ళినప్పుడల్లా అకౌంటెంట్ గారు చెప్పే జాగ్రత్తలు వినక తప్పదు. ఇప్పుడూ ఆయన హితబోధ విని కాష్‌బాగూ, ఏభై వేలకి పి. ఎన్. బి. చెక్కూ తీసుకుని బయల్దేరాను.

రిక్షాలో బాంకుకి వెళ్తున్నానే కానీ, ఆలోచనలు మాత్రం నన్ను వెంటాడడం మానలేదు. మనసులో బాలన్స్ షీటు వేస్తున్నాను.

జనరల్‌స్టోర్స్‌వాడికి ఇవ్వాల్సింది రూ. 150

ఎలక్ట్రిసిటీ బిల్లు, ధోబీ, మిగిలిన చిల్లర ఖాతాలు రూ. 100

ఫాక్టరీ దగ్గర కాఫీహోటల్‌కి రూ. 70

అంటే డెభ్భై రూపాయలు లోటన్నమాట.

అన్నట్టు అసలు పద్దే మర్చిపోయాడతను.

ఇంటద్దె క్రితంనెల బాకీ యాభై, ఈ నేల వందా మొత్తం నూటయాభై యివ్వందే ఇంటాయన దగ్గర పరువు దక్కదు.

ఆదాయం రూ. 250

వ్యయం రూ. 450

రెండువందల ఇరపై రూపాయల డెఫిసిట్?

ఎక్కణ్నించి తెస్తాడు తను?

ఐ టి ఐలో చదివేటప్పుడు ఎన్ని కలలు కనేవాడు! మొదట ఎలక్ట్రికల్‌లో సర్టిఫికెట్ తీసుకున్నాడు. తర్వాత 'మెకానికల్' కూడా చేస్తే వర్క్‌షాప్ పెట్టుకోవచ్చని నాన్నే దాంట్లో చేర్పించాడు. సెకండ్ ఇయర్‌లో వుండగానే నాన్న పోయాడు. ఇంక అది పూర్తి చెయ్యడం పడలేదు. పొట్ట చేత్తో పట్టుకుని తెలిసిన వాళ్ళందరి దగ్గరిక తిరిగాడు తను, ఉద్యోగానికి. ఆఖరికి నాన్న దూరపు బంధువు ఒకాయన వాళ్ళమ్మాయినిచ్చి పెళ్ళిచేసి, యీ వుద్యోగం ఇప్పించాడు. ఆ తర్వాత సంవత్సరానికి ఆయనా పోయాడు.

ఇప్పుడు తనూ, రాజీ. ఇద్దరే.

ఒంటికాయ సొంటికొమ్ము!

అప్పుడప్పుడు అన్పిస్తూ వుంటుంది—పెళ్ళి ఎందుకు చేసుకున్నానా అని. నేను బాధపడ్డమే కాకుండా రాజీని కూడా బాధపెడ్తున్నాను.

తనని కట్టుకుని ఏం సుఖపడింది రాజీ?

"పంజాబ్బేంకు వచ్చింది బాబుగారూ!"

రిక్షావాడి మాటల్తో ఈ లోకాని కొచ్చాను.

* * *

ఎర్లీగా వెళ్ళడంతో తొందరగానే చెక్ కాష్ చేసుకుని ఇవతలికి వచ్చాను. కనిపించిన ఆటోలో కూర్చుని "ఆటో నగర్ పోనీ" అన్నాను.

ఆటో బందరు రోడ్లో నెమ్మదిగా పోతోంది.

అరె! తను ఆఫీసుకి కదూ పోవాల్సింది!

"ఆటో నగర్ కాదు, సూర్యారావు పేట పోనీ బాబూ."

ఆటో డ్రైవర్‌తో చెప్పాను. అతను నాకేసి అదోలా చూసి ఆటోని సర్రున వెనక్కి తిప్పాడు. ఆ తిప్పడంలో నా వళ్లోవున్న కాష్ బాగ్ కాళ్ళదగ్గర పడింది.

అందులో డబ్బు-యాభై వేలు-వుంది!

సడెన్‌గా కళ్ళు తిరిగాయి నాకు.

"ఆపు!" అరిచాను. జేబులో వున్న ఒకే ఒక ఐదురూపాయల నోటూ అతనికిచ్చి పక్కనున్న హోటల్‌కి దారితీశాను.

* * *

అవును? తన సమస్యలన్నింటికీ అదే పరిష్కారం? పాపం, పుణ్యం—అంతా క్రాప్. ఈ యాభై వేలుతో తను చక్కటి భవిష్యత్తుకి పునాది వేసుకోవాలి.

అంతా జాగ్రత్తగా ప్లాన్ చేసుకోవాలి. ముందు ఆఫీసుకి, బాంక్‌లో రష్‌గా వున్నట్టూ ఓ రెండుగంటలు లేటవుతుందనీ ఫోన్ చెయ్యాలి. తర్వాత.... ఆఁ, తర్వాత వెంటనే తనిక్కణ్ణించి యింటికి వెళ్ళిపోవాలి.... అహఁ కాదు. పక్కింటి డాక్టరుగారికి ఫోన్‌చేసి రాజీని రెడీగా వుండమని చెప్పాలి. వెంటనే రైల్వే స్టేషనుకి....నో, ట్రైన్లో వెళ్ళకూడదు.... టాక్సీ....యస్, టాక్సీలో హైదరాబాదు.... అహఁ కాదు, మద్రాసు వెళ్ళిపోవాలి. అక్కణ్నించి-తనకి మైసూర్‌లో రెలెటివ్స్ వున్నారు. మైసూర్ వెళ్తే? వద్దు, చుట్టాలింటికి వెళ్ళకూడదు. బెంగుళూరులో తన క్లాస్‌మేట్ మూర్తి వర్క్‌షాప్ పెట్టుకున్నట్లు రాశాడు. బెంగుళూరు వెళ్ళాలి. అక్కడే తను కూడా ఓ వర్క్‌షాపు పెట్టుకుంటే సరి. ఎట్లాగైనా నెలకో వెయ్యిరూపాయలు సంపాయించొచ్చు. అప్పుడు ఓ స్కూటర్ కొనుక్కుంటే సరి తనూ రాజీ యెంతో హాయిగా కాలం గడపచ్చు.


పిచ్చిరాజీ! తనని ఒక్కసారి కూడా హైక్లాస్ టిక్కెట్టుకి సినిమాకి తీసికెళ్ళలేకపోయాడు! ఏ.సీ. హోటల్లో మీల్స్ పెట్టించలేకపోయాడు.

బెంగుళూరులో హాయిగా....

"సార్, టీ."

సర్వర్ గొంతువిని అంతెత్తున ఉలిక్కిపడ్డాను. రెండుగుక్కల్లో టీ తాగి జేబులోవున్న చిల్లరడబ్బుతో బిల్లు చెల్లించి బైటపడ్డాను.

ఫోన్లు రెండూచేసి, కనిపించిన '28' ఎక్కాను. ఇంజను పక్కగావున్న ఫ్రంట్‌సీట్ ఖాళీగా ఉండడంతో కూర్చోక తప్పింది కాదు. కానీ తెలిసిన వాళ్ళెవరికంటా పడకూడదు. ఎట్లా? చప్పున కాలేజీ స్టాప్ వస్తే బావుండును.



తన ఇల్లు ఎస్. ఆర్. ఆర్. కాలేజీ ప్రక్క సందులో!

○ ○ ○

"అంతా బస్సు దిగండి ప్లీజ్."

బస్సుచుట్టూ ఓ రెండు మూడువందల మంది కాలేజీ స్టూడెంట్స్ గోలగోలగా స్లోగన్స్ షౌట్ చేస్తున్నారు. బస్సుని తగలబెట్ట డాని కనుకుంటాను. అందర్నీ దిగమంటు న్నారు. స్టూడెన్స్ బస్సుచుట్టూ వుండడంతో, బస్సులో వాళ్ళెవరూ భయంతో దిగటంలేదు.

ఈలోగా రాళ్ళవర్షం ప్రారంభం అయ్యింది. మొదటిరాయి నా నుదిటిమీద తగిలింది. తర్వాత వరుసగా భుజాలమీద, గుండెల మీద, వీపు మీదా రాళ్ళు తగుల్తున్నాయి. బస్సులో జనాన్ని తోసుకు దిగుదామని ఎంత ప్రయత్నించినా కుదరటం లేదు. నుదిటిమీద నుంచి ఒంటిమీద నుంచి రక్తం కారుతోంది. కళ్ళు తిరుగు తున్నాయి. ఫుట్‌బోర్డు మీదనుంచి కాలు కింద పెట్టి రోడ్డుమీద బోర్లా పడిపోయాను.

"సిటీ బస్సులు-జాతీయం చెయ్యాలి."

స్లోగన్లు విన్పిస్తున్నాయి. ఈలోగా నన్నెవరో పక్కకి లాగేశారు. బస్సుమీద పెట్రోలు పోసి నిప్పుపెట్టడానికి ట్రై చేస్తున్నట్లున్నారు. అంతలో మూడుపోలీసు వాన్లు అక్కడికి వచ్చాయి. దాంతో స్టూడెంట్సందరూ చెల్లాచెదరై పోయారు.

నాకు కళ్ళు తిరుగుతున్నాయి. మసకలు కమ్ముతున్నాయి. రక్తం ధారలుగా కారుతోంది.

స్పృహ తప్పేట్టు వుంది.

నో! నేను ఫెయింట్ కాకూడదు. అంత సీరియస్ స్థితిలో కూడా కాష్ బాగ్‌ని గట్టిగా కరచి పట్టుకున్నాను.

"ఇతని కెవరికో దెబ్బలు బాగా తగిలి నట్లున్నాయి. సార్! రక్తం బాగా కారి పోతోంది. వెంటనే హాస్పిటల్...."

ఆ తర్వాత మాటలు నాకు విన్పించలేదు.

నాకు స్పృహ వచ్చేసరికి హాస్పిటల్ బెడ్ మీదున్నాను.

కాన్షస్‌లో కొచ్చాక నేను చేసిన మొదటి పని-కాష్ బాగ్ జాగ్రత్తగా వుందో లేదో చూసుకోవడం. నేను తడిమేది దేనికోసమో గ్రహించిన డాక్టరుగారు,

"నీ కాష్‌బాగ్ సురక్షితంగా వుంది బాబూ! యూ ఆర్ లక్కీ. దానిమీదున్న మీ ఆఫీసు ఫోన్ నెంబర్‌కీ, మీ పక్కింటి డాక్టరుగారి ఫోన్ నెంబర్‌కీ రింగ్ చేశాము. మీ అకౌంటెంట్ గారూ, మీ మిసెస్ వస్తూ వుంటారీపాటికి.

Now you are perfectly al right, young man. take rest." అని వెళ్ళిపోయారు.

అవును — **Now I am perfectly alright.**

రాజీ, నాకిప్పుడెంతో సంతోషంగా వుంది; మరెంతో సంతృప్తిగా వుంది.

అనువు రాజీ—**I am the happiest fellow at this moment!** □



మద్యపానము సమాజానికి శాపము


మద్యపానముతో ఆరోగ్యము పాడవుతుంది. కుటుంబాలు చితికిపోతాయి.

ఎన్నో కుటుంబాలను
పాడు చేసినది త్రాగుడేగానీ
మరొకటికాదు.

వినోదం కోసం లేదా
జతకోసం
మద్యం త్రాగితే
వలలో పడినట్టే.

మద్యపానం వ్యసనంగా మారుతుంది.
మీ శక్తిసామర్థ్యాలను హరిస్తుంది.
కాలేయాన్ని తినివేస్తుంది.
గుండెను బలహీనపరుస్తుంది.
రక్తాన్ని విషపూరితం చేస్తుంది

మద్యపానానికి బానిసకాకముందే ఆ అలవాటును తప్పించండి



davp 79/221

ఇదే మీకు హెచ్చరిక

సుబ్బయ్య మనవరాలు

పి. రామలక్ష్మి

బారెడుపొద్దు. మూరెడు బాట. పొలాలగట్లు, ముళ్ళ తీగలు. చిన్నచిన్న నీలంపూల మొక్కలు. మొక్కల మీదనుంచి ప్రయాణిస్తూన్న చిరు గాలులు. చలిస్తూన్న ఆకులు, తెల్లతెల్ల మేఘాలు. మేఘాలనందుకుంటూ కొండలు. ఆ కొండలు ఎర్రటివి. ఆ దారి ఎర్రటి మట్టిబాట. సూర్యుడు ఎర్రగా చూస్తున్నాడు బాటకేసి. జంక్షన్‌లో నిలబడి సుదూరంలో కన్పిస్తున్న వూరివంక చూస్తున్నారా జంట. అందంగా వున్న జంటవైపు చూస్తోన్నారు చీలిన దారులవెంట వెళ్తున్న మనుషులు.

ఆ యువతి చెక్కిళ్ళు ఎండకు వాడిన తెల్ల గులాబీల్లా వున్నాయి. రేగిన కురులు ఎండాకాలపు మేఘాల్లా వున్నాయి. ఆమె కట్టుకున్న చీర నలిగిన ఎర్ర కలువపువ్వును గుర్తుకు తెస్తుంది.

ఆ అబ్బాయి వుంగరాల జుట్టు గాలితో ఆడుకుంటూంది. కళ్ళు ఎండవేడికి ఎర్రబడుతున్నాయి. బట్టలు హుందాగా వుండికూడా.... అక్కడక్కడ బస్ చేసిన మరకలతోవున్నాయి.

రావిచెట్టు మొదట్లో కొత్త సూట్‌కేసు ఎండకు మెరుస్తోంది. పేరు తెలియని ఎర్ర పూలచెట్లు రోడ్డు పొడవునా వెలిగించిన దివిటీల్లా నిలుచుని వున్నాయి.

ఒక పెద్దమనిషి వారిద్దర్నీ చూస్తూనే ఆగాడు....నాజూకైన మనుషులు ఎవరికోసం ఎదురుచూస్తోన్నారో కనుక్కోవాలని కాబోలు.

ఆ కలవారి కుర్రాడు రెండుమూడు అడుగులు ముందుకు వచ్చాడు పెద్దమనిషి దెసగా.

"ఏమండీ! అదిగో....ఆ కనిపించే కొండల దగ్గరి వూరుపేరు ఏమిటో కాస్త చెప్పగలరా?" అడిగాడు అర్థింపుగా చూస్తూ.

ఆయన కొంచం వింతగా చూస్తూ "అక్కడ మీకెవరైనా చుట్టాలున్నారా? లేక భూములేమైనా వున్నాయా బాబూ?" అనడిగాడు, అబ్బాయి ప్రశ్నార్థకంగా అమ్మాయి వైపు చూసాడు.

"ఏం అలా అడిగారు?" అంది మాటల్లోనే వారిద్దరి దగ్గరకు చేరిన అమ్మాయి. ఆమె చెవులకున్న ముత్యపు కమ్మలు కళ్ళల్లోని మంచితనంతో పోటీపడుతున్నాయి.

"ఏం లేదు....ఆ వూరు కొండలకు దగ్గరగా వుంటంచేత బస్తీకి అటునుంచి ఒక దారి వుండటంచేత ఆ వూరిని అందరూ కొండదారి అని పిలుస్తారు. ఇంతా చేసి వూళ్లో వంద లోగిళ్ళు వుంటాయేమో—అవైనా కాయకష్టం చేసుకునేవాళ్ళు....కొండల్లో కాయకసురు తెచ్చి అమ్ముకునేవాళ్ళ గుడిసెలు .... మట్టిమిద్దెలు. అంచేత అడిగాను మీకెవరైనా తెలిసినవాళ్లున్నారేమో ననీ....'' ఆయన ప్రశ్నకు జవాబు అన్నట్లుగా తలవూపి .... "అక్కడికే వెళ్లాలండీ మేము" అంది అమ్మాయి.

"వెళ్దామా యిక?...."అన్నాడు అబ్బాయి.

పెద్దమనిషి తాను వెళ్ళబోయే వూరిపేరు చెప్పి ముందుకు సాగిపోయాడు చేతిలో గొడుగును తిప్పుకుంటూ.

అబ్బాయి అమ్మాయికేసి చూసి చిరునవ్వు

నవ్వాడు. "మీ చుట్టాలున్న వూరు బస్తీకి దగ్గరే కాబోలు."

"అయినా వేరుగా ఎంత అందంగా కనబడు తోందో చూడండి" అంది ఆమె.

"దూరపు కొండలు నునుపు అన్నారు."

"దగ్గరికొచ్చినా-గరుకుగానే వున్నా మనం పుట్టిన భూమిమీద వున్నాయని వాటి మధ్యగా తిరగాలని వుంటుంది నాకు..." ఆమె కళ్ళల్లో ఉత్సాహం ఎక్కువవుతోంది.

"ఊరు దగ్గర పడిందమ్మడూ! నీవాళ్ళు ఎలా ఆదరిస్తారో అని దడగా వుంది నాకు—" అన్నాడు హాస్యంగా అతను.

ర ర ర

కొండదారి వూరు సమీపించారు ఇద్దరూ. ఎత్తు అరుగుల పెంకుటిళ్లు నాలుగయిదువుంటే, మిద్దెయిళ్లు మూడో నాలుగో వున్నాయి. మిగతా వన్నీ గుడిసెలే. వూరుమధ్యగా ఏదో దేవుడి మందిరం వుంది. బాగా చిన్నదిగా వున్న గుడి. ఆ గుడిచుట్టూ అరుగులు విశాలంగా పరుచుకుని వున్నాయి.

ఆవులను, మేకలమందను కొండమీదకు తోలుకుపోతున్నవాళ్ళూ, కాయగూరలు అమ్ముకొనేందుకు బస్తీవైపు బయలుదేరినవాళ్లు ఆ దారి వెంట వస్తోన్న కొత్త వ్యక్తుల్ని విచిత్రంగా చూడసాగారు.

అబ్బాయి భుజాలు ఎగరవేసి నవ్వుకుంటూ మధ్య మధ్య అమ్మాయి కళ్ళల్లో భావాల్ని వెదికేందుకు ప్రయత్నిస్తున్నాడు.

మామూలుగా అయితే ఎవరిదారిని వాళ్ళు వెళ్ళిపోయేవాళ్ళే కాని, ఆ కొత్తజంట వూరు మధ్యగా ఆగడం ఎవరికోసమో - దేనిగురించో వాకబు చేస్తూండడం గమనించి ముక్కుమీద వేలువేసుకుని ఒక్కొక్కరూ వారి చుట్టూ చేరుతున్నారు.

ఆడవాళ్ళు పనులు మానుకున్నారు. పిల్లలు ఆటలు మానుకున్నారు. నిరాటంకంగా నిర్మోహమాటంగా నడివీధిలోకొచ్చేశారు విశేషమేమిటో తెలుసుకునేటందుకు.

వాళ్ళ అబ్బురాన్ని గమనిస్తూ ఆ అబ్బాయి ముందుకు నడిచి—వయస్సులో పెద్దవాడుగా కన్పిస్తున్న ఒక వ్యక్తిని అడిగేడు: "ఏమండీ! ఇక్కడెక్కడైనా చిన్న ఇల్లు అద్దెకు దొరుకుతుందా?...."

ఆ మనిషి మరింత ముందుకొచ్చి అబ్బాయి ముఖంలోకి ముఖంపెడ్తూ "నీ పేరేంటయ్యా!.. వూళ్ళో మీ సుట్టాలు లేరా?...." అని తిరిగి ప్రశ్నించాడు.

"లేరండీ....కాని ఎప్పుడో వుండేవాళ్ళు.." అని నసిగాడు అమ్మాయివంక కొంచెం కోపంగా చూస్తూ.

ఆ అమ్మాయి నవ్వుకుంది.

"అయితే వెంకయ్యగారని పెద్ద డబ్బున్నాయనోరు బస్తీలో వుండేవోరు. మనూర్లో ఆరి కోయిల్లుండేది. అడపాదడపా వొచ్చేవోళ్లు లెండి. ఆరికి మీరేవన్న సుట్టాలా?...." అడిగాడా పెద్దమనిషి.

"కాము...." అన్నాడు అబ్బాయి విసిగిపోతూ.

"తఁవరిపేరో?...."

"రాజశేఖరం...." అన్నాడు మీసం మెలివేయడ మొకటే తక్కువన్నట్టు అమ్మాయి వంక గొప్పగా చూస్తూ. "అయితే తఁవరు బ్రేమ్మర్లా" అన్నాడాయన ఏదో తప్పుచేస్తున్నట్టు చూస్తూ.

"కాదు. రాజులం...." అన్నాడు.

మధ్యలో అందుకుంటూ "మనం రాజులమా?...." అందా అమ్మాయి చిరుకోపంతో. "రాజుల్లాంటివాళ్ళం."

"మా వాళ్ళు పల్లెటూరివాళ్ళని మాటిమాటికి ఎగతాళి చెయ్యకండి" అంది అతనికి మాత్రమే వినిపించేట్టు.

"అయితే బాబూ! మీరు నాయుడోరా? ఈ వూల్లో కొన్నాళ్లుండేవోరు ఒక దొరబాబుగోరు. ఆరి కొడుకు మిలిట్రీలో సేరిపోయిండని ఇరక్తి మీద ఎటో ఎల్లిపోయినాడు." మరో వ్యక్తి జోక్యం చేసుకుని అడగవచ్చాడు.

"కాదండీ. మేం సేనాపతులం. రాజులకి దగ్గరివాళ్ళం. మీకు బోధపడాలని అలా చెప్పా"

అన్నాడు రాజా.

ఇక లాభం లేదనుకుని ముందుకు వచ్చింది ఆ అమ్మాయి. "నా పేరు సీత. మే విద్దరం భార్యాభర్తలం. మా ముత్తాతగారు ఈ వూళ్లో వుండేవారు. ఆయనకి నేనో మునిమనవరాల్ని. అంచేత ఈ వూళ్లో కొన్నాళ్ళు గడపాలనే ఉద్దేశంతో వచ్చాను మా వారితో కూడా కలసి...." అని అన్నది.

సీత నోట్లో మాట వుండగానే "గురుతొచ్చిందమ్మ! గురుతొచ్చింది ..." ఓ మనిషి చెప్పడం మొదలుపెట్టేడు.

"సుబ్బయ్యగారని ఒక మగానుభావుడు మన పొరుగూరు రామాపురంలోనే వుండేవోరంటమ్మా. ఆనకీ వూరంట ఒక పెద్ద యిల్లు వున్నది. దగ్గిరే పొలాలు వుండేయి. ఆ రోజులల్ల సదువుకునోన్నరు తక్కువగద. అయినా ఒక్కతే కూతురని బస్తీలో వుంచి బసలోపెట్టి సదివిస్తాందు. ఇంతలోపు ఆయమ్మ ఎవుర్నో పెల్లాడిందని టెలిగ్రాఫ్ వొచ్చిందండమ్మ. అంతే కులపోడు కాదో యేంటో — అయ్యా అమ్మా బెంగెట్టుకున్నారు. ఆ స్తిపాస్తుల్ని అనుభవించే రాత వుండాలగదయ్యా, కూతుర్ని రావద్దంటూ సెప్పేసినా —ఆళ్ళు సాన్నాళ్ళు బతకలేకపోనారు. దిగుళ్ళతోనే సచ్చారుబాబూ. వయసు నిండకముందే ముసలి ఎద్దుల్లా కుంగిపోనారు...."

రాజశేఖరం, సీతలతో పాటుగా చుట్టూ వున్నవాళ్ళుకూడా కొత్తగా వింటున్నట్టు శ్రద్ధగా నిలుచున్నారు.

"ఈ ఎండలో ఏంటయ్యా! ఆ మందిరంలో కూకోమను బాబుగోర్ని..."అన్నాడు గుంపులో ఒకడు. "సరి! సరి!" అని అందరూ మందిరం నీడలోకి వెళ్ళారు. అరుగులమీద కూర్చున్నారు కొందరు.



"ఇంతకూ ఆరుపోనాక ఆ స్తిపాస్తుల్ని బిందుగులట్టుకుపోనారు...కూతురు మాత్తరంవు తండ్రి ఆస్తి వొద్దన్నాదని సెప్పుకుంటా వుండారు. కానీ ఇప్పుడా కూతురుకి కూతురులు మల్లా వున్నారని సెప్పుకుంటా వుండారు. ఏది నిజవో కాదో మాకు తెలిసిందికాదు ....ఈ యమ్మమరి?" ఆ రైతులాంటి పెద్దమనిషి మాటకు అడ్డువస్తూ "మీరు చెప్పిన సుబ్బయ్యగారు ఈవిడకి ముత్తాతగారు అవునో కాదోగానీ — ఈమెకుకూడా అటువంటి తాత గారే ఒకరుండేవారు గతంలో...." అన్నాడు రాజశేఖరం.

సీత నవ్వుకుంది. వూరందరూ సంతోషించారు.

అంతలో ఒక ఆడమనిషి విచారంగా మారిన ముఖ కవళికలతో చెప్పసాగింది "సుబ్బయ్య బాబుగోరి పేరుమీద ఒక యిల్లు మాత్తరంవు ఈ వూల్లో వుండిపోనాది బాబూ! నాలుగ్గదుల సావిడి. మా ఆడోల్లం తీరినప్పుడంత సుబ్బరంగా సిమ్మ్మతాం. సున్నంవేత్తాము........ కాని అందంట మా వుండగలంవా బాబూ! పక్కూర్లా పెసిడెంటోరు ఈడ్నే పిల్లకాయలకి బడి ఎడతా నంటాండు. ఉప్పుడికి మాత్తరం తాళంవెట్టి బద్దరంగుంది...."

"మీరు అందులో వుంటే పసందుగా వుంటాది బాబూ! మా ఆడది అదే అంటాంది" అన్నాడు మొదటిమనిషి.

రాజశేఖరం ఆశ్చర్యపడ్డాడు. "మేము ఈ వూళ్ళో ఒక నెలగానీ, నెల పదిహేనురోజులు గానీ గడుపుదామని వచ్చాము. నన్నూ, మీ సుబ్బయ్య మనవరాలైన ఈ సీతనీ ఈరోజు మీరు ఆదరించినట్టే ఇకముందుకూడా ఆదరిస్తే మా కదే పదివేలు" అన్నాడు చేతులు జోడించి అందరికీ నమస్కరిస్తూ.

అందరూ పొలోమని లేచారు. ఇల్లు బాగు చేస్తామంటూ ఆడాళ్ళు ఒకరిద్దరు హడావిడిగా వెళ్ళారు. కాఫీగాని పంచదార నీళ్ళుగానీ తేవడానికి కొందరు ఆయత్తమైతే, ఆగంతుకులకు ఆతిధ్యమెలా నెరపాలని తబ్బిబ్బుపడ్డారు మరి కొంతమంది. ఆ కొండదారి గ్రామవాసులకు అట్టే శ్రమ కలిగించడం యిష్టంలేని సీత.... తమ యిల్లు చూపితే చాలు స్వయంపాకం తనే చేసుకుంటుందని తెలియజేసింది వారికి. అంతా కొత్త ఉత్సాహం వెల్లివిరిసింది ఆ చిన్న గ్రామంలో.ఎందరెందరో అవసరార్థం సుబ్బయ్యగారింటిలో దిగి కొన్నాళ్ళు గడిపివెళ్ళేవాళ్ళు. వాళ్ళెవ్వరూ తీసుకురాని అందం సీత తెచ్చిందని ఊరంతా ఒక్కుమ్మడిగా అనుకున్నారు.

* * *

సుబ్బయ్యగారిల్లుకావడానికి పెంకుటిల్లయినా లోపలివి మట్టిగదులు. పేడతో అలికి ముగ్గులు పెట్టిన యింటిలో తడి ఆరని గదుల్లో దుప్పట్లు ఎలా పరుచుకోడమా అని రాజా ఆలోచిస్తూంటే ఒకరు నులకమంచం మరొకరు రెండు పొడవైన చాపలు పట్టుకుని వచ్చారు. "మజ్జిగ తాగండి బాబూ! మా వూర్లంట ఇదే దొరుకుద్ది. కాఫీలకంటె పక్కూరికైన పోవాల. లేదంటే బస్తీకైనా ఎల్లాల" అన్నాడొక కుర్రాడు తళ తళలాడే గాజుగ్లాసుల్లో మజ్జిగ నింపి అందిస్తూ.

సీత రాజావంక అర్థవంతంగా"చూశారా?.... అన్నట్టు చూసింది.

రాజా చేతికి గ్లాసులు అందిస్తూ పక్కకు తిరిగి అరుగుమీదనుండి వుమ్మేడు ఆ కుర్రాడు. రాజా కళ్ళు చిట్లించుకున్నాడు. సీత గతుక్కుమని—అంతలో చిన్నగా నవ్వింది.

ఆ అబ్బాయి, మిగతావాళ్ళు వెళ్లాక "మన లాంటివాళ్ళకోసం అన్నీ శుభ్రంగా వుంచాలని అనుకుంటారు వీళ్ళు, కానీ మనం వేటిని అసహ్యించుకుంటామో వీళ్ళు బొత్తిగా వూహించలేరు. మనం నోరువిప్పి చెబితేగాని అర్థంకాదు. మన చిన్నచిన్న అసహ్యాలు వీళ్ళసలు కేర్ చేయరు" అంది సీత.

"అంతలా వెనకేసుకు రాకు....అప్పుడే బోర్ కొడుతోంది నాకు" అన్నాడు రాజా ఆవలిస్తూ.

ఆ రోజు ఏదో అన్నం చారు మాత్రం వండుకుని వెంటతెచ్చుకున్న పచ్చడితో భోజనం ముగించారు భార్యాభర్తలు.

ప్రొద్దున్న ఆరు గంటలకు లేచిన రాజా

బ్రష్షు తీసుకుని వీధి అరుగుమీదకు వచ్చేసరికి కళ్లాపిజల్లిన వాకిట్లో ముత్యాలముగ్గులు కళకళ లాడుతూ కళ్యాణ గీతం పాడుతున్నాయి.

అక్కడ దంతధావనం చెయ్యలేక పెరటి కేసి నడిచాడు. ఒక కుర్రాణ్ణి తోడు తీసుకుని బస్తీకి వెళ్లాడు. కాయగూరలు వంటసామగ్రి తీసుకుని వచ్చేసరికి సీత వంటచెరకు సమ కూర్చుకుంది.

"కట్టెలుకొట్టి తెచ్చేశావా అప్పుడే?" అనడి గాడు రాజా ఆశ్చర్యం నటిస్తూ.

"ముందా సంచుల్లోవి కింద దిమ్మరించితే రాజా వారికేం ఆదరువులు కావాలో తెలుసు కుంటాను." అంది సీత పొయ్యిముందు పీట వేసుక్కూర్చుని.

* * *

సీత, రాజాలు ఆ వూరొచ్చి పదిరోజులు సునాయాసంగా గడిచిపోయాయి. ఆ పల్లెటూరి ప్రజల ఆదరణలోనే వాళ్ళ అన్ని అవసరాలు గడిచిపోతుండేవి. డబ్బుతీసి యివ్వడం తరువాయిగా ఆఘమేఘాలమీద అన్నీ యింటిలో అమిరిపోయేవి.

ఆ రోజు వెన్నెలరోజు. పనులన్నీ అయిన తర్వాత ఆరు బయట ఎత్తు అరుగుమీద ఇద్దరూ కూచున్నారు.

వేసవికాలం అయినా చంద్రుడు ఆకాశాన్ని చలువ పందిరిగాను, భూమిని నదీతీరంగానూ మార్చేశాడు. ఎదురుగా వున్న గుడిసె ముందు ఉత్సాహంగా మేదరిపని జరుగుతోంది. వెన్నెల వెలుగులో కూర్చుని ఈకాలమీద బుట్టలు తడికీలు అల్లి పడేస్తున్న వాళ్ళ హస్తనైపుణ్యాన్ని వేడుకగా చూస్తున్నారు.

చేతికి మాత్రమే పని కాకుండా నోటికి కూడా అవిరామంగా పని కల్పిస్తున్నారు. వాళ్ళ గందరగోళపు భాషలో ప్రపంచ విషయాలన్నీ

పరిభ్రమిస్తున్నాయి.

చూస్తూ వింటూ నవ్వుకుంటున్నారు. ఓ పన్నెండేళ్ళ అమ్మాయి పరుగు పరుగున అక్కడికి వచ్చి వాలింది. "మల్లెదండమ్మా!" అంది పొడవాటి దండను సీత కిస్తూ.

"చిట్టీ! ఎక్కడివే నీకు మల్లెపూలు?" విస్తుపోతూ అడిగింది.

"మా యమ్మ మీ కిచ్చి రమ్మందమ్మా!" ఆ పిల్ల వొంటిమీద చీరముక్క చుట్టుకొని వుంది. "మరి నువ్వు పెట్టుకోవూ?" అడిగింది సీత ఆ పిల్ల పూలు కట్టిన పిలక జడకేసి చూస్తూ.

"ఎట్టుకుంటానమ్మా! గాని మాయమ్మ అన్నిపూలు ఇయాల మీ కిచ్చీమన్నాది."

"అన్నీ అయితే ఎట్టుకోనని చెప్పు. ఇంద" చిన్నముక్క పంటికొనతో తుంపి చిట్టికిచ్చి మిగిలినది తన సిగచుట్టూ పెట్టుకుంది. చిట్టి గెంతుకుంటూ పరిగెట్టింది.

రోజులు అలా క్షణాల్లా ఆహ్లాదంగా గడుస్తున్నాయి సీతకు. రాజా కూడా మొదటిలా విసుగుదల చూపటంలేదు.

* * *

ఉదయం కోడి మూడింటికే అలారం కొడుతోంది. మరో రెండు గంటలాగి కాకులు ఉషోదయ గీతికలు ఆలపించసాగాయి. ఆ కంఠాలు అంత సుఖంగా లేకనేమో జనం మేలుకుంటున్నారు. సీత రాజాలకు ఏడింటికిగాని తెల్లారదు.

ఎందుకో ఆరుకే మెలుకువ వచ్చి లేచాడు. అతని కళ్ళు అప్రయత్నంగా పెరటి తలుపు కేసి చూసి నిశ్చలంగా నిలబడిపోయినయి. గుండె జారింది. పక్కన మంచి నిద్రలోవుంది సీత. తలుపు ఎవరు తీసివుంటారు?

రాజా గబుక్కున లేచి పెట్టెలుంచిన రూములోకి వెళ్ళాడు. గది బోసిగా వుంది. పెట్టెల్లేవు. అందులోనే కదా మరి క్యాష్ వున్నది.

రాజాకు అంత చల్లని ఉదయంలో కూడా కంగారుతో కోపంతో వొంటినిండా చెమట్లు పోసేయి.

దొంగలమీది కోపమంతా సీతమీదకు మళ్ళింది. ఆ కోపంలో ఎప్పుడూ అలా లేపని వాడు ఆదమరచి నిద్రపోతున్న సీతను లేపి కూర్చోబెట్టి జరిగినదంతా కళ్ళారా చూడమన్నాడు.

"ఏవిటేవిటి?" అంటూ కంగారుగా కూర్చుంది. అంతా చూశాక సీతకి నోరు పెగల్లేదు. అతని కళ్ళల్లోకి సూటిగా చూడలేకపోయింది. మంగళసూత్రం మెడలో బంగారు గొలుసు క్షేమంగా వున్నందుకు సంతోషించింది.

"ఆఖరుకు బుద్ది పోనిచ్చుకున్నారు కాదు" అన్నాడు రాజా పళ్ళు నూరుతూ. కోపాన్ని యింకా యెలా వెళ్ళగక్కాలో తెలీలేదు.

సీత ఏమనకుండా తల వంచుకుని వొకవైపే చూస్తూ ఆలోచిస్తూంది. రాజా అదంతా తనతప్పే అన్నట్టు పిచ్చివాడిలా యేదో అంటాడని తెలుసు. అందుకని తను నోరు మెదపకుండా వూరుకుంది. ఇప్పుడెలా? అనే ప్రశ్న మస్తిష్కంలో మెదులుతూంది ముఖ్యంగా.

సుబ్బయ్యగారింట్లో దొంగలు పడ్డారు అనే వార్త చిచ్చులా రేగింది వూళ్ళో. జనమంతా ఇంటిముందుకు జాతరలా చేరారు.


"ఈ పూరంచె ఎవుడు చేసుంటే రేతిరికంత ఆడి సేతులు పడిపోతయ్" అని దీవించారు గుంపులో కొందరు.

"మనూళ్ళో ఎవుడికే దమ్ములు ఈపాడు పనికి. ఇదంతా ఆ కొండోల్ల పనే...." అని చెయ్యెత్తి కొండలమీదకు చూపించాడు ఒకడు.

"అవునవును." సుమారుగా అందరూ ఒక అభిప్రాయాని కొచ్చారు.

"దొంగచచ్చినోళ్ల వుసురుపోసుకుండారు." తిట్లు గాలిలోకి తేలిపోయాయి. వూళ్ళో అడుగు పెట్టిన నాడు మొదటగా పరిచయమైన భీమయ్య ముందుకొచ్చి ఒకేమాట ఖండితంగా చెప్పాడు:

"బాబుగోరు మనూల్లో నెలదినాలుంటానికి వొచ్చుండారు. జరిగిపోనాది దొంగతనం. ఇక నుంచి మనఁవే ఆర్ని సూసుకోవాలి. అంతే పదండి."



బిలబిల మంటూ వెళ్ళిపోయారు.

కాస్సేపటిలో కచ్చెపుల్లలు నుండి కాఫీ పొడుంవరకు అన్నీ అమిరాయి. ఇంట్లో కొన్ని వస్తువులు వున్నాయని సీత చెప్పినా ఎవరూ విన్పించుకునే ధోరణిలో లేరు. రామన్న అనే అతను వాళ్ళ స్వంతపంట అని చెప్పి బస్తా బియ్యం యింట్లోపడేసి వెళ్ళాడు.

వండేందుకు బియ్యం చాటలోకి వొంపు కున్న సీతకళ్ళు చారెడయ్యాయి.

మల్లెపూవుల్లా వున్న బాగుచేసిన సన్న బియ్యం అవి. వెదికి చూచినా ఒకరాయి కన్పించలేదు.

"మేం పండించుకున్నవి ఇయ్యేనమ్మా. ఇయ్యాల వంగ తెంపినం రేపు దొండకాయలు, పొట్లబీరకాయలు తెచ్చి యిస్తానమ్మగోరూ" అంటూ తెల్లగా పొడుగ్గావుండి తలపాగా చుట్టుకున్న ఓ మనిషి తెచ్చియిచ్చాడు సంచితో కాయగూరలు.

మామూలుగా నీళ్ళు తోడిపోయడానికి వచ్చిన మనిషి—"నేను డబ్బుకాక్కాదమ్మ-నీళ్ళు పోసేది. మా సుబ్బయ్యగారి మనవరాలిగోరికి డబ్బుల్తీసుకుంటనా?" అని చెప్పింది.

సీత వాళ్ళ అవ్యాజానురాగాన్ని చూసి నోరు మెదపలేకపోతోంది. కృతజ్ఞత ఎలా చెప్పుకోవాలో తెలియడంలేదు.

బస్తీ హోటలు నుంచి కావల్సినవి అడగక పోయినా కుర్రాళ్ళు తెచ్చిపెడుతున్నారు. బొటా బొటిగా సంపాదించుకునేవాళ్ళు ఇంత తెగించి ఎలా ఖర్చుపెడుతున్నారు అని ఆశ్చర్యపడటం రాజా వంతు అయింది.

అప్పుడప్పుడు రాజా కొండలమీదకి కుర్రవాళ్ళతో కలిసి షికారు వెళ్తుంటాడు. ఒక రోజు సీత, రాజా కొండమీదకు జంటగా బయలుదేరారు.

ఒక చెట్టుకింద కూర్చుంటూ "చూశావా?-మా వాళ్ళు ఎంత మంచివాళ్లో?" అంది. ఆమె పక్కనే కూచున్నాడు రాజా. "వీళ్ళకు లోపల ఏమైనా ఆశలున్నాయేమో....?" అన్నాడు.

"ఇక వీళ్ళను కష్టపెట్టడం బావుండదు. రెండురోజులుండి వెళ్ళిపోదాం" అంది సీత సాలోచనగా.

"నిజంగా చెప్తున్నా-నేననుకున్నంత బోర్‌గా లేదిక్కడ."

సీత చూపులో గెలుపు మెరిసింది.

"మరి వెళ్ళేందుకు డబ్బో?....."

"నా వుంగరం ఎవరి దగ్గరన్నా తాకట్టు

పెడతాను? లేదా వీరి దగ్గర డబ్బు తీసుకుని వెళ్ళాక తిప్పి పంపేద్దాము-మనకోసం నీళ్ళు ఖర్చుచేసిన డబ్బుతోసహా" అంది సీత.

ఒక నిర్ణయాని కొచ్చారు.

ఇంటికి వచ్చిన తరువాత కర్రలపొయ్యి వెలిగించే పనిలో పడింది. రాజా అరుగుమీద స్తంభానికానుకుని సిగరెట్టు కాలుస్తూ వీధి దృశ్యాలు చూడసాగాడు. పిల్లలు గోళీకాయ లాడుకుంటున్నారు. దొంగాట పేరుతో-పరుగులు తీస్తున్నారు. ఆడాళ్ళు వంటసన్నాహాల్లో వున్నారనేందుకు నిదర్శనంగా గుడిసెల మీదుగా సన్నసన్న పొగలు లేస్తున్నాయి. ఊరి బావి దగ్గర ఇంటికోసం ఆడవాళ్ళు నీళ్ళు మోస్తున్నారు. కొందరు మగాళ్ళు నూతిపక్కగావున్న నాపరాళ్ళమీద నిలబడి బాల్చీలతో నీళ్ళు ఒంటి మీదకు దిమ్మరించుకుంటున్నారు. ఆడపిల్లలు అరుగుమీద నిలబడి కట్టె దువ్వెనలతో పేలు నొక్కుకుంటున్నారు.

ఇంకా స్పేపటికి మునిమాపు అవుతుంది. చీకట్లు బాగా ముసురుకుంటాయి. దూరంగా వున్న కొండలమీద ఎర్రని మంటలు అక్కడక్కడ కనిపించి చీకటి వెలుగుల గూర్చి మనుషులకి ఆలోచింపజేస్తాయి. చీకటి మూగిన కొండలమీద ఎర్ర ఎర్రని మంటల్ని చూడటం కోసం రాజా అలా నిలబడుతూ వుంటాడు.

పరధ్యానంగా నిలబడిన రాజా మెల్లెక్కి వచ్చి నిశ్శబ్దంగా పక్కన నిల్చున్న శాల్తీని చూడలేదు. చివరికి ఆ వ్యక్తి అతని భుజం మీద వొక్క చరుపు చరిచేసరికి తుళ్ళిపడి ఇహంలోకి వచ్చాడు.

"ఒరేః శర్మాః నువ్వెప్పుడొచ్చావోయ్...." రాజా ఆశ్చర్యపోయి అడిగాడు.

"ముందు నీ సంగతి చెప్పవోయ్....కొత్త పెళ్ళికొడుకువి వదినగార్ని విడిచి యిక్కడ అజ్ఞాతవాసం చేస్తున్నావేంటిః—"

"లక్ష్మణుడిలా నువ్వొచ్చావు కాబట్టి ఇది అజ్ఞాతవాసం కాదోయ్ ఇక— మీ వదినతో కలుపుకుంటే వనవాసమే యిది. ఒక్కటే తేడా—ఈ వనవాసానికి కారకులు కైకగాని మంథరగాని కాదు. మీ వదినగారి ప్రోద్బలం" అన్నాడు రాజా హాస్యధోరణిలో.

"బలె బలె" అంటూ నివ్వెరపోయాడు శర్మ. రాజా కాలేజి జీవితంలో శర్మ వొక ఫ్రెండు. శర్మ యివాళ చింతపండు చవుకలో బేరంచేసి కొనడానికి వచ్చాడు. ఎవరికో చెప్పేసి వెళ్తుండగా అరుగుమీది నిలబడివున్న రాజా కనిపించాడు.

లోపలినుంచి సీత వచ్చింది. రాజా స్నేహితుడిని పలుకరించింది. సీత లోపలికివెళ్ళి కాఫీ తయారుచేసి వారిద్దరికీ యిచ్చి తనుకూడా తీసుకుంది. ముక్కాలి పీటలమీద కూర్చుని సాయంకాలపు చల్లని వెలుగులో వచ్చేపోయే వాళ్ళను చూస్తూ మాట్లాడుకుంటున్నారు.

ఒక్కొక్కరూ సుబ్బయ్యగారింటి అరుగు దగ్గరకు చేరసాగారు. కొత్త వ్యక్తి వివరాలు కావాలి వాళ్ళకు. కాని అడిగేందుకు వెళ్ళలేక పోతున్నారు. ఇంతలో బస్తీనుంచి అప్పుడే తిరిగి వచ్చిన భీమయ్య ఆ దారిలోనే వెళ్తూ— రాజా దగ్గిర కూర్చున్న కొత్త వ్యక్తిని చూసి ఆగిపోయి మెల్లగా దారితీశాడు అటువైపుకు. అంతవరకు తటపటాయిస్తున్నవాళ్ళు అతన్ని వెన్నంటివెళ్ళారు.

"బాబుగారూః ఈయన మీ బంధువులాః" అనడిగేడు భీమయ్య.

"రాః భీమయ్యా రాః కూర్చో....ఇతను నా స్నేహితుడు శర్మ—కలెక్టరాఫీసులో పనిచేస్తున్నాడు—ఈయన ఈ వూరి పెద్ద. దగ్గర్లో భూములున్నాయి"పరస్పరం పరిచయం చేసాడు రాజా.

తలపాగా విప్పి గచ్చుమీద దులిపి, అక్కడ కూర్చున్నాడు భీమయ్య. చుట్టూ మిగతావాళ్ళు కూర్చునీ నిలబడీ విడ్డూరంగా చూస్తున్నారు శర్మవంక.

వూళ్ళో సంగతులు మాట్లాడుకున్నారు. క్షణం ఆగి రాజా అన్నాడు: "ఇన్ని రోజులుగా మీ వూరందరి ఆదరణ పొందాము భీమయ్యాః

ఇంక ఒకటి రెండు రోజులలో వెళ్ళిపోతున్నాము."

భీమయ్య తెల్లబోయి చూశాడు. "అదేంవిటి బాబూ! మీరు నెలరోజులుపైగా వుంటానికొచ్చివుండారు. వారంరోజు టయాం వుంది బాబు యింకా....ఏదో బాబూ! సుబ్బయ్యగారి మంచితనమేగాని సుబ్బయ్యగార్ని మేంవ్ చూసుండలేదు. ఈ ఊరి రామమందిరం కట్టించినారంట. పేదోల్లకి దానదరమాలు చేసినారంట. దేవుడ్లాటోరంట....ఉప్పుడా సుబ్బయ్య గోరి మనవరాలిగోరికి మేం కాసింత చెయ్యలేకపోతే మా మనుసుంటదా బాబూ?".

శర్మ ఒక క్షణం ఆగి గొంతు సవరించుకున్నాడు. భీమయ్యవైపు చూసి "నీకు కష్టం కలగొచ్చు—ఒకమాట చెప్పాల్సి వచ్చినందుకు బాధగానూ కొంచెం భయంగాను వుంది భీమయ్యా!—" అన్నాడు.

"ఏంటయ్యా అదీ?—" భీమయ్య జరిగాడు ముందుకు.

"మా రాజాని మీరు క్షమించాలి. మీరంతా అనుకుంటున్నట్లు సీత మీ సుబ్బయ్యగారి మనవరాలుకాదు. రాజా ఒక లక్షాధికారి కొడుకు. సీత భాగ్యవంతుల అమ్మాయి. వీరిద్దరికి నెల రోజుల క్రితం పెండ్లయింది. క్రొత్త దంపతులు కొన్నాళ్లు విహారయాత్ర చేస్తుంటారు. హనీమూన్ అంటాం మేము ఇంగ్లీషులో. అలా సీతగారు—పెద్ద సిటీల్లో తిరగడంకంటె మీ వంటి గ్రామీణ ప్రజలమధ్య తిరగాలని, కలిసి మెలిసి కొన్నాళ్లు గడపాలని కోరుకున్నారు. అందుకనే సుమారు మూడు వందలమైళ్ళ దూరంనుంచి వచ్చి ఈ పల్లె ఎంచుకొని ఇన్నాళ్లుగా మీతో వున్నారు. మీ ఆదరణకి వాళ్లు పొంగిపోతున్నారు. సీతగార్ని మీరు మీ సుబ్బయ్య మనవరాలిగా భావించుకున్నా వాళ్ళకేమీ అభ్యంతరం లేదు....మీకు వాళ్ళు కృతజ్ఞత తెలుపుకుంటున్నారు."

శర్మ చెప్పినంతసేపు రెప్పవేయక నివ్వెరపోయి విన్నారు. అయినా కొంతసేపటికిగాని

అంతా అర్థంకాలేదు. ఏమేమో గుసగుసలు చెలరేగాయి. మొదట తేరుకున్న భీమయ్య అందిర్నీ మందలించి...."సీతమ్మగారు మా మజ్జకి వొచ్చినారంటే మాకెంత గరువం బాబు గారూ! మా సుబ్బయ్యగారి మనవరాలుగోరు కూడా ఇట్టానే వుంటారేమో ఎవరి కెరుకవుతది? ఈ దయ సాలుబాబు మాకు! అరు మీరు పది రోజులు ఈ ఊల్లో వుండాలి బాబూ! అదే మా కోరిక. లేకుంటే మాకు సంతుష్టవదు...." అన్నాడు.

"అంతె—అంతె" అంటూ వంతపాడారు వెనకనున్నవారు.

"మరోమాట. నేను ఊరెళ్లాక మీకు బహుమతిగా కొంత సొమ్ము పంపిస్తాను. దాన్ని మీరు ఈ గ్రామాభివృద్ధికి ఉపయోగించండి." అన్నాడు రాజా.

"ఒద్దు బాబూ! మీరేమిచ్చినా మాకు కష్టమే స్తది. సీతమ్మగారు సుబ్బయ్యగారి మనవరాలుగారే అనుకుంటాం బాబూ" అన్నాడు మరో నడివయసు రైతు.

"మీరేవిచ్చినా — అల్లదుగో సుబ్బయ్యగోరు కట్టిచ్చిన రామ్మందిరంకే ఎట్టండి" అన్నాడు ఒక కుర్రాడు.

"సరే మీ పేర్న మందిరం గోపురం బాగు సేయిస్తాం."

వాళ్ళంతా తమలోతాము మాట్లాడుకుంటూ వెళ్ళిపోతుంటే చూస్తూ "పేదవాళ్లు ధనవంతుల్ని అభిమానించరు, అని నేను, వాళ్ళతో కలిసిమెలిసి తిరిగితే తప్పక అభిమానిస్తారని సీత ఇక్కడకు రాకముందు వాదించుకున్నామోయ్. కాని వీళ్ళతో కలిసి తిరిగాక నా అభిప్రాయం మారింది. సుబ్బయ్య మనవరాలే గెలిచింది" అన్నాడు రాజా సీతవైపు చూస్తూ.

"నా అభిప్రాయం కూడా మారిందోయ్ రాజా! గొప్పవాళ్ళకు పేదవాళ్ళతో కలిసి తిరగడం, మాట్లాడటమంటే అసహ్యం-అనుకునే వాడిని. అలా వాళ్ళతో స్నేహంగా వుండా లనుకునే గొప్పవాళ్ళు కోటికొక్కరు కూడా వుండరనుకున్నాను. ఇవాళ మీరిద్దరూ నా వాదన తలకిందులు చేశారు" అన్నాడు శర్మ.

సీత లోపల ఏమనుకుంటుందో తెలీదు.

ఆ రోజు వాళ్ళకు అతిధిగా వుండి మర్నాడు శర్మ వెళ్ళిపోయాడు.

మరోవారం వుండడానికి నిశ్చయించుకున్నారు ఇరువురూ. వెళ్ళేరోజు దగ్గర పడుతుంటే మనసులు భారమౌతున్నాయి ఇద్దరికీ.

ఆ రోజు రానే వచ్చింది.

మనసులో ఆ ఊరి దృశ్యాన్ని ముద్రించుకుంటున్నట్టు ఓసారి ఊరంతటినీ కలియజూసింది సీత.

బస్సు రోడ్డువరకు వచ్చారు భీమయ్య తదితరులు.

బస్తీకెళ్లే బస్సు దూరంగా వస్తూ కనిపించింది.

"అయ్యా సెలవు తీసుకుంటాము"అన్నాడు భీమయ్య. "బాబూ! దండాలు!" అని ఒకరొకరూ ముందుకు వచ్చి సీతక్కూడా మరీ మరీ చెప్పారు.

అందరి గుండెలు బరువెక్కాయి.

కొందరు తలపాగాలు వూడదీసుకుని కళ్ళు నులుముకున్నారు. ఆడాళ్ళు కొందరు కన్నీరు తుడుచుకోకుండానే నిలబడ్డారు.

సీత బస్సులోకి ఎక్కి చిరునవ్వుతో అందరికీ చేయి వూపింది. "వీలైనప్పుడల్లా మీ ఊరు మాకు వేసవి విడిది అవుతుందిలే భీమయ్యా! నేను రానన్నా మీ సుబ్బయ్య మనవరాలు వూరుకోదు."

బస్సు ఎక్కేముందు రాజా అలా నవ్వుతూ అన్నమాటలు మిగుల్చుకున్నారు ఆ ఊరు వాళ్ళు.

బస్సు కదిలిన తర్వాత కంట్లో ఏదో నలుసు పడిందని కళ్ళు నులుముకుంది సీత.

★

"శ్రీమతి గోమతికి.
నీవు నాభార్యగాచేరి ఈరోజుతో రెండేళ్ళు నిండిందని నీకు గుర్తుందనుకుంటాను. మొన్న మధ్యాహ్నం నువ్వు నా అనుమతిలేకుండా భార్య డ్యూటీ నుండి విరమించుకొన్నట్లు అబ్‌స్కాండ్ అయిన సందర్భంగా నీపై దిగువ తెల్పబడిన ఛార్జెస్ ఫ్రేమ్ చేస్తున్నాను. వీటికి 24 గం॥ లోపుగా సక్రమమైన సంజాయిషీ యిచ్చుకోని పక్షంలో నిన్ను భార్యోద్యోగం నుంచి వూస్టుచేయవలసి వస్తుందని చెబుతున్నాను.

1. పై అధికారుల అనుమతి లేకుండా, ఓరల్‌గా పుట్టింటిఅడ్రసుతెలుపుతూ, కుటుంబ విధుల నిర్వహణలో నిర్లక్ష్యంచూపుతూ పారిపోవటం,

2. ఈ రెండేళ్ళలో నెలపొడుగునా, ముఖ్యంగా నెలాఖరు రోజుల్లోకూడా, జేబులు తడుముతూ, నీ పతిని పరపతికోసం రోడ్లెంబడి తిరిగేటట్లు చేయటం,

3. మా బంధువులతాలూకు పెళ్ళిశుభలేఖలూ గట్రా వస్తే అవి దాచిపెట్టి, నేను అవి మిస్ అయేటట్లు చేసి మీవాళ్ళవి మాత్రం ప్రకటించి, నా కధిక వ్యయాన్ని ప్రయాసను కలిగించటం,

4. ఉద్యోగంలో చేరినప్పటినుండీ పోరు పెడుతున్నా, కుటుంబ నియంత్రణ పద్ధతుల కనుకూలంగాక, నీతో 'పని' చేయాలంటే గుండె దడనుకలిగించటం.

5. నెలపొడుగునా మూడురోజులు నిర్బంధంగా సెలవు తీసుకుంటూ, నాకు వంటింటి కార్యభారాన్ని పెంచి, పడకటింటి మాధుర్యాన్ని తుంచటం,

6. నాతోపాటు హిందీ ఇంగ్లీషు సినిమాలకు రాకుండ, నీ నాయనమ్మ మనస్తత్వంతో తెలుగు సినిమాలకు వెళ్తూ నాకు తలనొప్పి తెప్పించటం.

ఇట్లు నీపై భర్త బాస్ సుబ్బారావు.

* * *

"శ్రీ సుబ్బారావుకు.
సంబోధన చూడగానే త్రుళ్ళిపడ్డాడు సుబ్బారావు. ఇంత అమర్యాదాగానా సంబోధన? ఉక్రోషంతో చదవసాగేడు.

"ఆడదాన్ని అడుగడుగునా అవమానించే మిమ్ముల నిలాపిలవటమే తగును. సహోద్యోగిని కనీసం 'గారూ' అని కూడ అనలేని మీ చెత్త ఛార్జిషీటు నా చంద్రకోల సంజాయిషీ చూడండి.

1. మిమ్ములన్నేను భర్తగా ఆరువేలు పోసి కొనుక్కొని రెండేళ్ళయింది. కనుక మీరే నా క్రింది ఉద్యోగి. పైఉద్యోగి క్రింది వుద్యోగి పర్మిషన్‌తో యేపని చేయడనే పాథమిక సత్యం మీకు తెలీక పోవటం మీఖర్మ. మీమీద హక్కు లున్నావి.

2. దుబారా పరులైన మిమ్మల్ని దోవలో పెట్టటానికేమీవద్ద గుంజిన డబ్బు అప్పుకొరక్కతమరు బిక్కమొహం వేసినప్పుడు మీకే యిచ్చానని గుర్తుచేస్తే ఎలావుంది సార్ మీ మొహం యిప్పుడు?

3. మిమ్ములను నేను ఖర్చుపెట్టి కొన్నుక్కోవటమే పెద్దదండగ. మళ్ళీ మీవాళ్ళ పెళ్ళిళ్ళకు ఖర్చు మరీ దండగ. మావాళ్ళపైన ఖర్చుపెడితే కొంతయినా రీయింబర్సు అవుతుందని నా భావం

4. ఆడదానికి తొందరగా తల్లి నవ్వాలని తపన వుంటుందనే తెలివిలేకుండా, మీరు పని చేసే ఆఫీసులోని పనికిమాలిన శ్యాంపిల్సు అన్నీ నా మొహానపడేస్తుంటే మన సరసం విరసంకాక మరేమవుతుంది?

5. నెలలో మూడు సెలవులు నిర్బంధంగా వుండాలని ప్రకృతి ప్రభుత్వమే పడతికి వరం ప్రసాదించింది. దాన్నికాదంటే మీరు గూడ అవిధేయతకే గురవుతారు.

6. పొరుగింటి పుల్లకూర హిందీ, ఇంగ్లీషు సినిమాలుచూస్తూ, అందులో ఓనమాలు రాక పోయినా రేగుచెట్టు క్రింద గుడ్డాళ్ళైన మీబోటి ఫాల్స్‌ప్రెస్టేజిగాళ్ళ ఆటకట్టింపు నా తెలుగు సినిమాభిమానం. అదిగుణమేనని తెలుసుకోండి రావణుడుగారూ!

మీలాగాకాకుండా, నేను మిమ్మల్ని ఉద్యోగంలోంచి తొలగించిన వుత్తరవులు పంపుతున్నాను. మీ గోవులాంటి గోమతి.

సుచంద్ర మినీకథ ఛార్జిషీట్



వేమనగోపీకి డాక్టరేట్

పురుషులందు పుణ్యపురుషులు వేరయా అన్నాడు వేమన. అలాగే, మేధావుల్లో పండితుల్లో, రచయితల్లో కూడ పుణ్యమేధావుల్లు పుణ్యపండితులూ, పుణ్యరచయితాలూ వేరేవుంటారు. వీరి పుణ్యం సాంఘిక ప్రయోజనం. ఎంతోమంది తీసుకున్నారు యూనివర్శిటీలనుంచి డాక్టరేట్లు, శ్రీనాధుడి శైలిమీదో, భారతంలోని బోంకుమీదో పరిశోధనలుచేసి. గోపీ (ఇప్పుడు డా॥ ఎన్. గోపాల్) సాంఘిక దురాచారాలమీద దుమ్మెత్తిపోసిన మహాకవి వేమన మీద పరిశోధనచేసి ఉస్మానియా యూనివర్శిటీనుంచి డాక్టరేటు అందుకున్నారు. సుమారు నాలుగు సంవత్సరాలు అహర్నిశలూ శ్రమించి, మూడు రాష్ట్రాలలో విస్తృతంగా పర్యటించిన ఫలితంగా (ఈనాలుగేళ్ళలోనూ మిత్రులకి ఆయన "వేమనగోపి" అయ్యారు) వెమన మీద సమగ్రమైన పరిశోధనావ్యాసాన్ని వెలువరించగలిగారు గోపీ. డాక్టర్ గోపాల్ యిప్పుడు హైదరాబాదులోని నానక్‌రామ్ భగవాన్‌దాస్ కళాశాలలో ఆంధ్రభాషోపన్యాసకులుగావున్నారు. వీరి కృషి వేమన జీవితంలోని వెలుగు నీడలను యింకా యింకా తరచి చూడ కోరేవారికి ఉత్తేజకరంగా, ఉపకారిగా వుంటుంది.

సామాజిక శాస్త్రవేత్తకి సాహిత్యంలో డాక్టరేట్

ప్రొఫెసర్, జి ఆర్ క్రిష్ణ (పూర్తి పేరు: గోగినేని రాధాకృష్ణమూర్తి) సమాజశాస్త్రం, పారిశ్రామిక సంబంధాలు, సాంఘిక సేవా శాస్త్రాల్లో అనేక పరిశోధనాత్మక గ్రంధాలు రాశారు. వృత్తిరీత్యా సామాజికశాస్త్ర వేత్త అయినప్పటికి శ్రీకృష్ణకి, ఆంధ్ర ఆంగ్ల సాహిత్యాల్లో ఎంతో అభిరుచీ అభినివేశమూ వుంది. ఆయన తెలుగులో జీవనయాత్ర (నవల) జీవనజ్యోతి (కథను) సమాజశాస్త్ర తొలి పాఠాలు (వ్యాసాలు) సాహిత్యం, జీవితం (విమర్శ) మొదలైన రచనలుచేశారు. ఇంగ్లీషులో ఆయన రచించిన "ROSES AT THE ALTAR" "EXPLORATIONS AND REFLECTIONS", యిత్యాది కావ్యాలు, మార్మిక కవితాలోకంలో మన్నన లందుకున్నాయి.

ఆయన సాహిత్య కృషికి ఫలితంగా యిటీవల అమెరికాలోని ప్రపంచ విశ్వవిద్యాలయం World University Tueson ఆయనకు సాహిత్యంలో 'లిట్' డిగ్రీయిచ్చి గౌరవించింది....గుంటూరు జిల్లాలో జన్మించి, వివిధదేశాలలో విస్తృతంగా పర్యటించిన శ్రీ క్రిష్ణ ప్రస్తుతం మంగుళూర్ లోని "ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంటు స్టడీస్"లో డైరెక్టర్‌గా వున్నారు.



శ్రీశ్రీ గురించి పురిపండాతో కొన్ని క్షణాలు

1976 మే 14 వ తారీఖున సాయంకాలం వైజాగులో పురిపండా అప్పల స్వామిగారిని వారింట్లోనే కలుసుకున్నాను. ఆ వేళ నాతోపాటు స్ఫూర్తిశ్రీగారూ, ఆర్. శ్రీనివాసాచార్య అనే మిత్రుడూ వచ్చారు.

నేను శ్రీశ్రీ కవిత్వం మీద సిద్ధాంత వ్యాసం రాయబోతున్నట్టు పురిపండాతో చెప్పాను. చిరునవ్వుతో అభినందించారు. తరవాత ఇష్టాగోష్ఠిగా మాట్లాడుకున్నాం. జ్ఞాపకం వున్నవాటిని రాస్తున్నాను. (ఏడిద గోపాలరావు ఇంటర్‌వ్యూ చూశాకా).

శ్రీశ్రీ సాహిత్యం పోగుచెయ్యడంలో తాను యధాశక్తిగా సహకరించానన్నారు పురిపండా. శ్రీశ్రీ రచనలెన్నో పోయాయి. పోయినవాటిలో పురిపండాకి ఎక్కువగా నచ్చిన గేయం "కుక్కలు" అనేది. అదెక్కడా అచ్చు కాలేదుట. 1933 ప్రాంతంలోనే అది రాసి వుండొచ్చుట. అందుల్లోంచి రెండే రెండు పాదాలు తనకు జ్ఞాపకం వున్నాయన్నారు.

"కొన్ని పరాసు కన్నెల తొడలమీదగానీ
పవ్వళించమంటాయి
కొన్ని కేవలం రుషులు!"

ఈ చరణాలను శ్రీశ్రీ చదువుతూంటే ఆ రోజుల్లో ఉల్లి తిరుపతి (ఇతడ్ని గురించి సిరిసిరి మువ్వ శతకంలో ఒక పద్యం కూడా వుంది) ఇరిటేట్ అయిపోతూ వుండేవాడుట. ఈ తిరుపతి ఒక ఋషిలాగుండటమే అందుకు కారణం! "రాస్కెల్! ఇది నువ్వు నామీదే రాశావ్" అనేవాడుట శ్రీశ్రీని తిరుపతి. ఈ తిరుపతి గడ్డాలూ మీసాలూ పెంచుకుని అరవిందయోగిలా కనిపించేవాడుట. కృష్ణ శాస్త్రిగారు కూడా తిరుపతిమీద కొన్ని బూతులు ధ్వనించే పద్యాలు రాశారుట ఆ రోజుల్లో. ఉల్లి తిరుపతి అరవిందాశ్రమానికి వెళ్ళొచ్చినవాడు. అందుకే అరవిందయోగిలా పిల్లిగడ్డం పెంచుకుంటూ అనుకరించేవాడు. ఈ తిరుపతికి ఆడపిల్లలంటే విపరీతమైన మోజు. ఇతను కులానికి కోమటి. తరుచుగా భోగం వాళ్ళింటికి పోతూవుండేవాడు. అక్కడ వాళ్ళను చూస్తూ కాలక్షేపం చేయడమే తప్ప విషయవాంఛ ప్రదర్శించే బాపతు కాదు. మోడరన్ పొయిట్సు అంటే ఇతను పడి చచ్చేవాడు. ఎన్నో ఇంగ్లీషు పుస్తకాలు చదివేశాడు. శ్రీశ్రీతో చనువుగా వుండేవాడు.

శ్రీశ్రీతో తన స్నేహం నిజంగా తన అదృష్టం అన్నారు పురిపండా. తను "కవితా సమితి"ని స్థాపించడానికి ఆ రోజుల్లో "సాహితీ సమితి"యే కారణం అన్నారు.

"దివ్యలోచనాలు" అనే పద్యాల్ని పట్టుకుని శ్రీనివాసరావు (శ్రీశ్రీ) అనే కుర్రవాడు తన యింటికి ఎవరితోనో కలిసి రావడం గురించి వర్ణించి చెప్పారు పురిపండా. పురిపండా ఆ రోజుల్లో (1926) "స్వశక్తి" అనే పత్రికకి ఎడిటర్‌గా వుండేవారు. "స్వశక్తి" కాంగ్రెసు వాళ్ళ పేపరు. "దివ్యలోచనాలు" పద్యాలు స్వశక్తిలో అచ్చయ్యాయి. ఈ పద్యాలు పురిపండాకు ఎంతో నచ్చాయి. అందువల్లనే వాటిని

వెంటనే అచ్చుకిచ్చా రాయన. అయితే స్వశక్తి అప్పట్లో కాకినాడలో ప్రింటవుతూ వుండేది. ఈ పద్యాలను కాకినాడ పంపించి ఆ వారం పత్రికలోనే అవి రావాలని పురిపండా రాశారుట.

శ్రీశ్రీ సాహిత్యం అచ్చయిపోయాకా (1970) శ్రీశ్రీ రాసిన సాహిత్యలేఖలు కొన్ని తన రికార్డుల్లోంచి బయటపడితే, వాటిని కె. వి. రమణారెడ్డి కిచ్చాననన్నారు పురిపండా.

ప్రపంచంలో ఏ నవ్యత వచ్చినా దాన్ని అభిమానించడం శ్రీశ్రీ తత్వం అన్నారు పురిపండా. అందుకే శ్రీశ్రీలో పరిణామాలెక్కువగా కనిపిస్తాయంటా రాయన. దిగంబర కవుల్ని అభిమానించడానికి కారణం ఈ నవ్యతా ప్రీతే అంటారు పురిపండా.

శ్రీశ్రీ ఆస్తికుడో నాస్తికుడో నిర్ణయించడం కష్టం. అతని సాహితీసృష్టి కది సరిహద్దు కాదు. ఇటీవల ఎప్పుడో బరంపురం వెళితే, అక్కడి మిత్రులు శ్రీశ్రీని అమ్మవారి సుప్రభాతం రాయమన్నారుట. శ్రీశ్రీ వెంటనే రాశాడు దాన్ని. శ్రీశ్రీ ఒక పసివాడు అంటారు పురిపండా.

శ్రీశ్రీ గేయాల్ని హిందీలోకి అనువదించిన వాళ్ళిద్దరున్నారని పేర్కొన్నారు పురిపండా. ఒకరు గుర్రం సుబ్బారావు, జగ్గయ్యపేట. రెండు సూర్యనారాయణభాను, గుంటూరు.

వెల్చేరు నారాయణరావు రాసిన విప్లవ కవితా స్వరూపానికి శ్రీశ్రీ ఒక జడ్జీగా వ్యవహరించాడన్నారు పురిపండా.

శ్రీశ్రీ కమ్యూనిస్టు కాదనీ కమ్యూనిస్టులే అతణ్ని తమవాణ్నిగా చేసుకున్నారనీ పురిపండా కామెంటు.

శ్రీశ్రీ విశ్వనాథనీ పురిపండా కృష్ణశాస్త్రినీ ఆ రోజుల్లో ఎక్కువగా అభిమానిస్తూ వుండే వారుట. విశ్వనాథప్రియతే శ్రీశ్రీచేత "బాధా సర్పదష్టులు" వంటి సమాసాలను రాయించిందంటారు పురిపండా. అబ్బూరి ప్రభావం కూడా శ్రీశ్రీ మీద వుందన్నారు.

శ్రీశ్రీ విప్లవ కవిత్వం రాసినా ప్రభుత్వం అతణ్ని అదుపులోకి తీసుకోకపోవడానికి కారణాన్ని పురిపండా చమత్కరించారు. శ్రీశ్రీ వల్ల ఎవరికీ ఏ ప్రమాదమూ లేదని ప్రభుత్వానికి కూడా తెలుసు—అని.


స్రియలిస్టు— డాడాయిస్టు పద్ధతిలో కవిత్వం రాయడం తనకిష్టం. ముగ్గురు కూచున్నపుడు (శ్రీశ్రీ, ఆరుద్ర, పురిపండా) ముగ్గురూ మూడు వాక్యాలు రాయడం లేదా మూడు మాటలు చెప్పడం—అదే కవిత్వం అనేవారుట శ్రీశ్రీ. అలాగే ఒక వాక్యాన్ని కాగితంమీద రాసి ముక్కలుగా కత్తిరించి వాటిని రకరకాలుగా పేర్చటం అదొక కవితా ప్రయోగం.

శ్రీశ్రీ రచనలను దేశంలో ఎంతోమంది దాచుకుంటూ వుండేవారు. మాజీరాష్ట్రపతి రాధాకృష్ణన్‌గారి కోడలు అలాంటి వారిలో ఒకరని వుదాహించారు పురిపండా.

తరవాత శ్రీశ్రీ ఫోటోలను చూపించారు.

'జ్యోతి శ్రీశ్రీ నిధి'కి విరాళమివ్వండి!

శ్రీశ్రీ నిర్వహించు పదబంధ ప్రహేళిక



ఆధారం [illegible]సెంబరు '79

అడ్డం

1. కాం
3. టాగూరు నవలలో నాస్తికుడు
5. ప్రాజెక్టు స్థలం
7. దిక్కు
9. కుశ-నాటకం
10. భారత చక్రవర్తి
12. ముందు చూస్తే ఇది!
13. [illegible]
16. పాండవులు వాడిన చెట్టు
17. నిద్రపుచ్చేది నల్లమందు కాదు.
18. కొందరి కూతపదం
20. 21. నిలువు పని కావలిస్తే పడవలసిందే
22. రం కలిస్తే ఓగిరం
23. నీటిలో నిప్పు పుట్టించేది
25. వస్తాడు
27. చల్లని వెన్నెలరేయి
29. రావణేశ్వరం
31. [illegible]

నిలువు

1. అల్లసాని వాడకం అంతా చీకటి
2. గాలిని గానం చేస్తుంది
3. అడ్డు-విభజిస్తుంది
4. ఈ మధ్యనే విడుదలయింది
5. కొలమానం
6. తప్పక పాడాలి
7. డాక్యుమెంటరీ నిపుణుడు
8. వాలడం 7 అడ్డులో
11. కొలమానం
14. ప్రాసించని ద్విపద
15. ఇటు కర్ర అటు రాయి
18. అతకార పురాణం చాలా బరువు
19. మొదట ముందు పిదప వెనుక
20. చూ. 21 అడ్డం
22. ఊర్పు
23. తెగిస్తారు కొందరు
24. తేల్చుకుంటారు కొందరు
26. పెట్టు—మగడు?
28. తెలుగు యతి
30. పడితే రొష్టై నేతిల్లో పడవచ్చు.

నవంబర్ పదబంధ ప్రహేళికకు సమాధానాలు:

అడ్డం: 1. దిశ. 3. వాన. 5. సగంవంతు. 7. తరువోజ. 9. రిబ 10. చహరా. 12. దగా 13. రమ. 15. గయ. 16. నక్క. 17. వారి. 18. అవి. 20. మహా. 22. వినా. 23. వాహనం. 25. లాగు. 27. శకారుడు. 29. బిల హరి 31. రిత్త. 32. బలం.

నిలువు: 1. దిగంబర. 2. శివం. 3. వారు. 4. నవోదయ. 5. సరి. 6. తుచ. 7. తర 8. జగా. 9. హరీ. 14. మనవి. 15. గరిమ. 18. అనాకారి. 19. గుహ. 21. హాలాహలం. 22. విశ. 23. వాడు. 24. నంబి. 26. గురి. 28. రుత్త. 30. లబ.

నిబంధనలు గమనించండి!

పదబంధ ప్రహేళిక కొట్టివేతలు, దిద్దుబాట్లూ లేకుండా పూర్తిచేసి నవంబరు 25 వ తేదీలోపు మాకు చేరునట్లు పంపండి. తెల్లకాగితం మీద గళ్ళు గీసి పూర్తిచేసి పంపిన ఎంట్రీలు చెల్లవు. ఎంట్రీలు పంపువారు వారి పూర్తి చిరునామా ఎంట్రీపైనే రాసి పంపాలి. ఆల్ కరెక్ట్ ఎంట్రీకి రు. 50/- బహుమతి. ఒకటికి మించి ఆల్ కరెక్ట్ ఎంట్రీలు వొచ్చినప్పుడు బహుమతి సొమ్ము విజేతలకు సమానంగా పంచబడు తుంది. ఆల్‌కరెక్ట్ ఎంట్రీ ఒకటీ రాకపోతే బహుమతి సొమ్ము పై నెల బహుమతి సొమ్ముకు కలిపి అందజేయబడుతుంది.

గతసంచిక పదబంధ ప్రహేళిక విజేతలు

1. టి. వేణుగోపాల్, బరంపురం, 2. కె. జె. ఎమ్. కృష్ణారావు, ఏలూరు. 3. ఎమ్. హెచ్. వి. సుబ్బారావు, గుంటూరు. 4. ఏ. వి. సుబ్రహ్మణ్యం, గార. 5. కె. వి. ఎన్. ఆచార్య, హైదరాబాద్. 6. జె. విద్యాసాగర్, హైదరాబాద్. 7. పి. సరస్వతి, మలికిపురం. 8. అలపర్తి వెంకటసుబ్బారావు, నందివెలుగు. 9. పి.వి. కృష్ణయ్య, విశాఖపట్నం.



"బాపురే!" మార్కు చిత్రాల దర్శకుడు బాపు

భాషలలో (అంతర్జాతీయ బాలల సంవత్సరాన్ని పురస్కరించుకొని) ఒక బాలల వర్ణ చిత్రం నిర్మిస్తున్నారు.

షూటింగ్ యీనెల 17వ తేది మద్రాసులోని ఒక భవనంలో ముహూర్తం షాట్‌తో ఆరంభమైంది. 11వ తేది నుంచీ, శృంగేరి, చిక్‌మగళూర్, మైసూర్, బెంగుళూరు ప్రాంతాలలో మూడు భాషలలో ఒకేసారి 35 రోజులపాటు నిర్మాణం జరుగుతోంది—డిసెంబర్ ప్రాంతాలలో ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్నాటక రాష్ట్రాలలో ఒకేరోజున విడుదల చేయడానికి నిర్మాత పకడ్బందీగా సన్నాహాలు చేస్తున్నారు.

కెమెరా, దర్శకత్వం: ఎమ్.సి. శేఖర్ నిర్వహిస్తున్నారు. స్క్రిప్టు: మణివణ్ణన్ సమకూర్చారు. ఈ చిత్రంలో జానకి, కాంతారావు, శరత్‌బాబు, త్యాగరాజు, సుదర్శన్ ముఖ్య నటవర్గం. తమిళంలో జానకి, జి. శ్రీనివాసన్, వి. గోపాలకృష్ణన్, శరత్‌బాబు, సుదర్శన్ పాల్గొంటారు. అలాగే కన్నడంలో జానకి, అశ్వర్థ, లోకేష్, శరత్‌బాబు, సుదర్శన్ నటిస్తారు. వీరుగాక 12 మంది పిల్లలుకూడా పాల్గొంటారు.

తెలుగు సంభాషణలు: సత్యారెడ్డి, జి. ఎల్. రాశారు.

తమిళ సంభాషణలు: మణివణ్ణన్, పాటలు కణ్ణదాసన్ వ్రాయగా కన్నడంలో మాటలు; పాటలు హుంసూర్ కృష్ణమూర్తి రచించారు. సంగీతం: సత్యం నిర్వహిస్తారు. చిత్రంలో మొత్తం నాలుగు పాటలున్నాయి. సెప్టెంబర్ 26న రికార్డింగ్ జరిగింది.

చిలిపి వయసు

పదిమందిలో కలుపుగోలుగా తిరిగే యువతిని చెడిపోయినదాన్నిగా పదిమంది భావిస్తారు. ఆధునికంగా వుండటం చెడిపోవడం కాదు. ఉత్తమత్వం అనేది ఆయా వ్యక్తుల సంస్కారంమీద ఆధారపడి వుంటుందని చెపుతుంది జయపద్మా మూవీస్ "చిలిపి వయసు."

ఇందులో అల్లరిపిల్లగా రాధిక. నిండుగా పమిట కప్పుకొని గడుసరిగా తెరచాటున తిరిగే అమ్మాయిగా మీరా నటిస్తున్నారు— అనేక విజయవంతం అయిన తమిళ చిత్రాలకు దర్శకత్వం వహించిన ఎం. ఏ. ఖాజా యీ చిత్రంద్వారా తెలుగు చిత్రరంగంలోకి ప్రవేశిస్తున్నారు.

సుధాకర్ కథానాయకుడుగా నటిస్తున్న ఈ చిత్రంలో ఎం. రంగారావు, కాంతారావు, పద్మనాభం, రావికొండలరావు, రాధాకుమారి, సూర్యకాంతం. మొదలైనవారు కూడా వున్నారు.

మాటలు, పాటలు: రాజశ్రీ, అప్పలాచార్య, కెమెరా: బాలు, సంగీతం: శంకర్‌గణేశ్,



'చిలిపి వయసు'లో మీరా

సహ నిర్మాత: శ్రీమతి కె. టి. రమణి, కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: ఎం. ఏ. ఖాజా.

మాధవరావు కొత్త చిత్రం!

టి. మాధవరావు దర్శకత్వంలో భార్గవ ఆర్ట్ క్రియేషన్స్ తలపెట్టిన కలర్ చిత్రం "భాగ్యజ్యోతి" పాటల రికార్డింగ్ అక్టోబర్ 10 ఉదయం విజయా గార్డెన్స్‌లో జరిగింది. మహదేవన్ సంగీత దర్శకత్వంలో ఆత్రేయ రాసిన ఒక పాటని ఎస్. జానకి పాడారు.

చిత్రంలోని ఆరు పాటలను ఆత్రేయ రాశారు. సంభాషణలు: నాగభైరవ.

కథ: డా. నరసింహాచారి, కెమెరా: ఉదయ రాజ్, ఆర్ట్: లీలాకృష్ణ.



'సమాధి కడుతున్నాం చందాలివ్వండి' వర్కింగ్ స్టిల్

చిత్రం షూటింగ్ నవంబర్ 15 నుంచి నెల్లూరు పరిసర ప్రాంతాల్లో ముప్పైఐదు రోజులపాటు నిర్విరామంగా ఒకే షెడ్యూలులో జరుగుతుంది—పాత కొత్త నటీనటుల కలయికలో రూపొందుతున్న యీ చిత్రం ద్వారా ఒక నూతన కథానాయిక కూడా పరిచయం అవుతున్నది—రాంబాబు, భాస్కర్, శశాంక, టి. రాజేశ్వరి, భానుప్రకాష్, ఆర్. పి. యస్. రామస్వామి, కాశీ, నారాయణ మొదలైనవారు నటిస్తున్నారు.

స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: టి. మాధవరావు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: డా. నరసింహాచారి, సమర్పణ: ఆచార్య కృష్ణ.

దేవదాసు 'నాగమల్లి'

అభిరుచిగల యువ దర్శకుడు దేవదాసు దర్శకత్వంలో రూపొందబోతున్న వి. ఆర్ ఇంటర్నేషనల్ నాగమల్లి భారీ వర్ణచిత్రంలో చంద్రమోహన్ కథానాయకుడుగా నటిస్తున్నాడు.

ఇద్దరు నూతన కథానాయికలను పరిచయం చేయడంకోసం నిర్మాతలు, దర్శకుడూ ఆంధ్రదేశంలోని ముఖ్య పట్టణాలతోపాటు బొంబాయి కలకత్తా, ఢిల్లీ వంటి నగరాలు కూడా తిరిగి వచ్చారు! అనేక నాటక ప్రదర్శనలు, మరాఠీ, గుజరాతీ, బెంగాలీ చిత్రాల్నీ చూశారు. కొన్ని నగరాలలో అందాల పోటీలలో గెలిచిన అమ్మాయిల్ని కూడా చూశారు.

డ్రీమ్‌గర్ల్ అనే మాటకి పర్యాయపదాలన దగిన ఇద్దరు కథానాయికలకోసం, విసుగూ విరామం లేకుండా దర్శకుడు దేవదాసు సాగిస్తున్న అన్వేషణ ఆశ్చర్యకొల్పుతోంది. 'నాగమల్లి' సంగీతం కూడా యిప్పుడున్న ధోరణిలో కాకుండా, 'సౌండ్ ఆఫ్ మ్యూజిక్' 'మై ఫెయిర్ లేడీ' వంటి సంగీతాత్మక చిత్రాల పద్ధతిలో వుంటుందని తెలుస్తోంది.

అరకు లోయలో అవుట్‌డోర్ షూటింగ్ జరుగుతుంది. సుప్రసిద్ధ సినిమాటోగ్రాఫర్ వి. ఎన్. రెడ్డి వద్ద అనేక సంవత్సరాలు శిష్యరికం చేసిన ఆర్. ఎం. భల్లా ఈ ఛాయాగ్రహణ బాధ్యత స్వీకరించారు. పూరబ్ ఔర

పశ్చిమ్, ఉపకార్ వంటి చిత్రాలకి ఆపరేటివ్ కెమెరామన్‌గా అసాధారణ నిపుణత ప్రదర్శించారు. నవంబర్ ఇరవైఆరు నుంచి వారం రోజులు పాటల రికార్డింగు జరుగుతుంది— షూటింగు నూతన సంవత్సరంలో ఫిబ్రవరి ఇరవై నుంచి ఆరంభం అవుతుంది. చిత్రకథ: కె. శ్రీనివాస్, సంగీత దర్శకత్వం: రాజన్-నాగేంద్ర, స్క్రీన్ ప్లే: ఎం. వి. ఎల్, దేవదాసు, మాటలు: జంధ్యాల. ఇంతవరకు ఎన్నికయిన తారాగణం: చంద్రమోహన్, నూతన్ ప్రసాద్, నిర్మాత: డి. భాస్కరవర్మ, దర్శకత్వం: దేవదాస్ కనకాల.

డి. ఎస్. ప్రకాశరావు తాజా చిత్రం!

డి. ఎస్. ప్రకాశరావు నూతన సంస్థ పద్మసాయి ఆర్ట్ పిక్చర్స్‌వారి తొలి వర్ణచిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు.

ఆత్రేయ, దాశరధి రచించిన నాలుగు పాటలను అతి నిరాడంబరంగా రికార్డు చేశారు. జె. వి. రాఘవులు సంగీత దర్శకత్వంలో ఎస్. పి. సుశీల, ఎస్. జానకి ఆ గీతాలను ఆలపించారు.

కె. విజయ తొలిసారిగా తెలుగులో ద్విపాత్రాభినయం చేసిన యీ చిత్రంలోని ఇతర పాత్రలను కాకరాల, ఈశ్వరరావు, వంకాయల, నాగేంద్రబాబు, గిరిజారాణి, శ్రీశైలజ పోషించారు.

కెమెరా: యోగానంద్, సంగీతం: ఎస్. హనుమంతరావు, ఎడిటింగ్: వీరప్ప, కథ, మాటలు: విజయరత్నం, నిర్మాతలు: వి. కృష్ణయ్య, ఎస్. నాగరాజు, సమర్పణ: కె.ఎస్. మస్తాన్.

'రాధ'లో శ్రీదేవి, రజనీకాంత్





'మనవూరి మారుతి'లో
ప్రభ

'మా భూమి' సెన్సారైంది!

ప్రముఖ బెంగాలీ డాక్యుమెంటరీ చిత్ర దర్శకుడు గౌతమ్ ఘోష్ దర్శకత్వంలో చైతన్య చిత్ర ఇంటర్నేషనల్ వారు నిర్మించిన "మా భూమి" అక్టోబర్ మూడవ వారంలో సెన్సారైంది. అతిత్వరలో ఈ చిత్రాన్ని విడుదల చేయడానికి నిర్మాతలు బి. నరసింగరావు, జి. రవీంద్రనాథ్ సన్నాహాలు చేస్తున్నారు.

వ్యక్తిత్వ పరిమళం పురి విప్పెడు మనసు!

అంతరంగంలో అణిగి మణిగి వున్న కోరికలు, అవకాశం దొరికినప్పుడు మనం అనుకోకుండానే బయటికి దూకుతుంటాయి. విచక్షణ మూగబోతుంది. అంతా అయ్యాక మనచుట్టూ వున్న లోకం గుర్తొస్తుంది. నిత్య జీవిత మానసిక సంబంధాలు గాయంలో వేళ్లు పెట్టి అనుక్షణం కెలుకుతుంటాయి. విస్తారమైన జీవితానుభవాలకి వున్నది ఒక గుప్పెడు మనసే. ఎన్ని బాధల్నీ, ఎన్ని రంపపు కోతల్నీ భరించగలదది; ఎగిరి దూకుతుంది ఏ తొమ్మిదో అంతస్తు మీదినుంచో, తన ఉనికి కూడా తెలియకుండా శరీరం పుష్పొడిగా మారి, తన వ్యక్తిత్వ పరిమళం గాలిలో కలిసి గుబాళించేట్టు. చూసితీరాలి సరితని కె. బాలచందర్‌గారి "గుప్పెడు మనసు"లో. ఎం.ఎస్. రెడ్డిగారు అక్టోబర్ 26 న పత్రికలవారికి ప్రత్యేకంగా చూపించా రీ చిత్రాన్ని.

—దేవీదాస్

Edited&Published by V. Leelavathy Raghavaiah, at 17B Rajaram Colony Kodambakkam, Madras-600024&Printed by D. Hanumantha Rao at Kranti Press, 12, Francis Joseph Street, Madras-600001-